తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-3-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 47 పేజీలు: 8+16 వెల: 6.50

కరీంనగర్

: fb.com/vaartha Digital

epaper.vaartha.com

WWW.VAARTHA.COM



## అవనికి చేరిన సునీత

అంతరిక్షం నుంచి మొత్తం నలుగురు వ్యోమగాములను తీసుకొచ్చిన స్పేస్ ఎక్స్

తొమ్మిది నెలలుగా రోదసిలో ఉన్న సునీత, మిగిలిన ముగ్గురు

తెల్లవారు జామున 3.27 గం.కు ఫ్లోరిడా సముద్ర జలాల్లో దిగిన వైనం

వారిని హ్యూస్టన్‌లోని స్పేస్ సెంటర్‌కు తరలించిన సిబ్బంది

**ఫ్లోరిడా, మార్చి 19:** అంతర్జాతీయ స్పేస్‌స్టేషన్‌లో తొమ్మిదినెలలపాటు గడిపిన భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్‌తోపాటు బుచ్ విల్మోర్ మరో ఇద్దరు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకోగలిగారు. బుధవారం తెల్లవారుఝామున 3.27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలోని సముద్రజలాల్లో దిగారు. ఆమెతోపాటు ఇతర వ్యోమగాములు >>2

## ఏ శాఖకు ఎంతెంత!

వ్యవసాయ శాఖ రూ.24,439 కోట్లు

రైతు భరోసా పథకం రూ.18,000 కోట్లు

పౌర సరఫరాల శాఖ రూ.5,734 కోట్లు

విద్యా శాఖ రూ.23,108 కోట్లు

కార్మిక, ఉపాధి కల్పన శాఖ రూ.900 కోట్లు

పంచాయతి, గ్రామీణాభివృద్ధి రూ.31,605 కోటు

మహిళా శిశు సంక్షేమం రూ.2,862 కోట్లు

షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సంక్షేమం రూ.40,232 కోట్లు

షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) సంక్షేమం రూ.17,169 కోట్లు

బిసి సంక్షేమ శాఖ రూ.11,405 కోట్లు

మైనారిటీ సంక్షేమ శాఖ రూ.3,591 కోట్లు

పరిశ్రమల శాఖ రూ.3,527 కోట్లు

విద్యుత్ శాఖ రూ.21,221 కోట్లు

వైద్య, ఆరోగ్య శాఖ రూ.12,393 కోట్లు

మున్సిపల్, పట్టణాభివృద్ధి రూ.17,677 కోట్లు

నీటి పారుదల శాఖ రూ.23,373 కోటు

రోడ్లు, భవనాల శాఖ 5,907 కోట్లు

అడవులు, పర్యావరణ శాఖ రూ.1,023 కోట్లు

హోం శాఖ రూ.10,188 కోట్లు

## మొత్తం పద్దు రూ. 3,04,965 కోట్లు




# సంక్షేమ 'గ్యారంటీ'

## 2025-26 బడ్జెట్‌ను అసెంబ్లీకి సమర్పించిన డి.సిఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క



బుధవారం శాసనసభలో బడ్జెన్‌ను ప్రవేశపెడుతున్న డి.సిఎం భట్టి విక్రమార్క

రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు

పదేళ్లలో వెయ్యిబిలియన్ డాలర్ల వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం

తెలంగాణ తలసరి ఆదాయం దేశ సగటు కంటే అధికం

ఇందిరా మహిళా శక్తి మిషనన్‌తో వెయ్యి మె.వా సోలార్ విద్యుత్ ఉత్పత్తి

**హైదరాబాద్, మార్చి 19,ప్రభాతవార్త:** తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టారు.రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ప్రతిపాదిస్తు శాసనసభ సభ్యుల ఆమోదం కోసం ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క సభకు సమర్పించారు. రాష్ట్రం అప్పులు రూ.5,04,814 కోట్లుగా ఉందని వివరించారు.శాసనసభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క " ప్రజాప్రయోజనాలే ధ్యేయంగా, పారదర్శకత, జవాబుదారీతనంతో సాగుతున్న మా ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉంది. సంక్షేమం-అభివృద్ధిని సమపాళ్ళలో రంగరించి జోడుగుర్రాల తరహా సుపరిపాలన రథాన్ని పరుగులు పెట్టించడంలో సఫలికృతం అయ్యామని రాష్ట్ర ప్రజలకు తెలియజేయుచున్నాను" అంటూ బడ్జెట్ ప్రసంగం స్పీకర్ ఆమోదంతో ఉదయం 11.07 మొదలు పెట్టి మధ్నాహ్నాం 12:53 వరకు కొనసాగించారు."నిజం కూడా ప్రతి రోజు ప్రచారంలో ఉండాలి, లేదంటే అబద్ధం నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నేకాదు ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుంది" అంటూ ఆర్థిక మంత్రి >>2

## కొత్తగా 'గిరివికాసం'

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు భారీ కేటాయింపులు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణలో సామాజిక న్యాయం దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో సంక్షేమానికి అగ్రస్థానం కల్పించింది. రాష్ట్ర వార్షిక బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి భారీగా కేటాయింపులు చేశారు. ఈ నాలుగింటికి కలిపి రూ.72,397 కోట్లను కేటాయించారు. వీటిలో ఎస్సీ సంక్షేమానికి అత్యధిక కేటాయింపులు చేశారు. ఇందులో ఒక్క ఎస్సీ అభివృద్ధికే రూ.40,232 కోట్లు కేటాయించడం గమనార్హం. ఇక మిగిలిన బీసీ సంక్షేమ శాఖకు రూ.11,405 కోట్లు కేటాయించగా ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వ కేటాయింపులతో పోలిస్తే అధికంగా ఉంది. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం మొత్తం బడ్జెట్ రూ. 2,90,396 కోట్లు ప్రతిపాదించగా అందులో బీసీ సంక్షేమానికి రూ. 6,229 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొట్ట మొదటి వార్షిక బడ్జెట్‌లో దాదాపు రెట్టింపు చొప్పున రూ.11,405 కోట్లను బీసీ సంక్షేమ శాఖకు కేటాయించడం జరిగింది. ఇందులో ఎక్కువ భాగం వెనకబడిన కులాల పథకాలకు సంబంధించి ఖర్చు చేయనున్నారు. అలాగే ఎస్టీ సంక్షేమానికి రూ. 17,169 కోట్లు, ఆ తర్వాత బీసీ సంక్షేమానికి రూ.11,405 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లను కేటాయించారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమానాభివృద్ధి పట్ల నిబద్ధతను నిలుపుకునేలా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం తీసుకొచ్చినట్లు బడ్జెట్‌లో ప్రసావించారు. ఇందులో 59 ఎస్సీ >>2



## సాగుకు పెద్ద పీట

### వ్యవసాయానికి రూ.42,439 కోట్లు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** వ్యవసాయనికి తెలంగాణ సర్కార్ పెద్ద పీట వేసింది. శాసనసభలో ప్రవేశ పెట్టిన వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం అంచనా బడ్జెట్ రూ.3,04,965 కోట్లు కాగా, అందులో ఏకంగా వ్యవసాయ శాఖకు రూ.42,439 కోట్లను కేటాయించింది. ఇందులో రైతు భరోసా పథకానికి గాను రూ.18 వేల కోట్లు మంజూరు చేసింది. మిగిలిన రూ.24,439 కోట్లు వ్యవసాయానికి కేటాయించింది. ఇటీవలే ప్రభుత్వం మూడు ఎకరాల లోపు ఉన్న 44.82 >>2

## మోడీతో బిల్‌గేట్స్ భేటీ!

కేంద్రమంత్రులు నడ్డా, చౌహాన్‌లతోనూ చర్చలు



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన బిల్‌గేట్స్

**న్యూఢిల్లీ, మార్చి 19:** మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకులు, భూరి విరాళాల దాత బిల్‌గేట్స్ బుధవారం ప్రధాని నరేంద్రమోడీ, ఇతర సీనియర్ నాయకులను కలుసుకున్నారు. ప్రధానిమోడీని కలిసిన బిల్‌గేట్స్ అనేక అంశాల్లో భారత్ శరవేగంగా అభివృద్ధిచెందుతున్నదని ప్రశంసించారు. టెక్నాలజీ, హెల్త్‌కేర్, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్ వృద్ధి రంగాల్లో భారత్ వేగంగా దూసుకుపోతున్నదని అన్నారు. >>2

## ఎస్సీ వర్గీకరణపై 'సుప్రీం'లో వాదనలు బలంగా వినిపించాం

మంద కృష్ణతో విభేదం లేదు..

అభినందన సభలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున బలంగా వాదనలు వినిపించామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఏళ్లుగా వాయిదా పడుతున్న కేసులో బలమైన వాదనలతో అత్యున్నత న్యాయస్థానాన్ని మెప్పించామని అన్నారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న చోట కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని, ఎస్సీ వర్గాలకు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడైనా న్యాయం చేయాలని బలంగా నమ్మానని, సమన్వయం చేసుకుంటూ అసెంబ్లీలో అందరినీ కూడగట్టామని తెలిపారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బుధవారం మాదిగ సంఘాల నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున అసెంబ్లీకి హాజరై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ >>2



బుధవారం ఢిల్లీలో గల్లీ క్రికెట్ ఆడుతున్న న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్

## ఢిల్లీలో న్యూజిలాండ్ పిఎం 'గల్లీ' క్రికెట్!

**న్యూఢిల్లీ, మార్చి 19:** భారత్ పర్యటనలో ఉన్న న్యూజిలాండ్‌ప్రధాని క్రిస్టోఫర్ లక్సాన్ ఢిల్లీ వీధుల్లో చిన్నారులతోకలిసి క్రికెట్ ఆడారు. కివీస్ మాజీ ఆటగాడు రాస్ టేలర్‌కూడా వీరితో ఉన్నారు. >>2

## హైదరాబాద్‌లో మెక్‌డోనాల్డ్ గ్లోబల్ కార్యాలయం

రాష్ట్ర ప్రభుత్వంతో సంస్థ పెట్టుబడుల ఒప్పందం

సంస్థ చైర్మన్, సిఇఒలతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చలు



బుధవారం హైదరాబాద్‌లో మెక్ డొనాల్డ్స్ చైర్మన్, సిఇఒ క్రిస్ కెంప్కెజెన్స్కికి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ సంస్థ మెక్ డోనాల్డ్స్ తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుంది. సంస్థ విస్తరణలో భాగంగా మెక్ డొనాల్డ్స్ ఇండియా గ్లోబల్ ఆఫీస్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. 2,000 మంది ఉద్యోగులతో మెక్ డొనాల్డ్ గ్లోబల్ ఇండియా ఆఫీసును ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం అసెంబ్లీ లోని ఛాంబర్లో మెక్ డొనాల్డ్స్ చైర్మన్, సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కితో పాటు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తమ గ్లోబల్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి మెక్ డొనాల్డ్స్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పెట్టుబడుల ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. మెక్‌డొనాల్డ్స్ ప్రతినిధుల బృందంలో సీఈవోతో పాటు గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై ఆండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండియా హెడ్ దేశాంత కైలా చర్చల్లో ఉన్నారు. మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ సెంటర్ తమ రాష్ట్రంలోనే పోటీ చేయాలని పలు రాష్ట్రాలు పోటీ పడుతున్న సందర్భంలో మెక్ డొనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోవటం గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం తరఫున ఉత్తమమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా సిఎం వివరించారు.సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమైన ఉద్యోగులను >>2

## అది అంకెల గారడీ బడ్జెట్

-కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంచనాలు భారీగా ఉన్నాయని, కేటాయింపులు, అమల్లో మాత్రం సారీ అని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేంద్ర మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనంగా ఉందన్నారు. అట్టహాసంగా ప్రకటించిన గ్యారెంటీల అమలుపై ప్రజలు ఆశలు వదులుకునేలా పద్దుల రూపకల్పన చేశారన్నారు. అంకెల గారడీతో తెలంగాణ ప్రజలను >>2

# సాగుకు పెద్ద పీట

>> లక్షల మంది రైతులకు రూ.3,487.82 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసింది. మిగతా వారికి త్వరలో నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు కేటాయించడంతో త్వరలోనే పెండింగ్‌లో ఉన్న మిగిలిన అన్నదాతల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం డబ్బులు అందనున్నాయి. రాష్ట్రంలో రైతులు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేసేందుకు, పెట్టుబడి పెట్టేందుకు జనవరి 26, 2025న రైతు భరోసా పథకాన్ని ప్రారంభించగా, దానికి ప్రాధాన్యతనిస్తోంది.. దీని ద్వారా అర్హత కలిగిన రైతులకు ఒక ఎకరానికి రూ.12 వేలు అందనున్నాయి. అలాగే రైతు రుణమాఫీ కింద ఇప్పటికే ప్రభుత్వం 25.35 లక్షల మంది అన్నదాతల అకౌంట్లలోకి రూ.20,616 కోట్ల నిధులను రైతు ఖాతాల్లో జమ చేసింది. త్వరలో అమలు చేయబోయే రైతు భరోసా పథకానికి, సాగు భూముల వడపోతకు గాను త్వరలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఫిల్టర్ చేయనుంది. అలాగే మొత్తం 40 లక్షల ఎకరాల్లో సన్న వడ్ల సాగు విస్తీర్ణం పెరిగిన క్రమంలో క్వింటాకు రూ.500 చొప్పున ఆ పథకాన్ని కొనసాగిస్తూ అందుకు బడ్జెట్లో రూ.1,670 కోట్లు కేటాయించింది. ఇప్పటివరకు రాష్ట్రంలోని రైతులకు రూ.1206.44 కోట్ల బోనస్‌ను చెల్లించడం జరిగింది. వ్యవసాయ మార్కెట్ యార్డులలో వసతుల అభివృద్ధికి రూ.181.98 కోట్ల వ్యయం చేసింది. 202425 ఖరీఫ్ సీజన్లో 10,35,484 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించి, రూ.12,511.76 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య 8,332కు పెంచాలని నిర్ణయించింది. ఇక ఆయిల్ పామ్ సాగుకు ఉన్నట్లు రూ.2 వేల అదనపు సబ్సిడీ ఇవ్వనుంది. అలాగే పశుసంవర్ధక శాఖకు సంబంధించి రూ.1,674 కోట్ల కేటాయింపులు జరిపారు. ప్రధానంగా పశువైద్య టీకాల తయారీలో భారీ విస్తరణ ప్రణాళికను రూపొందించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది.

## కొత్తగా 'గిరివికాసం'

>> ఉపకులాలను వారి సామాజిక, ఆర్థిక వెనుకబడిన స్థాయిల ప్రకారం మూడు వర్గాలుగా విభజించారు. దీంతో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఇందువల్ల వారి జీవితాల్లో మార్పు వస్తుందని సర్కార్ భావిస్తోంది. కాగా గిరిజనాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ఇందిరా గిరి జలవికాసం అనే ప్రత్యేక పథకంతో పోడు భూములు సాగు చేసుకునే గిరిజన రైతులకు సౌర ఆధారిత పంపుసెట్ల ద్వారా సాగునీటిని అందించాలని ఈ బడ్జెట్‌లో నిర్ణయించారు. ఇందుకు వచ్చే నాలుగేళ్లలో రూ.12,600 కోట్లు కేటాయించారు. దీంతో 2.1 లక్షల గిరిజన రైతులకు లబ్ధి చేకూరుతుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కాగా మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లను కేటాయింపులు చేసింది. దీంతో రాష్ట్రంలో మైనార్టీల భద్రత, సంక్షేమానికి వ్యయం చేయనుంది. అంతేకాకుండా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్లో భాగంగా వివిధ ప్రాంతాలలో ఉన్న మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను కూడా అంతర్భాగం చేయడం ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఇతర విద్యార్థులతో పాటు అత్యుత్తమ విద్యను అందించవచ్చని బడ్జెట్‌లో భరోసా ఇచ్చారు. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో ఎస్సీ, ఎస్టీలకు రూ.13,617 కోట్లు, రూ.1,317 కోట్లు ఖర్చు చేయకుండా బకాయి పెట్టారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేటాయించాల్సిన మొత్తానికి అదనంగా 2023 24కి సంబంధించిన ఈ బకాయిలను కూడా కేటాయింపులు జరిపింది.

## సిఎం రేవంత్‌పై కేసును కొట్టివేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై 2020లో నమోదైన కేసును బుధవారం తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. మాజీ మంత్రి కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్‌పై డ్రోన్ ఎగురవేశారంటూ రేవంత్ రెడ్డితో పాటు మరికొంత మందిపై నార్సింగి పీఎస్‌లో 2020 మార్చిలో కేసు నమోదైంది. అప్పుడు ప్రతిపక్షంలో రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దీంతో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జన్వాడ నిషేధిత ప్రాంతమేమి కాదని, సీఎం రేవంత్ రెడ్డిపై తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని ధర్మాసనానికి తెలిపారు. డ్రోన్ ఎగురవేసిన ప్రాంతం ఎటువంటి నిషేధిత జాబితాలో లేదని పీపీ న్యాయస్థానానికి వివరించారు. దీంతో పూర్తి వాదనలు విన్న న్యాయస్థానం నార్సింగి పీఎస్‌లో సీఎం రేవంత్ రెడ్డిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులను వెలువరించింది.

## గేట్-2025 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్-2025) ఫలితాలను ఐఐటీ రూర్కీ విడుదల చేసింది. ఫలితాలను ఐఐటీ రూర్కీ అధికారులు బుధవారం మధ్యాహ్నం ఫలితాలను విడుదల చేశారు. పరీక్ష రాసిన అభ్యర్థులు తమ ఫలితాలను గేట్2025.ఐఐటిఆర్.ఏసి.ఇన్‌లో తెలుసుకోవచ్చని ప్రకటించారు. గేట్ పరీక్షను ఐఐటీ రూర్కీ నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా మొత్తం 8.37 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. సుమారు 80 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో పరీక్షలు నిర్వహించారు. స్కోరు కార్డులు మార్చి 28 నుంచి మే 31వరకు డౌన్‌లోడ్ చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. డౌన్‌లోడ్ ఆలస్యం చేస్తే రూ.500 చెల్లించాల్సి ఉంటుందని ప్రకటించింది.

## శాసనసభ రేపటికి వాయిదా

**హైదరాబాద్,మార్చి 19,ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభ శుక్రవారానికి వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం అవుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. బుధవారం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గంటా 43 నిమిషాల పాటు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగాన్ని చదివి వినిపించారు.

## అది అంకెల గారడీ బడ్జెట్

>> మరోసారి మోసం చేసిందన్నారు. పదేళ్లపాటు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అఖాతంలోకి నెట్టేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తీరు రాష్ట్రాన్ని పెనంపైనుంచి పొయ్యిలోకి పడేసినట్లు చేసిందన్నారు. గతేడాది బడ్జెట్ పెట్టినపుడు తొలి ఏడాదే కదా అని తప్పించుకున్నారు. మరి 15 నెలలపాటు పాలించిన తర్వాత కూడా 6 గ్యారెంటీలు, 420 వాగ్దానాల అమలును పూర్తిగా విస్మరించారని అన్నారు. వివిధ ప్రాజెక్టులకు భారీగా ప్రకటనలు చేసినా, కేటాయింపులు, ఆచరణ శూన్యమని ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందన్నారు. అంకెల గారడీ ద్వారా మరోసారి తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిన బడ్జెట్ ఇది అన్నారు. ఎన్నికల హామీలపై ప్రజలు ఆశలు వదులుకోవాలని తెలంగాణ బడ్జెట్ నిరూపించిందన్నారు. ప్రభుత్వ ఆదాయం, రాబడిపై కనీస అవగాహన లేకుండా అంచనాలు రూపొందించారన్నారు. 2024-25 బడ్జెట్‌లో జిఎస్‌టి ఆదాయాన్ని రూ.58,594 కోట్లుగా చూపించారని, కానీ సవరించిన అంచనాల్లో రూ.5వేల కోట్లు తగ్గించి రూ.53,665 కోట్లుగా వెల్లడించారు. అంటే దాదాపు 8.5 శాతం జిఎస్‌టి వసూళ్లు తగ్గాయన్నారు. దీనికి కారణాలు రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలన్నారు. 2025-26 సంవత్సరానికి గానూ రూ.59,704 కోట్ల జిఎస్‌టి వసూళ్లు ఉంటాయని బడ్జెట్లో పేర్కొన్నారు. ప్రజాసంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించిన ఈ బడ్జెట్‌ను బిజెపి పూర్తిగా ఖండిస్తోందన్నారు.

## 'ఒక్కో సీటుకు రూ.476 కోట్లు'

**వాషింగ్టన్, మార్చి 19:** అంతర్జాతీయ స్పేస్‌స్టేషన్‌నుంచి సురక్షితంగా నలుగురు వ్యోమగాములను తీసుకువచ్చిన ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌకలో ఒక్కోసీటుకు భారీ ఛార్జిలు వసూలుచేసింది. సునీత విలియమ్స్, బుచ్‌విల్మోర్‌తోపాటు మరో ఇద్దరువ్యోమగాములపై అమెరికాప్రభుత్వం ఒక్కొక్కరి పైనా సగటున 55 మిలియన్ డాలర్లు వసూలుచేసింది. అంటే భారతీయ కరెన్సీలో అక్షరాలా రూ.476 కోట్లు. ఎలాన్‌మస్క్ కంపెనీ దీన్నిబట్టి ఎంత సంపాదిస్తుందో అర్థంచేసుకోవచ్చు. కానీ ఈ ధరను కమర్షియల్‌క్రూ ప్రోగ్రామ్‌కింద స్పేస్‌ఎ క్స్, నాసామధ్య ఒప్పందంచేసుకుంది. నాసా 2014లో కమర్షియల్‌క్రూ ప్రోగ్రామ్‌కింద స్పేస్‌ఎక్స్‌కు2.6బిలియన్‌డాలర్లకు ఒప్పందంచేసుకుంది. ఒక్కోమిషన్ సగటు ఖర్చు 400 మిలియన్ డాలర్లు. ప్రస్తుతం ఈఖర్చు భారీగా తగ్గింది.

# సంక్షేమ 'గ్యారంటీ'



బుధవారం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో సిఎం రేవంత్, తదితర ఎమ్మెల్యేలు

>> భట్టివిక్రమార్క హెచ్చరిస్తూనే రాబోయే పదేళ్ళకాలంలో వెయ్యి బిలియన్ డాలర్ వ్యవస్థగా రూపాంతరం చెందే దిశగా కార్యాచరణ ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 200 బిలియన్ డాలర్లు ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో "తెలంగాణ రైజింగ్-2050" అనే ప్రణాళికతో ఐదురెట్లు అభివృద్ధి చేసి ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా రూపొందుతామని తెలిపారు. తెలంగాణ స్థూల రాష్ట్ర ఉత్పత్తి రూ. 16,12,579కోట్లు ఉందని, గత సంవత్సరంతో పోల్చితే 10.1శాతం వృద్ధిరేటు ఉందని చెప్పారు. దేశ స్థూల ఉత్పత్తి రూ.3,31,03,215కోట్లు ఉందనిఅన్నారు. గత ఏడాది జిడిపి వృద్ధిరేటుతో పోల్చితే 9.9శాతం ఉందని వివరించారు. దేశ తలసరి ఆదాయం కంటే తెలంగాణ తలసరి ఆదాయం 1.8రెట్లు అధికమని, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751 ఉండగా దేశ తలసరి ఆదాయం రూ.2,05,579కోట్లు అని సభకు ఆర్థికమంత్రి గణాంకాలతో పోల్చిచూపారు.ఒక నిరుపేద తనరోజువారి జీవితంలో ఏ కనీస సదుపాయాలు ఉండాలని కోరుకుంటాడో వాటినన్నీ అభయ హస్తంలో చేర్చి అమలు చేయగా రూ.5,006 కోట్లు కేవలం ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు ఆదా చేసుకున్నారని వివరించారు. ఉచిత బస్సు సౌకర్యంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 94 శాతానికి పెరిగింది. రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 43 లక్షల కుటుంబాలకు లబ్ధి. కలిగించామని,సిలిండర్ల రాయితీ కింద రూ.433 కోట్లు చెల్లించామని ఆయన సభకు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 50 లక్షల కుటుంబాలకు లబ్ధి. గృహజ్యోతి పథకం కోసం రూ.1,775 కోట్లు రాయితీ ఇచ్చామని తెలిపారు.ఆరు గ్యారంటీలకు రూ.56,084 కోట్లు కేటాయింపు చేశామని ఆర్థిక మంత్రి తెలిపారు.

రైతు భరోసా రూ.18 వేల కోట్లు, చేయూత పింఛన్ల కోసం రూ.14,861 కోట్లు. ఇందిరమ్మ ఇళ్లు రూ.12,571 కోట్లు. మహాలక్ష్మి రూ.4,305 కోట్లు. గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రూ.2,080 కోట్లు. సన్నాలకు బోనస్ రూ.1,800 కోట్లు. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.1,143 కోట్లు. గ్యాస్ సిలిండర్ రాయితీ రూ.723 కోట్లు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.600 కోట్లు. విద్యుత్ రాయితీ రూ.11,500 కోట్లు. రాజీవ్ యువ వికాసం రూ.6 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాముల ఏర్పాటుఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తామని తెలిపారు.

మహిళా స్వయం సహాయక సంఘాలకు మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యత వారికే ఇస్తామని అన్నారు. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి అద్దెకు 600 బస్సులు కూడా అందిస్తున్నామని సవారిని కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంని తెలిపారు. ఇందిరా మిషన్‌శక్తి మిషన్ పథకం ద్వారా వెయ్యి లక్షకోట్లు వడ్డీలేని రుణాలు మహిళా స్వశక్తి సంఘాలకు అందించి వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లిస్తామని ఆశ పెట్టి నిరాశ మిగిల్చిందిఅసంపూర్తిగా ఉన్న 34,545 ఇళ్లను రూ. 305 కోట్లతో అందుబాటులోకి తెస్తున్నామని విక్రమార్క వివరించారు. ఓఆర్ఆర్‌ను ఆనుకొని నలువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. 25.35 లక్షల మంది రైతులకు రూ. 20,617 కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ బడ్జెట్ లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి భారీగా కేటాయింపులు చేశారు. ఈ నాలుగింటికి కలిపి రూ.72,397 కోట్లను కేటాయించారు. వీటిలో ఎస్సీ సంక్షేమానికి అత్యధిక కేటాయింపులు చేశారు. ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు కేటాయించగా, ఎస్టీ సంక్షేమానికి రూ.17,169 కోట్లు, ఆ తర్వాత బీసీ సంక్షేమానికి రూ.11,405 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లను కేటాయిస్తూ పద్దును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గిరిజనాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ఇందిరా గిరి జలవికాసం అనే ప్రత్యేక పథకంతో పోడు భూములు సాగు చేసుకునే గిరిజన రైతులకు సౌర ఆధారిత పంపుసెట్ల ద్వారా సాగునీటిని అందిస్తామని భట్టి ప్రకటించారు. ఇందుకువచ్చే నాలుగేళ్లలో రూ.12,600 కోట్లు కేటాయించారు. దీంతో 2.1 లక్షల గిరిజన రైతులకు లబ్ధి చేకూరుతుందని బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ తయారీ చేశామని దీనితో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు దోహదపడుతోంది. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కోహెడలో రూ.47 కోట్లతో ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్ అభివృద్ధి చేస్తామనితెలిపారు. హోంశాఖకు ఈ బడ్జెట్‌లో రూ. 10188కోట్లు కేటాయించారు. దేవాదాయశాఖకు రూ. 190కోట్లు కేటాయించామని కురుమూర్తి దేవాలయం ఘాట్‌రోడ్ నిర్మాణంకు 110కోట్ల రూపాయలు వ్యయం చేయబోతున్నామని తెలిపారు. తెలంగాణలో అటవీ విస్తీర్ణం 33శాతంకు పెంచడానికి అడువులు,పర్యావరణశాఖకు రూ.1023కోట్లు కేటాయించామని తెలిపారు. యంగ్ఇండియన్ స్పోర్ట్ యూనివర్సిటీ,ఫ్యూచర్‌సిటీలో స్పోర్ట్సు హబ్,12 క్రీడా అకాడమీలను స్పోర్ట్స్ యూనివర్సిటీలో భాగంగా ఏర్పాటు చేయడానికి రూ.465కోట్లు క్రీడలకు కేటాయిస్తున్నామని తెలిపారు. గద్దర్ ఫిలిమ్ అవార్డులు ఇవ్వబోతున్నామని తెలిపారు. పర్యాటకశాఖకు రూ.775కోట్లు రోడ్లుభవనాలకు రూ. 5907కోట్లు,నీటిపారుదలశాఖకు 23373కోట్ల రూపాయలు ప్రతిపాదించారు.కొత్త పురపాలక సంఘాలు పట్టణఅభివృద్ధి సంస్థలకు రూ.4500కోట్లతో ప్రణాళికలు చేశామని వివరించారు. మున్సిపల్ పరిపాలన ,పట్టణ అభివృద్ధిశాఖకు రూ. 17,677,వైద్యఆరోగ్యశాఖకు 12393కోట్ల రూపాయలు, విద్యుత్‌శాఖకు 21,221కోట్లు ,పరిశ్రమలశాఖకు రూ.3527కోట్లు ప్రతిపాదించారు.

# వాదనలు బలంగా వినిపించాం

>> గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర మంత్రులు,ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు.వర్గీకరణ పోరాటంలో అమరులైన వారికి నివాళిగా 2 నిముషాలు మౌనం పాటించారు. అనంతరం కమిటీ హాల్‌లో జరిగిన అభినందన సభలో సిఎం మాట్లాడుతూ రాహుల్ గాంధీ లేకపోతే వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే శక్తి నాకు వచ్చేది కాదని పేర్కొన్నారు.భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు ఉండకూడదనే వన్ మెన్ కమిషన్ ఏర్పాటు చేశాం, వన్ మెన్ కమిషన్ 199 పేజీల నివేదిక ఇచ్చింది.ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పారు.ఇది ఎవరికి వ్యతిరేకంగా చేసింది కాదు..వర్గీకరణ ద్వారా ఎస్సీలకు న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు.పదేళ్లలో పరిష్కారం కాని సమస్యకు మేం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పరిష్కారం చూపామని పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో బలంగా వాదనలు వినిపించి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేందుకు కృషి చేశామని. సుప్రీం కోర్టు తీర్పును దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయలేదని చెప్పారు. ఉన్నత విద్యామండలి, పబ్లిక్ సర్వీస్ కమిషన్, విద్యాకమిషన్‌లలో మాదిగలకు ప్రాధాన్యం ఇచ్చాం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఛైర్మన్‌గా కూడా కుముదిని నియమించామన్నారు.బిల్లును ఎవరూ వ్యతిరేకించే సాహసం చేయలేదని పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణలో భాగంగా 15శాతం రిజర్వేషన్లు కేటాయించామని,ఎస్సీల్లో గ్రూప్1కు ఒక శాతం, గ్రూప్2కు 9శాతం, ఇప్పుడు 9శాతం కాదు పావు తక్కువ పది శాతం, గ్రూప్3కు 5శాతం రిజర్వేషన్లు కల్పించామని, అతి తక్కువ జనాభా కలిగి అభివృద్ధి ఫలాలు ఆశించిన వారిని గ్రూప్1లో ఉంచామని వివరించారు. ఎస్సీ వర్గీకరణ తీర్మానం పెట్టాలని 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక శాసన సభలో చెప్పానని, దీనిపై కేంద్రానికి తీర్మానం పంపాలని కోరామని, తీర్మానం ప్రవేశపెడితే తనతో పాటు సండ్ర వెంకట వీరయ్య, సంపత్‌ను సభ నుంచి బహిష్కరించారని సీఎం గుర్తు చేశారు.తాము పెట్టిన తీర్మానాన్ని విధిలేని పరిస్థితుల్లో ఆనాడు సభ ఏకగ్రీవంగా ఆమోదించాల్సి వచ్చిందని అన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని ఏనాడూ తీసుకెళ్లలేదని, మందకృష్ణతో ఎలాంటి విభేదాలు లేవని,వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు.తమకంటే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన ఎక్కువగా నమ్ముతున్నారని అన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న చోట ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని తెలిపారు.ఈ అవకాశాన్ని నిలబెట్టుకుంటేనే.. భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు వస్తాయని మాదిగ సంఘాల నేతలకు సూచించారు.కుర్చీలో మీ వాడిగా నేనున్నా..మీకు మంచి చేయడమే తప్ప నాకు మరో ఆలోచనలేదు.ఆవేశం తగ్గించుకునిఆలోచనతో పనిచేయండి..వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి మాదిగ నేతలకు పిలుపు నిచ్చారు.

## వారం - వర్జ్యం

తేది : 20-03-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
షష్ఠి రా.2.47
అనూరాధ రా.11.31
వర్జ్యం తె.5.38-7.23
దు.ఉ.10.23-11.11, 2) మ.3.13-4.01
శుభసమయం : ఉ.8.00-8.40, సా.6.00-6.35
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

- **మేషం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన సమర్థవంతంగా ఎదురుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.
- **వృషభం :** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.
- **మిథునం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.
- **కర్కాటకం:** దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమై ఊరట చెందుతారు. నూతన వస్తు, వస్త్రా కొనుగోలు.
- **సింహం:** నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా వుంటాయి.
- **కన్య :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ధనవ్యయం పెరుగుతాయి.
- **తుల :** దూరప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. వస్తు లాభాలు పొందుతారు.
- **వృశ్చికం**ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమిస్తారు. శ్రమకు తగిన ఫలితం అనుమానమే.
- **ధనుస్సు:** అనుకోని ఖర్చులు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.
- **మకరం:** కీలక నిర్ణయాలలో జాప్యం జరిగిన నిదానంగా తీసుకుంటారు. సోదరుల నుండి సాయం అందుతుంది.
- **కుంభం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. రుణబాధలు తీరి ఊరట చెందుతారు.
- **మీనం:**వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం వరి కంకులతో నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు

## వరికంకులతో బిఆర్ఎస్ నేతల నిరసన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి18:** ఎండిన వరి కంకులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ఆవరణలో ఆందోళన చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాపం రైతన్నలకు శాపం అంటూ నినాదాలు చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అందాల పోటీలా అంటూ నినదించారు. ఆ తర్వాత మీడియా పాయింట్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండుతున్నయంటే అందుకు ముందు చూపులేని ఈ సన్నాసి ప్రభుత్వం, మూర్ఖపు ప్రభుత్వమే కారణమని అన్నారు.లక్షల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయంటే దానికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఎండల వలన పంటలు ఎండిపోతున్నాయని ముఖ్యమంత్రి చేతగాని మాటలు చెబుతున్నాడని, అందుకు ముమ్మాటికి కారణం రేవంత్ రెడ్డేనని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనం, తెలివి లేని తనం, సాగునీటి నిర్వహణ ప్రాజెక్టుల నిర్వహణ చేయలేని తనం వల్లనే పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. రైతుల పట్ల, రైతాంగం పట్ల ప్రభుత్వం తన బాధ్యత మర్చిపోయింది కాబట్టి పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి రూ.25 వేల చొప్పున పంట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో శాసనమండలి ఆవరణలో కూడా బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఎండిన వరి కంకుల ప్రదర్శన చేశారు.

## హైదరాబాద్‌లో మెక్‌డోనాల్డ్స్ గ్లోబల్ కార్యాలయం

>> నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. యూనివర్సిటీని స్కిల్ జోన్‌గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్ లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్ లెట్లలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. మెక్‌డొనాల్డ్స్‌కు అవసరమైన మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. దీంతో రైతుల ఆదాయం పెరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. బెంగళూరు లాంటి ఇతర సిటీలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలు న్నాయని మెక్‌డొనాల్డ్ సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కి అన్నారు. అందుకే హైదరాబాద్‌ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్‌గా ఎంచుకున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మెక్ డొనాల్డ్స్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు.

# మోడీతో బిల్‌గేట్స్ భేటీ!

>> భారత్ అభివృద్ధిపై ప్రధానిమోడీతో అర్థవంతమైన చర్చలో పాల్గొన్నానని, వికసిత్ భారత్ లక్ష్యసాధన దిశగా ఆరోగ్యం, వ్యవసాయం, కృత్రిమమేధ ఇతర రంగాల్లో మంచి ప్రభావం కనిపిస్తున్నదని అన్నారు. ప్రధానిమోడీ కూడా బిల్‌గేట్స్‌తో జరిగిన భేటీలో ఎన్నో మంచి విషయాలు చర్చకువచ్చాయన్నారు. టెక్నాలజీ, సృజనాత్మక ఒరవడి సుస్థిర వృద్ధి వంటివి భావితరాలకు మంచి జీవనశైలి అందించేందుకు గేట్స్ సూచనలు ఉపకరిస్తాయన్నారు. తన పర్యటనలో బిల్‌గేట్స్ కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డాను కూడా కలుసుకున్నారు. బిల్ మిలిండాగేట్స్ ఫౌండేషన్ ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టంచేయడంలో తమ ఫౌండేషన్ భాగస్వామ్యంపైనా చర్చలుజరిపారు. ప్రసూతి ఆరోగ్యం, సార్వత్రిక వ్యాధినిరోధక కార్యాచరణ, పారిశుధ్యం వంటి అంశాలపై ఇరువురిమధ్య చర్చలుజరిగాయి. భవిష్యత్తులో కూడా భారత్‌లోని అన్ని వర్గాలప్రజలకు అందుబాటులో ఆరోగ్యం చేకూర్చేదిశగా భారత్‌తో కలిసి ఫౌండేషన్‌పనిచేస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేసారు.

## అవనికి చేరిన సునీత

>> బుచ్‌విల్మోర్, నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గుర్బునోవ్‌లు భూమికి చేరారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10.35 గంటలకకు ఐఎస్ఎస్‌నుంచి బయలుదేరిన నాసా స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ-9 డ్రాగన్‌ఫ్రీడమ్ క్యాప్సూల్ 17 గంటలపాటుప్రయాణించి బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా తీరానికి చేరువలో సముద్రజలాల్లో దిగింది. గంటకు 17 వేల మైళ్ల వేగంతో భూమివైపుగా ప్రయాణించిన ఈ డ్రాగన్ క్యాప్సూల్‌క్రమంగా తన వేగాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. చివరినిమిషంలో గంటకు 116 మైళ్లకు చేరాకా పారాచూట్లు తెరుచుకున్నాయి. నాలుగు పారాచూట్లసాయంతో వేగాన్ని మరింత తగ్గించుకుని క్యాప్సూల్ సురక్షితంగా సముద్ర జలాల్లో దిగింది. తర్వాత నాసా సిబ్బంది ఒక ప్రత్యేక పడవలో అక్కడికి చేరుకుని యంత్రాలసాయంతో ఒక నౌకపైకి తీసుకువచ్చి ఒడ్డుకు చేర్చారు. అనంతరం వ్యోమగాములను హూస్టన్‌లోని జాన్సన్‌స్పేస్‌సెంటర్‌కు తరలించారు. అక్కడే వారికి వైద్యపరీక్షలునిర్వహిస్తున్నారు. సుమారు తొమ్మిది నెలలపాటు జీరోగ్రావిటీలో గడిపిన ఈ వ్యోమగాములు ఇపుడు ఇక్కడ భూగురుత్వాకర్షణశక్తికి తిరిగి సర్దుబాటు అయ్యేలా నిపుణులు వారికి తోడ్పాటు అందించనున్నారు.

## 'గల్లీ' క్రికెట్!

>> ప్రధాని బ్యాటింగ్‌చేస్తుండగా టేలర్‌కీపింగ్‌చేసి సందడిచేసారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను లక్సాన్ తన సోషల్‌మీడియా ఖాతాలో షేర్‌చేసారు. భారత్‌న్యూజిలాండ్‌ను దగ్గరచేయడంలోక్రికెట్‌ను మించింది మరోటిలేదని రాసుకొచ్చారు. ప్రధానిమోడీతో ద్వైపాక్షికంగా భేటీ అయిన సందర్భంగానే లక్సాన్‌క్రికెట్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారత్ గెలుపును మోడీ ప్రస్తావించలేదు. తానుకూడా భారత్‌లో న్యూజిలాండ్‌జట్టు టెస్టు విజయాలను పేర్కొనలేదు. దీన్ని మనం అలాగే పక్కనపెడదాం అంటూ క్రిస్టోఫర్‌లక్సన్ సరదా వ్యాఖ్యలుచేయడంతో మోడీతోపాటు భేటీలో ఉన్న వారంతా నవ్వులు చిందించారు.

## కెటిఆర్‌పై నమోదైన కేసు హైకోర్టులో కొట్టివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై గతంలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కూడా కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కించపర్చే విధంగా మాట్లాడారని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు కేటీఆర్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడంతో దానిని కొట్టేయాలని మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.విచారణ సందర్భంలో బాధ్యత గల హోదాలో ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ ఇష్టారీతిన మాట్లాడారని, సీఎంను కించపరిచే విధంగా మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు.రాజకీయ కక్షల కారణంగానే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేశారని ఆయన తరఫున న్యాయవాది వాదించారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. ఇటీవలఫార్ములా ఈరేసులో మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ ఏసీబీ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.

## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో మళ్లీ కదలిక

# ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులపై ఎట్టకేలకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ

### ఇప్పుడైనా ఇద్దరు నిందితులు భారత్‌కు వచ్చేనా?

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మళ్లీ కదలిక వచ్చింది. ఈ కేసులో మొదటి నిందితుడుగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు, ఏడవ నిందితుడుగా వున్న మీడియా అధినేత ప్రభాకర్ రావులపై ఇంటర్ పోల్ ఎట్టకేలకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. దీనిపై ఇంటర్ పోల్ అధికారులు ఢిల్లీలోని సిబిఐకి సమాచారం ఇవ్వగా సిబిఐ నుంచి దీనిపై సిఐడికి సమాచారం అందింది, గత ఏడాది మార్చి మొదటి వారంలో వెలుగు చూసి న ఈ గోల్‌మాల్ వ్యవహారంపై ఎస్ఐబి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా దీనిపై పశ్చిమ మండల డిసిపి నేతృత్వంలోని ప్రత్యేక బృ ందం విచారిస్తుండడం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్‌పై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడానికి ముందే ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న నాటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు, ఏడవ నిందితుడుగా వున్న మీడియా అధినేత శ్రవణ్ రావులు అమెరికాకు ఉడాయించడం విదితమే. అప్పటి నుంచి వీరిద్దరిని భారత్‌కు రప్పించి విచారణ చే సేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి. ఇదే కేసులో మిగతా నలుగురు నిందితులు అరెస్టయి పది నెలలకు పైగా జైల్లో వుండి ఇటీవలే బెయిలుపై విడుదలయ్యారు. అమెరికాలో వున్న ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులపై ఇంటర్ పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించి వారిని అరెస్టు చేసి భారత్‌కు తీసుకు వచ్చేందుకు ఏడాదిగా చేస్తున్న ప్రయత్నాలు వారం రోజుల క్రితం ఫలించాయి. నిబంధనల మేరకు విదేశాల్లో వుండే నేరగాళ్లను భారత్‌కు రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిఐడి ద్వారా సిబిఐకి లేఖ రాసి, అక్కడి నుంచి ఇంటర్‌పోల్‌కు లేఖ పంపడం ఆనవాయితీ. ప్రభాకర్ రావు, శ్రవణ్ రావుల విషయంలో ఇలాగే జరిగింది. వాస్తవానికి ఆరు నెలల క్రితం ప్రభాకర్ రావు, శ్రవణ్ రావుల అరెస్టుకు నాంపల్లి కోర్టు వారంట్ జారీ చేయగా ఆ తరువాత దీని ఆధారంగా సిఐడి పోలీసులు సిబిఐకి లేఖ రాసి రెడ్ కార్నర్ నోటీసు జారీకి ప్రయత్నాలు ప్రారంభించారు. సిబిఐ ఈ విషయంలో పలుమార్లు ఇంటర్‌పోల్‌కు లేఖరాసి అనేకమార్లు వాకబు చేశాక చివరకు రెడ్ కార్నర్ నోటీసు జారీ అయ్యింది. ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులపై రెడ్ కార్నర్ నోటీసు జారీ అవడంతో అమెరికాలో వున్న వీరిని భారత్‌కు రప్పించడం సులభమవుతుంది. వీ రిద్దరిని సిబిఐ అధికారులు రాష్ట్ర పోలీసుల సహకారంతో అమెరికాకు వెళ్లి భారత్‌కు రప్పించే వీలుంది. అయితే ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులు ప్రస్తుతం అమెరికాను వీ డి కెనడా, బెల్జియంలో తలదాచుకున్నారని సిబిఐ అధికారులకు సమాచారం అందింది. అయితే ఈ దేశాలు కూడా ఇంటర్‌పోల్ భాగస్వామ్య దేశాలు కావడంతో రెడ్ కార్నర్ నోటీసు జారీ అయితే ఎక్కడ వున్నా అరెస్టు కాకతప్పదని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే ఏడాదికి పైగా అమెరికాలో వున్న వీరిద్దరిని రెడ్ కార్నర్ నోటీసు జారీ అయిన దరిమిలా ఇప్పుడైనా అరెస్టు చేసి తీసుకువస్తారో...? లేదో...? అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

## హెచ్‌సిఎలో అవకతవకలు
## రూ.51 లక్షల ఆస్తులు జప్తు చేసిన ఇడి

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో గత ఏడాది వెలుగు చూసిన అక్రమాల నేపథ్యంలో అధికారులకు సంబంధించిన 51.29 లక్షల రూపాయల ఆస్తులను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ విభాగం జప్తు చేసి ంది. ఈ మేరకు ఆ విభాగం అధికారులు బుధవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సిఎలో క్రికెట్ బాల్స్ కొనుగోళ్లు, జిమ్ కొనుగోళ్లతో పాటు బకెట్ చెయిర్స్ కొనుగోళ్లు, జిమ్ సంబంధించిన పరికరాల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ ఆరోపణల నేపథ్యంలో హెచ్‌సిఎ కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు అధికారులపై ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో గతంలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ కేసులపై ఓ వైపు విచారణ సాగుతుండగానే తాజాగా ఈడీ రం గంలో దిగి 51.29 కోట్ల స్థిరాస్తులను జప్తు చేసింది.

## నేడే సిఎం రేవంత్‌రెడ్డిచే కారుణ్య నియామకపత్రాల అందజేత: మంత్రి సీతక్క

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మార్చి 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతులమీదుగా 20వ తేదీ గురువారం సాయంత్రం 4గంటలకు రవీంద్రభారతిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖలలో ఉద్యోగ నియామకపత్రాలను అందజేయనున్నట్లు మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రభుత్వం 582 సూపర్ న్యూమరరీ జూనియర్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయడంతో కారుణ్య నియామకాలకు మార్గం సుగమం అయ్యిందని వివరించారు. ఈ 582 కారుణ్య నియామకాలతోపాటు మిషన్ భగీరథ శాఖలో 55మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, 27మంది జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో 38మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, 55మంది జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లకు నియామకపత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేయనున్నట్లు సీతక్క వెల్లడించారు.

## వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి
### ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

**కల్వకుర్తి, మార్చి 19 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం చోటుచేసుకుంది. ప్రసవానికి వచ్చిన మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటన చోటు చేసుకుంది. కల్వకుర్తి నియోజ కవర్గంలోని తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శ్యామల (26) నిండు గర్భంతో ప్రసవం కోసం ప్రభుత్వాసుపత్రిలో అడ్మిట్ అయ్యింది. మంగళవారంరాత్రి శ్యామలకు సీజేరియన్ చేయడంతో ఆడపిల్ల పుట్టింది తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. అంతలోనే అరగంట గడవకముందే శ్యామలకు తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో పరిస్థితిని గమనించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించగా



మీడియాతో మాట్లాడుతున్న చిత్తరంజన్‌దాస్

శ్యామలను అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందింది. వైద్యం వికటించడంవల్ల శ్యామల మృతిచెందని, అంతే కాకుండా సరైన సమయానికి 108 అంబులెన్స్ రాకపోవడం వల్లే శ్యామల మృతి చెందిందని, కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జేసీ చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడి బాలిక కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేటట్లు చూస్తానని దాస్ అన్నారు. ఆసుపత్రి వద్ద మాజీ మంత్రి చిత్తరంజన్ విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చాలా సంవత్సరాలుగా ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేసి విధులకు రాకుండా, రోగులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. వైద్యులు నిర్లక్ష్యంగా ఎంతోమంది నిరుపేదల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పార్టీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ, సిఐటియు నాయకులు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రివైద్యులుపై, సకాలంలో స్పందించని అంబులెన్స్‌సిబ్బందిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి సహాయం అందించాలని పలు రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆసుపత్రి ముందు భాగంలో రోడ్డుపై మృతురాలి కుటుంబ సభ్యులు బంధువులు రాస్తారోకో చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులతో పోలీసులు మాట్లాడి హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.



కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసు బలగాలు

## మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకుల యత్నం
### పోలీసుల పహారాతో అట్టుడికిన బెజ్జంకి

**బెజ్జంకి, మార్చి 19, ప్రభాతవార్త :** గత రెండు రోజుల కిందట మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సిఎంఆర్ఎఫ్, ఎల్ఓసి చెక్కుల మంజూరులో భారీ కుంభకోణం చేశారంటూ చేసిన ఆరోప ణలను నిరసిస్తూ బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామంలో గల రసమయి బాలకిషన్ ఫాం హౌస్ ముట్టడికి నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ముట్టడికి ప్రయత్నించగా ముం దుగానే విషయం తెలుసుకున్న పోలీసులు సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో భారీ యెత్తున్న పోలీసు బలగాలను మోహరించారు. మండల కేంద్రంలోని అంబ్కేర్ చౌరస్తావద్ద పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు ముఖ్య నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

**రాజకీయ లబ్ధి కోసమే అసత్య ఆరోపణలు:** ఫాం హౌస్ ముట్టడి నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు ఒగ్గు దామో దర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, పులి కృష్ణలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎల్ఓసి చెక్కులు కేవలం ప్రభుత్వాసుపత్రికి మాత్రమే మంజూరు చేస్తారని విషయం మరిచిన రసమయి నోటికి వచ్చిందల్లా మాట్లాడడం సరికాదన్నారు. 10 యేండ్లు అధికారంలో ఉండి రైతులకు చేసిన మేలేమిటని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఎల్‌గౌడ్, రవీంద్రచారి, రమణారెడ్డి ఉపేందర్‌రెడ్డి, బసవయ్య, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో కొనసాగుతున్న రెస్క్యూ

### నిరంతరాయంగా కొనసాగుతున్న ఊట నీటి తోడివేత ప్రక్రియ
### ఎస్కలేటర్లతో మట్టి తీసే పనులు ముమ్మరం





**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 19 ప్రభాతవార్త :** టన్నెల్ లో టీబీఎం ప్లాట్ ఫాం కత్తిరించే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఎస్కలేటర్లతో మట్టి తీసే పనులు ముమ్మరంగా నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, ఊట నీటి తోడివేత ప్రక్రియ కొనసాగుతుందని డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌లు తెలిపారు. బుధవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులు, ఆర్మీ అధికారి కల్నల్ పరీక్షిత్ మెహర, వికాస్‌సింగ్, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు డా. హరీష్, సింగరేణి ఉన్నత అధికారి బైద్య, ఎస్‌డిఆర్ఎఫ్ అధికారి హరినాథ్ రెడ్డి, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, అన్వి రోబోటిక్ ప్రతినిధులు విజయ్, అక్షయ్, హైడ్రా, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక బృందాలతో సహాయక చర్యల వేగవంతానికై ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, పలు సూచనలు సలహాలు ఇస్తున్నట్లు తెలియజేశారు. టన్నెల్ లోపల టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషిన్) ప్లాట్‌ఫాం కత్తిరించే ప్రక్రియ, ఎస్కలేటర్లతో మట్టి తొలగింపు, అలాగే ఊట నీటి తోడివేత వంటి పనులను పర్యవేక్షిస్తూ సహాయక బృందాలలో సమన్వయం కుదురుస్తూ సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 800, టన్నుల స్టీల్ ను లోకో ట్రైన్ ద్వారా, 800, టన్నుల మట్టిని, కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. డి1, డి2 ప్రదేశాలలో సహాయక బృందాలచే చేపడుతున్న పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయని, డి 1, డి 2 ప్రదేశాలలో జరుగుతున్న తవ్వకాలలో అడ్డంకిగా ఉన్న టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్ల ద్వారా తొలగిస్తూ, మట్టిని ఎస్కలేటర్ల ద్వారా కన్వేయర్ బెల్ట్ గుండా బయటకు తరలిస్తున్నట్లు, నాలుగు ఎస్కలేటర్లు, బాబ్ క్యాట్లు నిరంతరాయంగా మట్టి, స్టీల్ తొలగించే పనుల్లో నిమగ్నమైనట్టు తెలిపారు. ఈ ప్రదేశాల వరకు లోకో ట్రైన్ ట్రాక్ పునరుద్ధరణ కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేస్తున్నట్లు తెలియజేశారు. సహాయక బృందాలచే బురద మట్టిని వాటర్ జెట్, సహాయంతో తొలగిస్తున్నట్లు, సహాయక బృందాలు సమన్వయంతో రెట్టింపు వేగంతో సహాయక చర్యలు చేపడుతూ, డి1, డి2 ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.

సహాయక బృందాల ఉన్న తాధికారులు టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశంలో ప్రత్యక్షంగా ఉండి సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు నిరంతరం శ్రమిస్తూ, సహాయక పనులను పర్యవేక్షిస్తూ, సహాయక బృందాల మధ్య సమన్వయం కుదు రుస్తూ, సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## పసికందులను విక్రయించే మరో అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు

### గతంలో పట్టుబడ్డ ముఠాతో లింకులు..పది మంది శిశువుల స్వాధీనం, మరో 11మంది కోసం గాలింపు
### దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉత్తర, పశ్చిమాది రాష్ట్రాలకు, అక్కడి నుంచి ఇక్కడికి అమ్మకాలు

**హైదరాబాద్, (మన్సూరాబాద్) మార్చి 19, ప్రభాతవార్త:** రోజుల వయస్సు కలిగిన పసికందులను విక్రయించే మరో అంతర్ రాష్ట్ర నేరగాళ్ల ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి పది మంది శిశువులను స్వాధీనం చేసుకుని హోంకు తరలించగా ముఠాలోని నేరగాళ్లు విక్రయించిన మరో 11 మంది పసికందుల కోసం గాలింపు చేబట్టారు. నెల రోజుల క్రితం రాచకొండ పోలీసులు అరెస్టు చేసిన పసికందుల విక్రయ ముఠాకు తాజా ముఠాతో లింకులున్నట్లు తేలింది. రెండు ముఠాలు దక్షిణాది రాష్ట్రాలలో కిడ్నాప్ లేదా కొనుగోలు చేస్తున్న శిశువులను ఉత్తర, పశ్చిమాది రాష్ట్రాలకు అమ్మడంతో పాటు అక్కడి పసికందులను ఇక్కడ అమ్మకాలు చేస్తున్నట్లు వెల్లడియ్యిందని రాచకొండ పోలీసు కమిషనర్ గొట్టె సుధీర్ బాబు బుధవారం ఎల్‌బి నగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశ ంలో తెలిపారు. నెల రోజుల క్రితం అరెస్టయిన కోలా కృష్ణవేణి, బత్తుల దీప్తి, వందన అనే ముగ్గురు నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించగా మరో అంతర్ రాష్ట్ర పసికందుల విక్రయ ముఠా గోల్‌మాల్ వెలుగు చూసింది. ఈ ముఠాకు మలక్‌పేట్‌లో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న సోము అ మూల్య (29) నాయకురాలిగా వున్నట్లు తేలింది. ఈమె ముఠాలో మధ్యవర్తులుగా కీలక విక్రయదారులుగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన వైశాలి భీంరావు వాస్నిక్ (40), కొత్తపేట్‌కు చెందిన జన్‌పల్లి కార్తిక్(43), పాతబస్తీలోని ఘాన్సీ బజార్‌కు చెందిన సజ్జన్ అగర్వాల్ (41), అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన బనాల మంగయ్య (42), ఆసఫాబాద్‌లోని రెబ్బనకు చెందిన బోదాసు నాగరాజు (31), మైలార్‌దేవుపల్లికి చెందిన షేక్ ఇస్మాయిల్ (31), నిజాంపేట్‌కు చెందిన మాచర్ల వంశి కృష్ణ (31)



పసికందులను విక్రయించే మరో అంతరాష్ట్ర ముఠాను అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ కొత్వాల్ గొట్టె సుధీర్ బాబు. చిత్రంలో ఎల్‌బి నగర్ డిసిపి ప్రవీణ్ తదితరులున్నారు

వున్నారు. ఈ ముఠా మొ త్తం 21 పసికందులకు విక్రయించినట్లు తేలింది. ఇందులో ఆరుగురు ఆడ, నలుగురు మగశిశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ పసికందులను కొన్న 17 మందిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కావడం గమనార్హం. నిందితుల నుంచి తొమ్మిది సెల్‌ఫోన్లను జప్తు చేశారు. ఈ ముఠాకు నాయకురాలైన అమూల్య 2022లో తన ముఠాలో కీలకంగా వున్న షేక్ ఇస్మాయిల్ నుంచి ఒక మగ శిశువును కొని చౌటుప్పల్‌లో గల త న బంధువుకు అమ్మి 30వేల రూపాయలను గడించింది. దీని తరువాత కోలా కృష్ణవేణి, బత్తుల దీప్తిలతో పరిచయం ఏర్పడి వారితో కలిసి కొంతకాలం పసికందుల అమ్మకాలు చేయసాగింది. ఆ తరువాత సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పెళ్లయి పిల్లలు లేని దంపతుల వివరాలు సేకరించి వారికి ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన సొంతంగా ఒక ముఠాను ఏర్పాటు చేసుకుని శిశువులను అమ్ముతోంది. ఈ ముఠా మొత్తం 21 మంది పసికందులను ఇప్పటి వరకు అమ్మగా అందులో పది శిశువులను పోలీసులు బుధవారంస్వాధీనం చేసుకుని హోంకు తరలించారు. ఈ పసికందులు ఆరోగ్యంగా వున్నారని కమిషనర్ తెలిపారు. ఈ ముఠా విక్రయించిన మిగతా 11 శిశువులను ఖరీదు చేసిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ ముఠా సభ్యులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తామని కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఈ సమా వేశంలో ఎల్‌బినగర్ డిసిపి ప్రవీణ్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## థ్యాంక్స్..చంద్రబాబు సార్: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,మార్చి 19,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై తిరుమల శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లుగా ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవా దాయ శాఖ మంత్రి కొండా సురేఖ థ్యాంక్స్ చెప్పారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై ఆదివారం, సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. బుధవారం, గురువారం ప్రత్యేక ప్రవేశ దర్శనాలు(రూ.300) ఉంటాయని తిరుమల తిరుపతిదేవస్థానం తెలిపింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ స్వీకరిస్తామని వెల్లడించింది.

మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు టీటీడీ వెల్లడించింది. ఒకరికి ఒక సిఫార్సు లేఖను మాత్రమే 6 మందికి మించకుండా స్వీకరిస్తామని టీటీడీ వెల్లడించింది.

## మాదిగ యువతకు తీరని అన్యాయం: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, మార్చి 19,ప్రభాతవార్త:** వర్గీకరణ చట్టం చేయకముందే ఉద్యోగాలు భర్తీ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగ యువతకు తీరని అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్గీకరణ చట్టం చేయకముందేముఖ్యమంత్రి హడావుడిగా గ్రూప్ 1,2,3, ఇతర శాఖల్లోని ఉద్యోగ నియామకాలు చేపడుతూ, ఉద్యోగవకాశాలన్నీ ఒక వర్గానికే దోచి పెట్టారన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రిం కోర్టు నుంచి తీర్పు వచ్చిన తర్వాత కూడా మంత్రి రాజనర్సింహ తన సొంత వైద్య ఆరోగ్యశాఖలో 1284 పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి, తన వర్గానికి చెందిన వారి ఒత్తిడికి తలొగ్గి టీచర్, మరో ఐదు శాఖల్లో పోస్టులను భర్తీ చేశారన్నారు. ముఖ్యమంత్రి చర్యలను చూస్తే ఉత్త చిప్పను మాదిగలకు ఇచ్చి, ఉద్యోగాలన్నీ మరో వర్గానికి కట్టబెట్టారన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రిం కోర్టు తీర్పు వచ్చిన తర్వాతే గ్రూప్ పరీక్షలు జరిగాయన్నారు. రాష్ట్రంలో మాల మాదిగల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గిం చడానికి ఆరెండు వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులను కూర్చోబెట్టి మాట్లాడించలేదని, కనీసం షమీమ్ అక్తర్ కమిషన్‌తో వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడిం చలేదన్నారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ విజయో త్సవాలను నెల రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేశ్ మాదిగ, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షులు పృథ్వీరాజ్, తెలంగాణ విఠల్, సీనియర్ జర్నలిస్టు ఇస్మాయిల్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త మద్యం దరఖాస్తుల గడువు ఏప్రిల్ 2వరకు పెంపు
### ఎక్సైజ్‌శాఖ కమిషనర్ హరికిరణ్

**హైదరాబాద్, మార్చి 19,ప్రభాతవార్త:** తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి మద్యం, బీరు కంపెనీలు కొత్త ఉత్పత్తులను సప్లయి చేయడానికి మార్చి 15 వరకు గడువు పెంచినట్లు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్వూరి హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీరు కంపెనీలు తమ మద్యం ఉత్పత్తి బ్రాండ్లను అమ్మకాలు జరుపుకునేందుక టీజీబీసీఎల్‌కు 39 కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. టీజీబీసీఎల్‌లో రిజి స్టర్ కాని కొత్త కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో జరుపుతున్న తమ మద్యం అమ్మకాలపై నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్లుగా, మద్యం అమ్మకాలపై ఎలాంటి ఆరోపణలు లేవనే నిర్ధారణ సర్టిఫికేషన్ పత్రం దరఖాస్తుతో జత పరచాలని టీజీబీసీఎల్ కోరింది. టీజీబీసీఎల్ కోరిన విధంగా సర్టిఫి కేట్లను జత పరచడం కొంత అలస్యం అవుతుందని, దరఖాస్తులకు మరింత గడువు ఇవ్వాలని కొన్ని కంపెనీలు విజ్ఞపనలు చేశాయన్నారు వారి విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి విదేశీ, దేశీయ కంపెనీలకు ఏప్రిల్ 2 వరకు గడువు పెంచుతున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ చెవ్వూరు హరి కిరణ్ పేర్కొన్నారు.

### మహిళా సంక్షేమ శాఖ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదల
## 10,459 మందికి జిఆర్ఎల్ విడుదల

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ విభాగంలోని గ్రేడ్-1 ఎక్స్‌టెన్షన్ అధికారి ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) విడుదల చేసింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జనరల్ ర్యాంకులతో పాటు, ఫైనల్ కీ బుధవారం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన మెరిట్ జాబితాను కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ధ్రువపత్రాల పరిశీలనకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు కమిషన్ అధికారులు తెలిపారు. గ్రేడ్-1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ ఏడాది జనవరి 8న పరీక్ష నిర్వహించారు. ఈ పోస్టులకు మొత్తం 26,751 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 10,459 మంది రెండు పరీక్షలకు హాజరయ్యారు. రెండు పరీక్షలకు హాజరైన 10,459 మందికి కూడా జిఆర్ఎల్‌ను కేటాయించారు. మొత్తం 181 పోస్టులకి టిజిపిఎస్‌సి పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే.

## కాళోజీ హెల్త్ వర్సిటీ విసిగా నంద కుమార్ రెడ్డి
### మూడేళ్లపాటు విసిగా కొనసాగింపు: ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా డాక్టర్ పివి నందకుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన హెల్త్ యూనివర్సిటీ విసిగా మూడేళ్లపాటు కొనసాగనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. వైద్య, ఆరోగ్య శాఖ ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 59ని జారీ చేసింది. మహబూబ్‌నగర్‌కి చెందిన డాక్టర్ పివి నంద కుమార్ రెడ్డి మే 7,1956లో జన్మించారు. 1983లో ప్రభుత్వ సర్వీస్‌లో చేరిన ఆయన 32 సంవత్సరాలపాటు సర్వీస్ చేశారు. 2014లో పదవివిరమణ చేశారు. ఆయనను హెల్త్ వర్సిటీ విసిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి: ప్రముఖులు

**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామి వారిని ప్రముఖులు వేడుకున్నారు. బుధవారం ఉదయం ఇండియన్ మైకేల్ జాక్సన్, సినీనటుడు ప్రభుదేవ, ఐటిసి డైరెక్టర్ సతీష్‌కుమార్ వేర్వేరుగా విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 24న తిరుమలలో 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశం

**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** ప్రఖ్యాత హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ రూపకల్పన పూర్తయినట్లు తెలుస్తోంది. గత ఏడాది మార్చినెల నుండి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి హుండీద్వారా రాబడిన ఆదాయాన్ని పరిగణనలోనికి తీసుకుని బడ్జెట్ తయారుచేయడం షరామామూలే. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరి ఆఖరులోనే వార్షిక బడ్జెట్‌ను 5,141.74కోట్ల రూపాయల అంచనాతో టిటిడి ధర్మకర్తలమండలి ఆమోదించిన విషయం విదితమే. ఈ ఏడాది అంతేస్థాయిలో కొంచెం ఇంచుమించుగా 5,200కోట్ల రూపాయల వరకు అంచనా ఉండవచ్చనేది టిటిడి వర్గాల్లో చర్చనీయాంశం. టిటిడి ఉన్నతాధికారులు వార్షిక గణాంకాలు ప్రాతిపదికన బడ్జెట్ రూపొందించి ,తుదిమెరుగులు దిద్దారు. రెండురోజులు తిరుమలలో సిఎం చంద్రబాబు పర్యటన ఉండటంతో ఆయనతో కూడా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చర్చించి ఆ తరువాత ఆమోదించే అవకాశం ఉంది. 2024-25 వార్షిక బడ్జెట్‌లో అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు ,శ్రీవేంకటేశ్వరస్వామికి ఆదాయం 5,141కోట్లు సముపార్జించుకునే రీతిలో రూపొందించారు. వడ్డీకాసులవాని దర్శనానికి విచ్చేస్తున్న భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి సమర్పించే ఆదాయం రూపేణా 1,611కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. స్వామివారి ప్రసాదాల విక్రయం ద్వారా 600 కోట్ల రూపాయలు, ఆర్జితసేవలు, విఐపి బ్రేక్ దర్శనాలు, ప్రత్యేకప్రవేశదర్శనాలు ద్వారా 338కోట్లు, ఆర్జితసేవల ద్వారానే 150కోట్లు, కల్యాణమండపాల అద్దెరూపంలో 147కోట్లురూపాయలు, భక్తులు సమర్పించే తలనీలాల ద్వారా కల్యాణకట్టనుండి 151.50కోట్ల రూపాయలు, వివిధ బ్యాంకుల్లో దేవుని డిపాజిట్లు ద్వారా 1,167కోట్ల రూపాయలు వడ్డీరూపంలో ,ఇతరత్రా రూపేణా 129కోట్లు రూపాయలు ఇలా వరుసగా ఆదాయం 5,141కోట్లు సముపార్జించుకునేలా అంచనా వేశారు. 2023-24 సంవత్సరానికి దేవుని వార్షిక బడ్జెట్ 4,411కోట్ల రూపాయలుగా అంచనా వేసిన టిటిడి అధికారులు అందుకు అనూహ్యంగా రెట్టింపుస్థాయిలో 5,122.80కోట్లు రూపాయలు ఆదాయం గడించింది.

# ఎపి సిఎం పర్యటనకు ముందే అన్నప్రసాదం నాణ్యత తనిఖీలు

### భక్తులను పలకరించి అభిప్రాయం సేకరించిన అదనపు ఇఒ చౌదరి

**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా అందిస్తున్న అన్నప్రసాదాల నాణ్యతపై టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆకస్మిక తనిఖీలు చేశారు. శుక్రవారం ఉదయంముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబం అన్నప్రసాదానికి ఒకరోజు విరాళాలిచ్చి స్వయంగా భక్తులకు వడ్డించనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం అదనపు ఇఒ చౌదరి అధికారులతో కలసి తనిఖీ చేపట్టారు. మాతృశ్రీతరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో రోజుకు లక్షమందినుండి 1.20 లక్షలమంది వరకు భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు. గత కొద్దిరోజులుగా అదనంగా మసాలవడ కూడా భక్తులకు అందిస్తున్నారు. అన్నప్రసాదాల నాణ్యత,రుచి కూడా పెరగడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, డిప్యూటీ ఇఇ వేణుగోపాల్, విఎస్‌ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి, ఉద్యాన వనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులుతో కలసి అదనపు ఇఒ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో వంట గదులు, పాత్రలు, నిల్వ ఉన్న కూరగాయలు, భక్తులకు వడ్డించిన అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న వారితో స్వయంగా పలకరించి అభిప్రాయాలు సేకరించారు. అన్నప్రసాదం చాలా నాణ్యత, రుచికకరంగా ఉన్నాయని సంతృప్తిచెందారు. ముఖ్యమంత్రి కుటుంబం రేపు అన్నప్రసాదంభవనం రానుండటంతో తీసుకోవాల్సిన విషయాలు, భద్రత, ఏర్పాట్లుపై చౌదరి సూచనలు చేశారు.



వార్త

మీ ఆలోచనలు సదాచారమార్గం నుంచి మిమ్మల్ని దూరం చేసే సంకేతాలను ఇస్తున్నాయంటే దురదృష్టం మీకై కాచుకు కూర్చుంది అని భావించండి.

-తిరుక్కురళ్

# పుడమి సునీతం!

నవమాసాలకు పైగా రోదసిలో గడపిన వ్యోమగాములు సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్ బృందం భారత కాలమాన ప్రకారం బుధవారం తెల్లవారు ఝామున 3.27 నిమిషాలకు ఈ భూమ్మీదకు అడుగిడి వారికోసం వీక్షిస్తున్న యావత్ ప్రపంచానికి 'హాయ్' చెప్పారు.వారి రాకతో ఒక్కసారిగా పుడమి పులకించిపోయింది. ప్రపంచంలో జయ జయధ్వానాలతో ఆమెకు స్వాగతం పలికింది. సాంకేతికరంగాల్లో ఆవిష్కరణల కోసం నాసా, ఇస్రో వంటి అంతరిక్ష పరిశోధన సంస్థలు చేస్తున్న కృషి సర్వదా ప్రశంసనీయం. యూరి గగారిన్ నాటినుంచి కల్పనా చావ్లా, నేటి సునీత విలియమ్స్, బుచ్‌విల్ మోర్‌లు ఎంతో సాహసోపేత యాత్రలో ప్రాణాలు అర్పించేందుకు కూడా సిద్ధమై ముందుకు రావడం విశేషం. కల్పనాచావ్లా తర్వాత అంతే ఉత్సాహంతో రోదసిలోకి అడుగిడిన రెండో మహిళ సునీత విలియమ్స్. అంతరిక్షంలోనే కాదు సముద్ర గర్భంలోను అలుపుసొలుపూ లేకుండా పరిశోధనలు జరిపిన నావికా దళ అధికారిణిగాకూడా సునీతకు మంచి గుర్తింపు ఉంది. దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసం ఉంటేనే తప్ప ఇలాంటి ప్రయోగాల్లో పాల్గొనడం ఎవరికీ సాధ్యం కాదు. అందుకే అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మహిళా వ్యోమగామిగా ఆమెను ఆబాల గోపాలం కీర్తిస్తున్నారు. గగనయాన పరిశోధనల్లో మమేకమై మహిళా లోకానికి ఘనకీర్తి తెచ్చి పెట్టిన కల్పనాచావ్లా, సునీత విలియమ్స్ ఇద్దరూ ప్రపంచ కీర్తిసిగలో కలికితురాయిగా భాసిల్లుతున్నారు. 2024 జూన్ 5న కేవలం ఎనిమిది రోజుల పరిశోధనాయాత్రకు బయలు దేరిన సునీత విలియమ్స్ క్రూ తమ వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా తొమ్మిది నెలలకు పైగా అంతరిక్షంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఎలాంటి జంకు గొంకు లేకుండా అక్కడ సమాచారాన్ని చేరవేస్తూ, అంతరిక్ష పరిశోధన కేంద్రం సూచనలు పాటిస్తూ నిబ్బరంగా ఆపరేషన్ సక్సెస్ చేయగలిగింది. అంతరిక్షంలో వాతావరణ పరిస్థితులను తట్టుకొని అనారోగ్యాన్ని కూడా లెక్క చేయక ఉన్నారంటే ఆమె ఆత్మస్థైర్యం మెచ్చుకోదగినదే. ఆది నుంచి ఆమెది సాహసో పేత ప్రయాణమే! సునీత, విల్మోర్‌లతో పాటు భూమిపైకి చేరుకున్న ఆస్ట్రోనాట్‌లు నిక్ హేక్, గోర్బునోవ్‌లు అంతరిక్షం నుండి 17 గంటల ప్రయాణం తర్వాత భూమ్మీద కాలెట్టారు. అనంతరం జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించారు. వారు ఎవరూ నడిచే స్థితిలోలేరు. వారు భూమికి తిరిగి వచ్చాక గురుత్వాకర్షణ శక్తికి తిరిగివారు నిలుచోలేరు. కనీసం ఆరు వారాలు పడుతుందని వైద్యశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. సునీత భారతీయ సంతతికి చెందినవారు కావడంతో ఆ సేతు హిమాచల పర్యంతం ఆమె క్షేమంగా రావాలని కోరుకున్నారు. ఆమె నేల మీద పాదంమోపాక గుజరాత్‌లోని మొహసనా జిల్లాలోని ఆమె పూర్వీకులు ఉండే ఝులసన్ వాసులు కరతాళ ధ్వనులతో కేరింతలు కొట్టారు.ప్రవచనకర్తలు సైతం ఆమెలోని ఆధ్యాత్మిక భావనలే సునీతను అంతరి క్షయానంలో అత్యున్నత శిఖరాలు అందుకునేటట్లు చేస్తాయని ప్రశంసిస్తున్నారు. నిరంతర కక్ష్యలో పరిభ్రమించే ఐఎస్‌ఎస్‌లో వ్యోమగాములు కాలక్షేపం చేసారు. మొత్తం17 వేల మైళ్ల వేగంతో వ్యోమనౌక భూమి దిశగా ప్రయాణించింది. డ్రాగన్ కాప్స్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించాక ఉత్కంఠ బయలుదేరింది. ఏమైతేనేం వారుగమ్యాన్ని చేరుకోగలగడం ఆనంద దాయకం. భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కొన్ని నెలల ఎదు రుచూపుల తర్వాత పుడమికి తిరిగి రావడం భారతీయులందరికీ గర్వకారణం. ఈ మాటలన్నది ఎవరో కాదుమన ప్రధాని నరేంద్ర మోడీ.అంతరిక్షానికి వెళ్లినవెంటనే తిరిగి వచ్చిన అంతరిక్ష పరిశోధకుల కన్నా సునీత విలియమ్స్ బృందం దాదాపు 9 నెలల పాటు అక్కడే ఉండి ఆరోగ్యంగా తిరిగిరావడం ఎంతో విశేషం. ఇలాంటి రోదసి యాత్రలు ఇంతక్రితం జరిగినా వాటికి, వీటికి ఎంతో తేడాఉంది. గతంలో కల్పనాచావ్లా రోదసియాత్రకు వెళ్లి వచ్చినా ఆమె ఇప్పుడు మనతో లేరు. అదొక విషాద చరిత్ర. ఈసారి ఇంకొక ముందడుగు పడింది.' మీ కోసం భారత్ ఎదురుచూస్తోందని భారత ప్రధాని నరేంద్రమోడీ అభిలషించారు.ఆ మేరకు సునీతకు లేఖ రాశారు. సునీత సాధించిన విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. మీరు ఎంత దూరంలో ఉన్నా మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. తన కుమార్తెలకు ఆతిధ్యం ఇవ్వాలని భారత్ ఉవ్విళ్ళూరుతోందని ప్రధాని మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టుచేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు ఎన్నికల్లో అంతరిక్షం నుండి ఓటు వేసిన తొలి మహిళగా సునీత రికార్డుల్లోకెక్కారు. ఆమె 9స్పేస్ వాక్స్‌లో సుదీర్ఘ సమయం 62 గంటల పాటు స్పేస్ వాక్ లో పాల్గొన్న మహిళగా చరిత్ర సృష్టించారు. రోదసి కేంద్రంలో ఆమె ఎక్కువ సేపు వ్యాయామానికి కేటాయించారు. స్పేస్‌లో ఉన్న కాలంలో వారు 150 ప్రయోగాలను చేపట్టారు. యునైటెడ్ నేషన్స్ నావల్ అకాడమీ నుంచి 1987లో ఫిజికల్ సైన్స్‌లో డిగ్రీని పొందారు. 1998లో తొలిసారి సునీతాను వ్యోమగామిగా నాసా ఎంపికచేసింది. ఈఅంతరిక్ష ప్రయాణానికి ముందు, ఆమె రెండు స్పేస్ మిషన్లను చేపట్టారు.క్రూడ్రాగన్ క్యాప్స్యూలక్సను నింగిలోకి పంపి, వ్యోమగాములను తిరిగి తీసుకొచ్చేందుకు అమెరికా 140 మిలియన్ డాలర్లను వెచ్చించింది. ఎంత ఖర్చు చేసినా అంతరిక్ష పరిశోధనా ఫలితాల విలువ అనంతం!



పొగిడేవారు లేనప్పుడు కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.

శామ్యూల్ జాన్సన్



ఒక విషయం మనకు క్షుణ్ణంగా తెలిసినప్పుడే దాన్ని ఇతరులకు బోధ చేయాలి.

ట్రయోన్ ఎడ్వర్డ్స్

# ప్రమాదంలోకి నెట్టివేస్తున్న 'కార్చిచ్చు'

**అడవులలో మంటలు ఏదో ఒక రాష్ట్రానికో, దేశానికో పరిమితమైనవి కాకుండా విశ్వవ్యాప్త మైనవిగా గుర్తించబడిన నేపథ్యంలో వీటి నివారణ కోసం అంతర్జాతీయ స్థాయిలో మేధో మదనం జరిగి సరైన ప్రణాళికల రూపకల్పన జరగాల్సి న అవసరమెంతైనావుంది. ఈ నేపథ్యంలో ఈఏడాది జనవరిలో అమెరికా లాంటి అగ్రరాజ్యంలో టెక్సాస్, కాలిఫోర్నియా నగరాల్లో అమెరికా చరిత్రలో ఎప్పుడూ కనీవిని ఎరగని కార్చిచ్చు ప్రపంచ సినీ పరిశ్రమకే గుండెకాయ లాంటి అత్యంతసంపన్న ప్రాంతమైన హాలీవుడ్‌ని కాల్చి బూడిద చేసిన వైనం గమనార్హం.**



డాక్టర్ నీలం సంపత్

పంచభూతాల్లో ఒకటైన భూమి సకల చరాచర జీవకోటికి మూలాధారమనే సార్వజనీన సత్యం లోక విదితమే.విఖ్యాత తత్వవేత్త కార్ల్‌మార్క్స్ మాటల్లో ప్రకృతిలో భాగంగానే మనిషి మనుగడ సాగిస్తున్నాడు. కాబట్టి ప్రకృతి మనిషి దేహమే. మానవ జాతి అంతరించిపోకుండా వుండాలంటే మనిషి ప్రకృతితో నిరంతరం సంభాషిస్తూ వుండాలి. సజీవ సంబంధాన్ని కలిగి వుండాలి. మనిషి భౌతిక లేదా మానసిక జీవితం ప్రకృతితో ముడిపడి వుంటుందని అంటున్నామంటే ప్రకృతి తనతో తాను ముడిపడివుంటుందని అర్థం. ఎందుకంటే మనిషి ప్రకృతిలో భాగమే.ఆ ప్రకృతికి గుండెకాయ లాంటివే అడవులనే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు.నిజానికి అడవి అంటే ఆకాశాన్ని చుంబించే ఎత్తైన చెట్ల సమాహారమే కాదు మానవాళి అనారోగ్యాన్ని కూకటి వేళ్ళతో పెకిలించే అనేక ఔషధ మూలికలకు ఆలవాలమైన అమూల్యమైన ఓ దివ్యమైన ఔషధ వనం కూడానని చెప్పక తప్పదు.పర్యావరణ సంతులనానికి ప్రాణంపోసే ఎకోసిస్టమ్‌కి ఊపిరిలూదే వృక్ష,జంతు జీవజాలపు సమాహారం కూడాను. అంతకుమించి అడవి కోట్ల సంఖ్యలో మానవాళి విసర్జించే కార్బన్ డై ఆక్సైడ్ లాంటి అనేక కాలుష్య కారక విష వాయువులను తన ఆహారంగా స్వీకరిస్తూ మానవాళికిప్రాణ వాయువైన ఆక్సిజన్‌ను ప్రతిఫలంగా కానుకగా అందించే పరోపకారి. అంతే కాకుండా తన సుస్థిర ఆరోగ్యంతో మానవ జాతి అస్థిత్వానికి అవసరమైన జలవనరులను వానల రూపంలో ఆవిష్కరిస్తూ నదులూ, సెలయేర్లని సృష్టిస్తూ పర్యావరణ పరిరక్షణకు నిరంతరం ఊపిరిలూదుతున్న ప్రకృతి సిద్ధమైన జలచక్రాన్ని సృష్టిస్తున్న ఓ గొప్ప ప్రయోగశాల. భీకరమైన వరదల ఉధృతి బారి నుండి వ్యవసాయ పంటలకు ఊపిరులూదే భూసారాన్ని కాపాడే బాధ్యతను స్వీకరిస్తూ పుట్ల కొద్ది పంటలను పండిస్తూ మానవాళి ఆకలిని తీర్చే అన్నదాత మాత్రమేకాదు వారిని జల ప్రళయాల నుండి కాపాడే ఆత్మబంధువు కూడాననే సత్యమూ లోక విదితమే.వీటన్నింటికీ అదనంగా సూర్యుడి అణుధార్మిక కిరణాలతో పెరుగుతున్న భూతాపం దుష్ప్రభావం నుండి మానవాళిని కాపాడే గురుతర బాధ్యతను నిర్వర్తించడంతో పాటు మానవాళి తమ భోగలాలసతతో కూడిన జీవనం కోసం ఉపయోగిస్తున్న రిఫ్రిజియేటర్లు, ఎయిర్ కండిషనర్లు సృష్టిస్తున్న క్లోరోఫ్లోరో విషవాయువులను దిగమింగుతూ ఓజోన్ పొరను కాపాడుతూ ఈ ధరిత్రి పై మానవాళితో పాటు సకల జీవరాశుల మనుగడకు ఊపిరిలూదే మహత్తర శక్తిగల అడవులు ప్రతిఏటా వేసవిలో అగ్నిప్రమాదాలలో చిక్కుకుని ఆహుతౌతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు రాలిన ఆకులపై కురిసే వానల ఫలితంగా తయారయ్యే సేంద్రియ ఎరువులు మంటల్లో కాలి బూడిదవడం మూలాన అడవులు పునరుజ్జీవనానికి నోచుకోక పోగా ఎంతో విలువైన వృక్షసంపద అగ్నికి ఆహుతౌతోంది. ప్రతి వేసవిలో అనివార్యంగా సృష్టించబడుతున్న మంటలు తరతరాలుగా అడవిని కంటికి రెప్పలా కాపాడుతున్న ఆదిమ జాతి గిరిజన బిడ్డల ఆవాసాలతో పాటు, వారి తరతరాల సాంస్కృతిక వారసత్వ సంపదను బుగ్గిపాలు చేస్తూ వారు వారి ప్రాణ రక్షణ కోసం మరో ప్రాంతానికి వలసవెళ్ళేలా చేస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిపై చేస్తున్న దాడుల ఫలితంగా అంతరించిపోగా మిగిలిన వన్య ప్రాణులతో పాటు అరుదైన వృక్ష,జంతు జీవజాలం అగ్నికి ఆహుతౌతోంది. ఔషధ మూలికలతో పాటు భూసారం సైతం బూడిదగా మారుతున్నాయి. నిజానికి అడవుల దహనానికి ప్రకృతి విపత్తుల కన్నా మానవ తప్పిదాలే అధిక శాతం కారణంగా మారుతున్న వైనం ఆత్మహత్యాసదృశంగా భావించక తప్పదు.ఋతువుల మార్పిడి నేపథ్యంలో సూర్య కిరణాలను సైతం తమను దాటి భూమిని తాకనివ్వని వృక్షాలు వేసవి రాకకు ముందే ఆకులను విడిచే క్రమంలో పచ్చని అడవులన్నీ మోళ్లుగా మారి అడవులన్నీ ఎండిన ఆకులతో గలగలలాడుతుండడం



ప్రతి ఏటా అనివార్యంగా జరిగే ప్రకృతి పరిణామ దశగా అభివర్ణించక తప్పదు. పర్యావరణ అసమతుల్యంతో ఏర్పడుతున్న అనావృష్టి ఫలితంగా ఎండిన అడవులు,గడ్డిఅకాల వర్షాలతో పాటు పడే పిడుగులు, విపరీతంగా పెరుగుతున్న ఎండల వలన వేడెక్కే పలుగు రాళ్ళమూలాన సైతం అగ్గి రాజుకునే అవకాశాలు లేక పోలేదు.ఇవి కాకుండా అడవి ఒడిలోనే నివాసముంటున్న అడవి బిడ్డలతో పాటు అటవీ సమీప గ్రామాల ప్రజలు సైతం తేనె, బంక, ప్రతి ఏటా తునికాకు సేకరణకు ముందు చేసే చాక్‌తరస్ కార్యకలాపాల లాంటి కలపేతర అటవీ ఫలసాయం కోసమో లేదా తమ పశువులను మేపడానికో అడవుల్లో సంచరించే క్రమంలో బీడీలు, చుట్టలు తాగిపడేయడం కూడా అడవుల్లో మంటలు రాజుకోవడానికి కారణంగా మారుతున్నాయని చెప్పవచ్చు. మానవాళితో పాటు కోట్లాది వృక్ష, జంతు జీవ రాశుల మనుగడనీ, వారి భవిష్యత్తునూ శాసించే అడవుల రక్షణ ప్రాథమికంగా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న అటవీశాఖ అధికారులదేననేది నిర్వివాదాంశమే. అడవులు అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్న వేసవి కాలంలో ఫారెస్ట్ బీట్ అధికారులతో పాటు వారి పైస్థాయి అధికారులు సైతం అడవినే తమ ఇళ్లుగా భావిస్తూ పూర్తి అప్రమత్తతతో వుండాలి. వేసవి కాలం ప్రారంభంలో అటవీ భూములపై పరుచుకున్న ఎండుటాకులను బ్లోయర్ల సహాయంతో ఎప్పటి కప్పుడు తొలగించడంతో పాటు మంటలు విస్తరించకుండా వుండడం కోసం ఫైర్ లైన్ ఏర్పాటు చేయడం ఆశించిన ఫలితాలను ఇస్తుందనేది నిపుణుల నిశ్చితాభిప్రాయం. అదే విధంగా అవసరమైన సంఖ్యలో బ్లోయర్ల లాంటి అగ్నిమాపక యంత్రాలను సైతం సమకూర్చాల్సి న బాధ్యత నిక్కచ్చిగా ప్రభుత్వాలదేనని చెప్పక తప్పదు. వేసవి ప్రారంభంలో దట్టమైన ఎండుటాకుల పొరను ఎక్కడికక్కడ కుప్పలుగా చేసి జాగ్రత్తగా కాల్చి వేయడం కూడా అటవీశాఖచేస్తూనే వుంటుంది. అడవుల్లో మంటలు రాజుకోవడానికి ప్రకృతివిపత్తుల కన్నా మానవ తప్పిదాలూ, విద్రోహ చర్యలే ఎక్కువ శాతం కారణాలుగా మారుతున్న నేపథ్యంలో అడవుల లోపలా,అటవీ సమీప గ్రామాలలో నివసిస్తున్న ప్రజలకు కార్చిచ్చుల మూలంగా సంభవించబోయే విపరిణామాలను వివరిస్తూ వారిని చైతన్యపరచాలి. తాగి పడేసే ఓ చిన్న బీడీ, చుట్ట లేదా సిగరెట్ ముక్కతో అంటుకునే నిప్పు కార్చిచ్చుగా మారి అడవిని ఎలా భస్మం చేస్తుందో తద్వార మన మనుగడ పై ఎలాంటి దుష్ప్రభావాలు పడతాయో ప్రజల మనస్సులకు హత్తుకునేలా వివరించాలి. అదే విధంగావిద్యా సంస్థలలో విద్యార్థులతో పాటు అభయారణ్యాలలో రకరకాల పక్షులనూ, జంతువులనూ,అడవి అందాలను ఆస్వాదించడానికి వెళ్లే పర్యాటకులకు సైతం అడవిని కార్చిచ్చులా దహించే మంటల నివారణ పట్ల అవగాహన కలిగించాలి.ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తున్న యన్.జి.ఓ.ల సహాయ సహకారాలు సానుకూల ఫలితాలను ఇవ్వవచ్చని చెప్పక తప్పదు. అడవులను ఏతావాతా ఏటా కాల్చివేస్తున్న అడవుల రక్షణ కు ఊపిరిలూదే నూతన అటవీ చట్టాలను రూపొందించి త్రికరణ శుద్ధిగా వాటిని అమలు పరచాల్సిందే.అదే విధంగా మంటలను సాధ్యమైనంత తొందరగా ముందస్తుగా గుర్తించడానికి అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు ప్రతి రూపమైన డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా మంటలు ప్రారంభమైన అటవీ ప్రాంతాలను గుర్తించి తక్షణమే అక్కడకు చేరుకుని ఆ మంటలు కార్చిచ్చుగా మారక ముందే బ్లో యర్లు తదితర అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పి వేయాలి. కృత్రిమ మేధస్సుతో వినూత్న అగ్నిమాపక సాధనాలను సృష్టించాలి. అడవులని దహించివేస్తున్న మంటలను ఆర్పడంలో స్థానిక ప్రజల క్రియాశీల ప్రాతినిధ్యం ఆశించిన ఫలితాలను ఇస్తుందని చెప్పక తప్పదు.మరో వైపు అడవులలో మంటలు ఏదో ఒక రాష్ట్రానికో, దేశానికో పరిమితమైనవి కాకుండా విశ్వవ్యాప్తమైనవిగా గుర్తించబడిన నేపథ్యంలో వీటి నివారణ కోసం అంతర్జాతీయ స్థాయిలో మేధో మదనం జరిగి సరైన ప్రణాళికల రూపకల్పన జరగాల్సి న అవసరమెంతైనా వుంది.ఈ నేపథ్యం లో ఈ ఏడాది జనవరిలో అమెరికా లాంటి అగ్రరాజ్యంలో టెక్సాస్, కాలిఫోర్నియా నగరాల్లో అమెరికా చరిత్రలో ఎప్పుడూ కనీవిని ఎరగని కార్చిచ్చు ప్రపంచ సినీ పరిశ్రమకే గుండెకాయ లాంటి అత్యంత సంపన్న ప్రాంతమైన హాలీవుడ్‌ని కాల్చి బూడిద చేసిన వైనం గమనార్హం. ఈ అత్యంత వినాశకరమైన కార్చిచ్చును ఆపడానికి అగ్రరాజ్యమైన అమెరికా సైతం కెనడా, మెక్సికో లాంటి దేశాల సహాయ సహకారాలు తీసుకోవాల్సి వచ్చిన నేపథ్యంలో అడవులను దహించివేస్తున్న కార్చిచ్చును ఆపడానికి అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలను జరపాల్సిందే.

# కనుమరుగవుతున్న పిచ్చుకల జాతి

**రామ కిష్టయ్య సంగన భట్ల**

పిచ్చుకలను సంరక్షించాలన్న లక్ష్యంతో ఏటా మార్చి 20వ తేదీని పిచ్చుకల సంరక్షణ దినంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. మొట్టమొదటి ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2010లో పాటించారు. అంతర్జాతీయంగా పిచ్చుకల సంరక్షణ కోసం ఈ దినోత్సవాన్ని నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఫ్రాన్స్‌కు చెందిన ఎకోసిస్ యాక్షన్ ఫౌండేషన్, ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో నిర్వహిస్తోంది.ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న సహజ జీవవైవిధ్యం, జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి, వాటిని కాపాడుకోవడానికి ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ ముఖ్యోద్దేశం.ఒకప్పుడు సూర్యోదయానికి పూర్వమే, ఆహ్లాదవాతావరణాన్ని కల్పిస్తూ, గూళ్ళల్లో నుండి బయటకువచ్చి, కళ్లు తెరవగానే కనిపించే ముద్దులొలికే పిట్టల కిచకిచల ధ్వనులు నేడు కరువయ్యాయి. పిచ్చుకలు ఒకనాడు పంట చేలల్లో, పల్లె ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవి. నాడు గ్రామాలలోని ఇళ్ల ముంగిట ఇవి గుంపులుగా వాలడం ఏదో అలికిడి అవగానే తుర్రుమని ఎగరడం వంటి దృశ్యాలు సందడిగా చూడముచ్చటగా ఉండేవి. చెట్లపై కట్టుకున్న గూళ్లు చాలా అద్భుతంగా ఉండేవి. జనావాసాలతో మమేకమై జీవిస్తున్న వీటి విషయాలలో ఇవి మెత్తని పీచు వట్టి వాటితో గూడు కట్టడం, గుడ్లను పొదగడం, నోటితో ఆహారాన్ని పిల్లలకు అందించటం, ఆ పిల్లలు రెక్కలొచ్చి ఎగిరేంత వరకు జాగ్రతగా కాపాడటం మనకు తరచూ కనిపించే దృశ్యాలు. ఈ దృశ్యాలు తల్లి ప్రేమకు నిదర్శనం గా నిలుస్తాయి. జీవన శైలిలో పెనువేగంగా వచ్చిన మార్పే పిచ్చుకపై బ్రహ్మాస్త్రంగా పరిణమించింది. పిచ్చుకజాతి అంతరించనుంది. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో పళ్లు, ఆహారధాన్యాల ఉత్పత్తి పిచ్చుకలు అంతరించిపోవడానికి కారణాలు. ఒకప్పుడు చైనాలో పిచ్చుకలంటే చీడపురుగులుగా భావించే వారట. పంటలను నాశనం చేస్తున్నాయని, ఆహార ధాన్యాలను అధికంగా తినేస్తున్నాయనే అపోహతో చైనాలో పిచ్చుకల జాతిని నాశనం చేయడానికి నడుం బిగించి, తగిన చర్యలు తీసుకున్నారట. ఫలితంగా చైనాలో అతి తక్కువ సమయంలో పిచ్చుకలు మొత్తం నశించాయట. వాస్తవానికి పిచ్చుకల ఆహారం పంట పొలాలపై దాడిచేసే చిన్నచిన్న పురుగులు, క్రిమికీటకాలు. ఈ సంగతి గ్రహించని చైనీయులు వాటి వినాశాన్ని కోరుకున్నారు. పిచ్చుకలు లేని కారణంగా పంటలకు మరింతగా పురుగుపట్టి 1958-61 మధ్యకాలంలో చైనా తీవ్రమైన ఆహార కొరతను అనుభవించిందట. చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రపంచానికి తెలియకుండా రహస్యంగా ఉంచిందని చెపుతుంటారు. గతంలో ఊర పిచ్చుకలు పల్లెటూర్లల్లో విరివిగా వుండేవి. రైతులు పిచ్చుకల ఆహారం కొరకు వరి కంకులను గుత్తులుగా కట్టి ఇంటి చూరుకు వేలాడ దీసేవారు. రైతులు జొన్న, సజ్జ తదితర సంప్రదాయ పంటలను సాగు చేస్తుండేవారు. వాటిని తిని పక్షులు జీవించేవి. అయితే ప్రస్తుతం పత్తి తరహా వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపిస్తుడడంతో పిచ్చుకలకు ఆహారంకరువైంది. ప్రస్తుతం పంటలు లేక ఆహారం కరువై, పూరిళ్ల స్థానంలో సిమెంట్ గృహాలు, ఇంకా అనేక కారణాల వలన పల్లెల్లో అవి కనబడడం లేదు. పిచ్చుకలో ఇంచుమించు 35 జాతులుంటే, అవి కాలక్రమేణ కనుమరుగవుతున్నాయి. పిచ్చుకల ఉనికికి ఏర్పడుతున్న ప్రమాదాల నివారణకు ప్రపంచ దేశాలు ప్రతి సం॥ మార్చి20న ప్రపంచ పిచ్చుకలదినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. అందుకు అవసరమైన కార్యక్రమాలను చేపడుతున్నాయి. పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలాబిళ్లను కూడా విడుదల చేసింది. పర్యావరణాన్ని కాపాడే ఈ పిచ్చుకల జాతిని సంరక్షించుకునేందుకు అందరూ నడుంబిగించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పల్లెల్లో నివసించే వారు ఊరపిచ్చుకల గూళ్లు కనబడితే వాటిని జాగ్రత్తగా సంరక్షించుకోవాలి. కృత్రిమమైన పిచ్చుక గూళ్లను ఏర్పాటు చేయడం ద్వారా పిచ్చుక జాతిని కొంత వరకు సంరక్షించవచ్చని శాస్త్రవేత్తల సలహా.

# ప్రజావాక్కు



## స్వేచ్ఛాపూరిత సంబంధాలు అవసరం

దేశంలో సమాఖ్య వాద స్ఫూర్తి చౌరస్తాలో నిలబడింది, ఎందుకని హిందీని బలవంతంగా రుద్దడం మూలంగానే కదూ ఇంకోవైపు రాష్ట్రాలు కొన్ని లక్ష్యాలను చేరితేనే నిధులు విడుదల చేస్తామనిచెప్పడం. ఆధిపత్య భావజాలానికి ప్రతీక మరోవైపు పథకాల రూపకల్పనలో రాష్ట్రాలకు స్వేచ్ఛ అవసరం.ఉదాహరణకు ఉపాధి హామీ పథకమే తీసుకుందాం తెలంగాణ రాష్ట్రఅవసరాలకు అనుగుణంగా మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉంది. భూపరివేష్టిత రాష్ట్రాలలో ఎక్కువగా ఎర్ర నేలలు ఉండడం సహజం. వాటిలో ఎక్కువగా పండ్లు కూరగాయలుపండే అవకాశం ఉంటుంది.కావున ఎక్కువ మొత్తంలో వాటిని స్పెషల్ క్యాటగిరి కింద ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విధమైన స్వేచ్ఛ కల్పించడం మూలంగా రాష్ట్రాలు దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదు. పైపెచ్చు ఎగుమతి కర్మాగారాలుగా మారే అవకాశం ఉంటుంది. తద్వారా స్వయం సమృద్ధి సాధించే అవకాశం ఉంటుంది. ఈ రకమైన స్వేచ్ఛ పూరిత సంబంధాలు అవసరం.

-భారత అవినాష్, జనగామ

## అదనపు పనికి అదనపు వేతనం

ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలో స్టేట్ సిలబస్‌కు మార్చి 19కి వార్షిక పరీక్షలు అయిపోతున్నాయి. సీబీఎస్‌ఈ సిలబస్‌కు రాష్ట్రంలో ఏప్రిల్2వ తేదీన వార్షికపరీక్షలు అయిపోతున్నాయి. కళాశాలలకు మార్చి 29 చివరి పని దినంగా ఆదేశాలు జారీచేయడం జరిగింది. కానీ ప్రిన్సిపాల్ మాత్రం ఏప్రిల్ 24వ తేదీ వరకు తప్పనిసరిగా డ్యూటీలకు హాజరు కావాలంటున్నారు. సెలవులలో డ్యూటీలు చేస్తేలెక్చరర్స్‌కు ఏప్రిల్ నెలలో 25 రోజులు అదనపు వేతనాలు ఇవ్వాలి.

-రాపాక రవీందర్, జనగాం

## మంచి నీటిని అందించాలి

ఎండాకాలం ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారమైన భోజనాన్ని అందించడం తోపాటు వారికి సురక్షితమైన మంచి నీటిని కూడా అందుబాటులో ఉంచాలి. అలాగే విద్యార్థులు అందరూ ప్రతి గంటకు ఒకసారి మంచి నీటి తాగేందుకు వారికి సమయాన్ని కేటాయించాలి.

-కె.రామారావు, హైదరాబాద్

## మొక్కుబడిగా ప్రజావాణి

ప్రతి సోమవారం రోజున ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి దరఖాస్తుల కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించడం తప్ప పరిష్కారం ప్రజలకు దొరుకడం లేదు. సమస్యలపై అధికారులు చోరువ తీసుకొనేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని పరిష్కారం చూపించాలి. ప్రభుత్వ అధికారులు పౌరసేవలను సరియైన సమయం అమలు చేసేవిధంగా సూచనలు చెయ్యాలి.సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం ఇవ్వాలి.పౌరులు పైన తెల్పిన వాటి గురించి ప్రశ్నించినప్పుడు మా విధులకు ఆటంకం కల్పిస్తున్నారని అల్లరి చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిసేస్తూ పనులను చేయటం లేదు. పరోక్షంగా అవినీతికి పాల్పడుతున్నారని తీరా దొరికితే అట్లావి మా వద్ద జరుగవు అని నీతిమాటలతో ప్రజాసమస్యలు నిరుగారుస్తున్నారు. సమస్య పెండింగ్ లేకుండా పరిష్కారం చూపాలి.

-సింగు. లక్ష్మీనారాయణ, చింతకుంట, కరీంనగర్

## పెరుగుతున్న అపరిష్కృత కేసులు

ఏపి రాష్ట్ర హైకోర్టు, ఏఎన్‌యు నిర్వహించిన కార్యకలాపాల వివరాల ప్రకారం దేశంలో అపరిష్కృత కేసుల సంఖ్య ఐదు కోట్లకు దాటడం ఆందోళన కలిగిస్తుంది. సమాజంలో వ్యక్తుల మధ్య సంఘీభావం పూర్తిగాకొరవడటం, ప్రతీకార ధోరణి, ఆధిపత్య ధోరణి, అమానుష చర్యలు చాలావరకు కేసుల పెరుగుదలకు కారణం. గ్రామ స్థాయిలోనే పెద్దల సమక్షంలో వివాదం తేల్చుకోవచ్చు.పంతాలు, పట్టింపులు ఎక్కువై పై స్థాయికి వెళ్తున్నారు.ధనం,కాలం, శ్రమ పూర్తిగా ఇరుపక్షాలకు నష్టమే. వివాదం లేకుండా ప్రవర్తించడం సమస్యను జటిలం చేస్తుంది. న్యాయ శాస్త్రపరిధిలోతీర్పుకు సమయం తప్పదు.న్యాయ శాస్త్ర నిపుణులు ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాలకు కృషి ఎంతో విలువైనది.న్యాయ విద్యార్థుల క్రమశిక్షణ, సహనం అలవాటైతే ఉత్తమ ఫలితాలు,విజయం సాధ్యమే .

-బొల్లోజు మేఘనాథమ్, విశాఖపట్నం

## జ్ఞానానికి ప్రాధాన్యతనిద్దాం

పాఠశాలల్లో విద్యార్థులకి కులమత బేధాలను చూపవద్దు. విద్య అందరి హక్కు జ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలి అంటూనే ఉద్యోగాల్లో మాత్రం కులం కండిషన్స్ పెట్టడం ఎందుకు? జ్ఞానాన్ని దృష్టిలో ఉంచకోకుండా కేటగిరీ బట్టి ఉద్యోగలిస్తున్న రోజులివి. జ్ఞానానికి ప్రాముఖ్యం ఇచ్చి అసమానత్వాన్ని నిర్మూలించినప్పుడే విద్యార్థుల చదువుకి తగ్గ ప్రతిఫలం లభిస్తుంది.

-కాల్వనిఖిత, సిద్దిపేట

# ఐటి తరహాలో ఏఐ రంగం అభివృద్ధి చెందేనా?

**డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు**

నేడు దేశంలో ఉత్పాదక రంగం కుదేలై ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం వలన మేకిన్ ఇండియా లాంటి పథకాలు సఫలీకృతం కానందున అటు చైనా ఇటు అమెరికా నుంచి అనేక యంత్రాలు యంత్ర పరికరాలు దిగుమతి చేసుకోకతప్పడంలేదు. పారిశ్రామికరంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించడంవలన సరళీకృత ఆర్థికవిధానాల వలన జరిగిన ఫలితమిది. కుదేలైన తయారీ రంగం ఒక వైపుఉండగా నేడు దేశానికి దిక్కుగా సేవలరంగం మాత్రమే ముఖ్యంగా ఐటీరంగం వలన మనం ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నాం. ప్రపంచ దిగ్గజ కంపెనీలలో సైతం మన ఐఐటీ,ఎన్ఐటి,ఐఏఎంలలో చదివిన మన దేశపు విద్యార్థులే సీఈఓలుగా ఉన్నారు. ప్రపంచ సాఫ్ట్వేర్ రంగంలో రాణించడం మనకు గర్వకారణం. దీని పునాదులు ఆనాడుప్రభుత్వమే ఐఐటీలను ఎన్‌ఐటీలను స్థాపించి ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడం వలననే జరిగిందని మనం మరువరాదు. ఐఐటీలలో ఎన్‌ఐటీలలోనూ చదువుకున్న యువత ప్రపంచ పెట్టుబడిదారుల దేశాలలో ఉద్యోగాలు పొందేందుకు వలసపోయి వీరంతా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలలో ఆర్థిక అభివృద్ధికి గణనీయమే కృషిచేస్తున్నారు. ప్రపంచ అగ్రగామి కంపెనీలైన గూగుల్ మైక్రోసాఫ్ట్ ట్విట్టర్ వంటివాటి సీఈవోలుగా మనవారు ఉండటం సంతోషించదగ్గ విషయమే.అయితే ఇక్కడ చదువుకొని ఈ దేశ పెట్టుబడులతో ఐటి నైపుణ్యాలను సంపాదించి ఎక్కడికో వెళ్లి తమ నైపుణ్యాలతో ఆ దేశ ఆదాయాలను పెంపొందిస్తున్నారు. మన ప్రభుత్వాలు వారిని ఉపయోగించుకొని ఉంటే మన దేశం ఇంకా అభివృద్ధి చెందిఉండేది. అభివృద్ధి చెందిన ఐటీ రంగానికి ఇప్పటికైనా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగానికి అనుసంధానం చేసి ప్రపంచస్థాయిలో మళ్లీ మనకు ఉన్న ఐటీ రంగం పూర్వ వైభవాన్ని ఏఐ రంగానికి కూడాప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు ప్రభుత్వాలుతక్షణం పూనుకోవాలి. ఎందుకంటే సాఫ్ట్వేర్ రంగంలో ప్రోగ్రామర్ల నుంచి పెద్ద కంపెనీల సీఈఓల వరకు భారతీయులదే ఆధిపత్యం. ప్రతి ప్రఖ్యాత సంస్థ మనదేశంలో బ్రాంచీలు పెట్టగలదు. వారందరికి ప్రభుత్వం కావలసిన సౌకర్యాలుకల్పించగలిగితే కృత్రిమ మేధాను అభివృద్ధిచేయగలరు. కృత్రిమ మేధస్సు( ఏఐ) ప్రపంచ సాంకేతిక దృశ్యాన్ని మార్చుతున్న యుగంలో భారతదేశం ఒక కీలకమైన మలుపు దగ్గర ఉన్నది. ఐటీ శక్తిగా మన దేశానికి ఎంతో ఖ్యాతి విశాలమైన సాంకేతికప్రతిభ ఉన్నప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం



ఇంకా సొంతంగా ఏఐ ప్లాట్ఫామ్లను అభివృద్ధి చేయలేదు. టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలను ప్రపంచానికి అందించిన దేశం మనది. సరియైన మౌలిక సదుపాయాలు నిధులు లేకుండా స్వదేశీ ఏఐ అభివృద్ధి అసాధ్యం. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ పై మన దేశం స్థూల జాతీయోత్పత్తిలో ఒక శాతంకన్నా తక్కువగానే ప్రభుత్వం ఖర్చుచేస్తున్నది. అంటే ఇక ఏఐ ఎలా అభివృద్ధి చెందుతుంది? ఈ రంగంపై విదేశీయులపై ఆధారపడలేం కదా? చైనాఅయితే తన స్థూల జాతీయోత్పత్తిలో 2.43శాతం కృత్రిమ మేధా పైన ఖర్చుచేస్తున్నది. చైనా కృత్రిమ మేధా రంగంలో అమెరికాతో దాదాపు సమాన స్థాయిని పొందడానికి రెండుఅంశాలను కారణాలుగా చెప్పవచ్చు. మొదటిది వాణిజ్య సైనిక అనువర్తల అప్లికేషన్లో సెమీ కండక్టర్లను ఉత్పత్తి చేయడానికి అవసరమైన ప్రత్యేక యంత్రాలు పరికరాలు ఏఐ ప్రాసెసర్ల నుంచి హార్డ్వేర్ ఉత్పత్తులు ఏఐ మోడల్స్ వరకు మొత్తం డిజిటల్ టెక్నాలజీతో రంగంలో అవసరమైన అన్నిటి విషయంలో స్వయంసమృద్ధిని సాంకేతిక ఆధిపత్యాన్ని చేరుకోవడానికి చురుకైన స్థిరమైన జాతీయ విధానంకలిగి ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో మన దేశం కృత్రిమ మేధా అభివృద్ధికి చేపట్టవలసిన వ్యూహం ఇంతవరకు లేకపోవడం శోచనీయం. భారతదేశ విద్యా వ్యవస్థ సంవత్సరానికి 1.5 మిలియన్లకు పైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లనుఉత్పత్తి చేస్తున్నది. అయితే ఈ ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడానికి పాఠశాల నుండి ఉన్నత విద్యవరకు విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. సాంకేతికపై ఆసక్తిని పెంపొందించడానికి పాఠశాల స్థాయిలో ఏఐ అక్షరాస్యత,కోడింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరిచయంచేయాలి. కళాశాల స్థాయిలో ప్రాక్టికల్ ఏఐ ప్రాజెక్టులు, అంతర్ విభాగ అభ్యాసాలు, ఏఐ నైతికతపై అవగాహన చర్చలు అమలు జరపాలి.విశ్వవిద్యాలయాలు అధునాతన ఏఐ,మిషన్ లెర్నింగ్, పరిశ్రమ సమన్వయం వంటి అంశాల్లో పాఠ్యప్రణాళికను తయారు చేయాలి. ఈ అంశంలో విద్యాసంస్థలకు పరిశ్రమలకు మధ్య సమన్వయం ఏర్పరచాలి.పరిశ్రమలలో తప్పనిసరి ఇంటర్న్‌షిప్ మెంటార్ షిప్ కార్యక్రమాలు జరగాలి. ఏఐ విషయంలో సమగ్ర వ్యూహం అవసరం.ఇటీవలభారత్ ప్రభుత్వం ప్రకటించిన పదివేల కోట్లరూపాయలు ఈ దిశగా తీసుకున్న సరైనచర్య. అయితే ఈ పెట్టుబడి మనదేశంలో ఏఐ అభివృద్ధి ప్రపంచస్థాయిలో పోటీకి నిలబడడానికి సరిపోదు.ప్రపంచశక్తి సమీకరణలో ఏఐ నేడు ప్రధాన పాత్ర పోషించే దశలో ఉన్నది.ఈదశలో భారతదేశం సరైన ప్రణాళికలను రూపొందించి విద్యా విధానానికి అనుసంధానం చేసి అంతర్జాతీయ స్థాయిలో ఏఐ అభివృద్ధి జరగాలి. విదేశీ సాంకేతిక పై ఆధారపడకుండా భారతదేశం తన సొంతఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యవసరం.

**మనవి** | **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# అంచలంచెలుగా తగ్గిన ద్రవ్యోల్బణం

## రేవంత్ సర్కార్ ఆర్థిక నివేదిక

**హైదరాబాద్, మార్చి 19:** ద్రవ్యోల్బణం పరంగా కూడా జాతీయ స్థాయికంటే రాష్ట్రంలో తక్కువగానే ఉన్నట్లు రాష్ట్ర అర్థగణాంకశాఖ చెపుతోంది. 2023-24లో వార్షిక పద్ధతిన చూస్తే ద్రవ్యోల్బణం తెలంగాణలో పెరిగింది. జాతీయ స్థాయిలో 5.36శాతంగా ఉంటే రాష్ట్రంలో 6.36శాతానికి ద్రవ్యోల్బణం నమోదు అయింది. అయితే ధరల తగ్గుదలకు చేపట్టిన చర్యలు, ఉత్పత్తిరంగపరంగా పారిశ్రామిక ఉత్పత్తిసూచీలు, ఎనిమిది కీలకరంగాల్లో వృద్ధినమోదుకావడంవల్లనో ఏమో కానీ 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకూ చూస్తే జాతీయ స్థాయిలో 4.9 శాతం ద్రవ్యోల్బణం నమోదయితే తెలంగాణలో కేవలం 4.2శాతం మాత్రమే నమోదయిందని కేంద్ర అర్థగణాంక శాఖ వివరాలే చెపుతున్నాయి. అదేవిధంగా కార్మికశక్తి భాగస్వామ్యంకూడా వృద్ధిరేటుతోనే నడుస్తున్నది.

క్రమానుగతంగా నిర్వహిస్తున్న లేబర్‌ఫోర్స్ సర్వేను చూస్తే 2023-24 తెలంగాణలో 68.7శాతంగా ఉంది. జాతీయ స్థాయి గణాంకాలు 64.3శాతంకంటే తెలంగాణలోనే కార్మికశక్తి భాగస్వామ్యం ఎక్కువ ఉంది. గ్రామీణ పట్టణ్రపాంతాల్లో కార్మికశక్తి భాగస్వామ్యం తెలంగాణలో 7.4శాతం ఉంటే జాతీయ స్థాయికంటే 2.5 పర్సంటేజి పాయింట్లు ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. మహిళాశక్తి భాగస్వామ్యం కూడా జిల్లాల్లో తెలంగాణపరంగా 52.7శాతంగా ఉంది. జాతీయ స్థాయి 45.2శాతంకంటే తెలంగాణలోనే ఎక్కువ ఉంది. అలాగే పురుషుల కార్మికభాగస్వామ్యం పరిశీలిస్తే 85.3శాతంగా ఉంది. జాతీయస్థాకి 83.5శాతం కంటే ఎక్కువ ఉన్నట్లు కనిపిస్తోంది. ఇక ఉద్యోగుల ఉపాధిరంగానికి వస్తే తెలంగాణలో గ్రామీణప్రాంతాల్లో 72.2శాతం ఉద్యోగులుంటే జాతీయ సగటును చూస్తే 65.7శాతంమాత్రమే ఉన్నారు. ఇక పట్టణాల్లోకూడా తెలంగాణలో 55శాతంమంది ఉపాధి పొందుతుంటే కేంద్రస్థాయిలో 53.9శాతంగా ఉంది.

ఇక గత ఏడాది నిర్వహించిన లేబర్‌ఫోర్స్ సర్వేల్లోనే ఈ వివరాలన్నీ గుర్తించినట్లు రాష్ట్ర ఆర్థికసర్వే నివేదికలో పొందుపరిచారు. నిరుద్యోగిత రేటును గణనీయంగా తగ్గించగలిగామని తెలంగాణ సర్కారు చెపుతోంది. గ్రామీణప్రాంతాల్లో 3.8శాతం ఉంటే జాతీయ స్థాయిలో 2.8శాతంగా ఉంది. అలాగే పట్టణప్రాంతాల్లో కూడానిరుద్యోగిత 7.6శాతం ఉంటే జాతీయ స్థాయిలో 5.4శాతంగా ఉంది. మొత్తంగాచూస్తే తెలంగాణలో 5.1శాతం నిరుద్యోగితరేటు ఉంది. ఎన్డీయే సర్కారు పరంగా జాతీయ స్థాయిలో 3.5శాతంమాత్రమే ఉంది. నిరుద్యోగం పరంగా రాష్ట్రప్రభుత్వం చెపుతున్న లెక్కలు జాతీయ స్థాయితోపోలిస్తే మరిన్ని చర్యలుచేపట్టాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.




## తలసరి ఆదాయంలోనూ రంగారెడ్డి టాప్!

**హైదరాబాద్, మార్చి 19:** జిల్లాస్థాయి జిడిపి వృద్ధిరేటులోనే కాకుండా తలసరి ఆదాయంలోను రాష్ట్ర సగటుకంటే జిల్లాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. ఉపాధి ఎక్కువ పొందుతున్న రంగారెడ్డి జిల్లా మొదటిర్యాంకులో నిలిచింది. ఇక్కడ తలసరి ఆదాయం 10,55,913 రూపాయలుగా ఉంది.



అలాగే హైదరాబాద్ రంగారెడ్డితోపోలిస్తే సగంకంటే తక్కువగానే ఉంది. హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం 5,54,105 రూపాయలు అయితే మూడో స్థానంలో సంగారెడ్డి నిలిచింది. 3,45,478 రూపాయలు మేడ్చల్ మల్కాజ్‌గిరి 3,43,130 రూపాయలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3,21,281 రూపాయలుగా ఉంది. ఎక్కడయితే పారిశ్రామికీకరణ, ఉపాధిరంగం ఎక్కువ ఉందో అక్కడే తలసరి ఆదాయం కూడా భారీ స్థాయిలోనే నిలిచింది. జిడిడిపిలో 33వ ర్యాంకుతో ఉన్న ములుగు జిల్లా తలసరి ఆదాయంలో 15వ ర్యాంకులో నిలిచింది. 2,49,338 రూపాయలుగా ఈజిల్లా తలసరి ఆదాయం ఉంది. రాష్ట్రం చివరిజిల్లాలు అయిన కుమరం భీమ్, ఆదిలాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో కూడా తలసరి ఆదాయం గణనీయంగానే ఉన్నట్లు తేలింది. నిర్మల్ జిల్లా 18, మంచిర్యాల 21, అదిలాబాద్ 24, కుమురంభీమ్ 2,21,456 రూపాయలతో 25 స్థానాల్లో నిలిచాయి. పలకరాయి గనులు ఎక్కువ ఉన్న ప్రాంతాలుగా పేరున్న వికారాబాద్ జిల్లా 1,98,401 రూపాయలుతో 33వ ర్యాంకులో నిలిస్తే హణుమకొండ 32, జగిత్యాల్ 31వ ర్యాంకు, నారాయణ్‌పేట్ 30వ ర్యాంకుల్లో నిలిచాయి. తలసరి ఆదాయం పరంగా కూడా రంగారెడ్డి అగ్రస్థానంలో నిలిచింది. ఇపుడు ముఖ్యమంత్రి ప్రతిపాదిస్తున్న ఫోర్త్‌సిటీరాకతో ఆపరిసరాల జిల్లాలన్నీ కూడా తలసరి ఆదాయంతోపాటు జిడిడిపిలోను మరింత వృద్ధిపథంలోకి వెళతాయని ఆర్థిక నిపుణులు, రాష్ట్ర అర్థగణాంక శాఖ అంచనా వేస్తోంది.



## జిల్లాస్థాయి జిడిపిలో రంగారెడ్డి నంబర్‌వన్

### హైదరాబాద్ నంబర్ టూ, మూడోప్లేస్ మేడ్చల్‌మల్కాజ్‌గిరి!

**హైదరాబాద్, మార్చి 19:** జిల్లాస్థాయిలో స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జిడిడిపి)ని పరిశీలిస్తే రంగారెడ్డి జిల్లా అత్యధికంగా సమకూరుస్తోంది రెండోస్థానిలో హైదరాబాద్ జిల్లా నిలిచిందని సూచీలు స్పష్టం చేస్తున్నాయి. మొదటి ర్యాంకులో రంగారెడ్డి 3,17,898 కోట్లుగా ఉంది. అదే హైదరాబాద్ 2,57,949 కోట్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరి 1,04,710 కోట్లుగా జిడిడిపి నిలిచింది. ఇక నల్గొండ 53,771, భద్రాద్రికొత్తగూడెం 42,007కోట్లు, నిజామాబాద్ 41,768 కోట్లు, ఖమ్మం 41,576 కోట్లుగా నిలిచింది. ఆ తర్వాత అన్నీ కూడా 40 వేలకోట్ల లోపే జిడిడిపి ర్యాంకులు నమోదవుతున్నాయి. అత్యంత కనిష్టంగా 33వ ర్యాంకులో ములుగు జిల్లా ఉంది. ఇక్కడ జిడిడిపి 8873 కోట్లుకాగా జయశంకర్ భూపాలపల్లి 12,932 కోట్లు, కుమరం భీమ్ 13,700, నారాయణపేట్ 13,818, రాజన్న సిరిసిల్లా 13,981 కోట్లుగా ఉన్నాయి. మొత్తం 33 జిల్లాల పరిధిలో కూడా అత్యంత తక్కువగా ములుగు, అత్యధికంగా రంగారెడ్డి నిలిచింది. ఎక్కువ శాతం హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి జిల్లాలోనే పారిశ్రామికీకరణ జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ నగరానికి చుట్టూ ఉన్న మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ సరిహద్దుల్లోనే పారిశ్రామికీ కరణ ఎక్కువ జరిగింది. ఇప్పటికీ జరుగుతూనే ఉంది. ఇక ఐటి సేవల రంగానికి వస్తే గచ్చిబౌలి, హైటెక్‌సిటీల నుంచి మరింత సుదూర ప్రాంతాలకు విస్తరించింది. అందువల్లనే జిఎస్‌డిపిపరంగా జిడిడిపిలో రంగారెడ్డి జిల్లా మొదటిర్యాంకులో నిలిచింది.

# ఆర్ అండ్ బికి రూ.5,907 కోట్లు

**రూ.28 కోట్లతో హైబ్రిడ్ అన్యూటీ మోడల్‌లో 17వేల కి.మి.రోడ్ల అభివృద్ధి**

**2028నాటి హ్యామ్ పరిధిలోకి గ్రామీణ రహదారులు**

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** ఆర్‌అండ్‌బి శాఖకు రూ.5,907 కోట్లు ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రతిపాదించారు. తెలంగాణ ప్రభుత్వం హైబ్రీడ్ అన్యూటీ మోడల్‌లో రూ.28వేల కోట్ల అంచనా వ్యయంతో 17వేల గ్రామీణ రహదారులను 2028నాటికి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకొందని బడ్జెట్ సమావేశంలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. 40శాతం ప్రభుత్వ నిధులు 60శాతం ప్రైవేటు డెవలపర్లు పెట్టుబడి పెడుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 769.35 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారుల నిర్మాణానికి రూ. 3,725.22 కోట్ల మేర పరిపాలనా అనుమతులు జారీ చేసింది. వీటిలో 55 కి.మీ. పొడవు కలిగిన రహదారులు, 9 వంతెనల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి వీలుగా, ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండేలా రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడైపోయిన రహదారుల మరమ్మతులు పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 12 జిల్లా కేంద్రాలలోకోర్టు భవన సముదాయాల నిర్మాణానికి 972కోట్లు పాలనపరపైన అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 253 ఎకరాల భూమిసేకరణ చేస్తామని తెలిపారు. రీజినల్‌రింగ్‌రోడ్డు దక్షిణభాగం కన్సల్టెంట్‌లను నియమించినట్లుతెలిపారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే హైవేలపై ప్రయాణిం చేటప్పుడు వసూలు చేసే టోల్ ఛార్జీ గ్రామీణ ప్రాంతాల్లో కూడా వసూలు చేసే అవకాశం ఉంది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 40శాతం ప్రభుత్వ నిధులు, 60శాతం ప్రైవేట్ డెవలపర్ పెట్టుబడితో అభివృద్ధి చేయడం ప్రజలపై భారం మోపడమే అనే అనుమానం కలుగుతోంది.

# మాది రైతు పక్షపాత ప్రభుత్వం



**నీటిపారుదల రంగానికి పెద్దపీట**

**రూ.23,373 కోట్లతో నీటిపారుదల రంగం పటిష్టం**

**పౌర సరఫరాల శాఖకు 5,734 కోట్లు**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని మరోసారి రుజువు అయిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్ పై ప్రశంసలు కురిపించారు. రైతాంగం అభివృద్ధి ప్రజల సంక్షేమాన్ని సమపాళ్లలో రంగరించి రూపొందించిన బడ్జెట్ ఇదని ఆయన అభివర్ణించారు. బుధవారం రాష్ట్ర శాసనసభలో ఆర్థిక, విద్యుత్ శాఖామంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్వాగతించారు. బడ్జెట్ ప్రసంగం పై ఆయన ఒక ప్రకటనలో స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ సాధికారత, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధిలతో పాటు నీటిపారుదల, పౌర సరఫరాలను పతిష్టవంతంగా మార్చేందుకు ఈ బడ్జెట్ ప్రతిబింబింప చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతాంగంపై మక్కువ ఎక్కువ అని చెప్పడానికి నీటి పారుదల రంగానికి రూ. 23,373 కోట్ల కేటాయింపు నిదర్శన మన్నారు. నల్గొండ జిల్లాలో లక్ష ఎకరాలకు నీరందించేందుకు గాను ఉదయ సముద్రం నుండి బ్రహ్మణ వెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను పూర్తి చేయడంతో పాటు నల్లగొండ, యాదాద్రి భోనగిరి జిల్లాలోని 107 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు ఫ్లోరోసిస్ రహిత త్రాగు నీరు అందించే ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తామన్నారు. అంతే గాకుండా మూసి ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలోనీ బునాదిగాని కాలువ పునరుద్ధరణ కోసం 266.65 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ తద్వారా యాదాద్రి జిల్లాలో పంటలు సస్యశ్యామలంగా మారనున్నాయన్నారు. కృష్ణా గోదావరి నదుల నీటి వాటాను తెలంగాణాకు సాదించేందుకు గాను ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూనే బి.ఆర్.ఎస్ పాలనలో జరిగిన అక్రమ కేటాయింపులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూనే బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర హక్కులను బలంగా వాదించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాలు నీటి వనరుల వినియోగాన్ని గుర్తించేందుకు వీలుగా టెలిమెట్రి పరికరాలను అమర్చడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తునే దీని ద్వారా నీటి కేటాయింపులలో పారదర్శకంగా ఉండొచ్చన్నారు. నీటిపారుదల రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి రైతాంగానికి వెన్ను దన్నుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం అదే సమయంలో సంక్షేమ రంగానికి సైతం బడ్జెట్ కేటాయింపులలో సముచిత స్థానం వేసి ప్రజల సంక్షేమం పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అందులో ముఖ్యంగా పేద ప్రజలకు నేరుగా కనెక్టివిటీ ఉన్న పౌర సరఫరాల శాఖకు ఏకంగా 5,734 కోట్లు కేటాయించడం మహాదానందంగా ఉందన్నారు. తద్వారా లక్షలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించినట్లైందన్నారు.

# విద్యారంగానికి మరిన్ని కేటాయింపులు

**గత యేడాది కంటే రూ. 1,719 కోట్లు పెంపు**

**మహిళా వర్సిటీ భవన నిర్మాణాలకు రూ. 550 కోట్లు కేటాయింపు**



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి గత బడ్జెట్ కంటే ఎక్కువ స్వల్పంగా నిధులు కేటాయింపును పెంచారు. గతేడాది విద్యారంగానికి రూ. 21,389 కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది దానిని కాస్త రూ. 23,108 కోట్లకు పెంచారు. గత ఏడాది కంటే రూ. 1719 కోట్లు నిధుల పరంగా పెంచారు. అయితే మొత్తం బడ్జెట్‌లో కేటాయింపుల శాతంలో మాత్రం గత ఏడాది కంటే స్వల్పంగా తగ్గింది. గత ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 7.57 శాతం నిధులను కేటాయింగా.. ఈ ఏడాది 7.77 శాతం నిధులను కేటా యించారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యాశాఖకు రూ. 19,580 కోట్లను కేటాయించగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం విద్యారంగానికి రూ. 21,389 కోట్లను కేటా యించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో విద్యారంగానికి రూ. 23,108 కోట్లను కేటాయించారు. గత ఏడాది పాఠశాల విద్యకు రూ. 17,931 కోట్లను కేటాయించగా.. ఈ ఏడాది రూ. 19,464 కోట్లను కేటాయించారు. ఉన్నత విద్యాకు గత ఏడాది రూ. 2959.10 కోట్లను కేటాయించగా.. రూ. 3643 కోట్లను కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. 58 స్కూల్స్ నిర్మాణానికి రూ. 11,600 కోట్లను మంజూరు చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన నేపథ్యంలో కోఠిలో అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టడం కోసం రూ. 550 కోట్లను కేటాయించారు.

# వైద్య, ఆరోగ్యానికి రూ. 12,393 కోట్లు

● ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి రూ. 2700 కోట్ల కేటాయింపు ● గత యేడాది కంటే రూ. 893 కోట్ల పెంపు



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధా న్యం కల్పిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవ త్సరానికి వైద్య, ఆరోగ్య శాఖకు రూ. 12,393 కోట్లను రాష్ట్ర సర్కార్ బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. గత ఏడాది కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులను స్వల్పంగా పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వైద్య రంగానికి రూ. 11,500 కోట్లను కేటాయించగా.. 2025-26 సంవత్సరాలో రూ. 12,393 కోట్లను కేటాయించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ. 893 కోట్లను అదనంగా కేటాయించింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాని పెరిగిన వైద్య ఖర్చుల నేపథ్యంలో మరింత విస్తృత పరచడానికి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం పొందేలా చర్యలు తీసుకోనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో ఆరోగ్యశ్రీకి రూ. 1143 కోట్లను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రంలో అసం పూర్తిగా ఉన్న సూపర్ స్పెషాలిటీ మరియు ఇతర ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల నిర్మాణానికి కావలసిన నిధులను మంజూరు చేసి వాటిని త్వరలోనే పూర్తి చేయాలని నిర్ణయించింది. చారిత్రాత్మక ఉస్మా నియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన నేపథ్యంలో నూతన భవనాల నిర్మాణాలకు రూ. 2700 కోట్లను కేటాయిస్తున్నట్టు బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు అంబులెన్స్‌లు అందుబాటులో లేని మండలాల్లో 136 కొత్త అంబులెన్స్‌లను ప్రవేశ పెట్టనున్నట్టు ప్రకటించింది.




# రూ.7.39 లక్షల కోట్లకు పెరిగిన రాష్ట్ర రుణం

**ప్రభుత్వరంగ సంస్థలు, ఎస్పీవిల వాటాయే ఎక్కువ!**

**హైదరాబాద్, మార్చి 19:** ప్రభుత్వరంగంపరంగా రేవంత్‌సర్కార్‌లో సొంత పన్నురాబడులున్న రాష్ట్రంగా అగ్రస్థానంలోనిలిచినప్పటికీ అప్పుల రూపంలో కూడా అదేస్థాయిలోపెరుగుతోంది. 88శాతం సొంతపన్నులరాబడి ఉన్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలోనిలిచింది. ఆ తర్వాత హర్యానా, కర్ణాటక రాష్ట్రాలునిలిచాయి. అలాగే ఇక రుణాలపరంగాచూస్తే గడచిన దశాబ్దకాలంలో ఒక్కసారిగాపెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ రుణాలు ఇతర అప్పులు ఫిబ్రవరి నెలాఖరునాటికి 4,37,223 కోట్లుగా ఉన్నాయి. అలాగే ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చినరుణాలు ఎస్పీవీలు, పిఎస్‌యులు వంటివాటికి ఇచ్చిన గ్యారంటీ రుణాలు అంటే ప్రభుత్వమే చెల్లింపు బాధ్యత ఉన్నవి 1,17,109 కోట్లవరకూ ఉన్నాయి. అలాగేఎస్పీవీలు, పిఎస్‌యులు తామే సొంతంగా చెల్లించుకనేవిధంగా ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చినరుణాలు 1,24,419 కోట్లుగా ఉన్నాయి. ఇక ఎలాంటి గ్యారంటీలేని రుణాలు ఎస్పీవీలు, కార్పొరేషన్‌లు ఇతర ప్రభుత్వ సంస్థలు తీసుకున్నవి 59,956 కోట్లుగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే రాష్ట్ర రుణభారం రూ.7,38,707 కోట్లకు చేరాయి. 2014-15లో ఉన్న ఈ రుణచెల్లింపు భారం 6954కోట్లుగా ఉంతే 2023-24 నాటికి 36,866 కోట్లుగా ఉందని బడ్జెట్ పత్రాల్లో పొందుపరిచారు. మొత్తంగాచూస్తే రుణచెల్లింపుల భారత ఏటికేడాది పెరుగుతోంది. 2014-15లో 7254 కోట్లుగా ఉంటే 2023-24 నాటికి మొత్తం రుణాల చెల్లింపుల ఏటికేడాది చెల్లింపుల భారం 61,691 కోట్లుగా ఉన్నట్లు రాష్ట్ర ఆర్థిక సర్వే ముఖచిత్రం చెపుతోంది. ఎస్పీవీలు, ప్రభుత్వ గ్యారంటీ రుణానలు ఎక్కువ వడ్డీరేట్లకే తీసుకుంటున్నాయి. 8.93శాతంనుంచ4 11.50 శాతం వడ్డీకి కూడా రుణాలు తెస్తున్నాయి. దీనితో సగటు వడ్డీ రేటు 7.49శాతంగా ఉంది. ఓపెన్ మార్కెట్ బారోయింగ్స్ ఎక్కువవు తున్నాయి. వడ్డీ చెల్లింపులభారం కూడా 2014-15లో 15.1శాతంగా ఉంటే అదికాస్తా 2023-24నాటికి 28.2శాతానికి పెరిగింది. ఈరుణభారం తగ్గించుకోవాలంటే రాష్ట్ర ఆర్థికవనరులను మరింతగా పెంచాలి. రుణాలపై ఆధారపడటం కూడా తగ్గించుకోవాల్సిన అవసరంఎ ంతైనా ఉంది. ఇక పిఎస్‌యులు అయితే వాటికవే సొంతంగా రుణభారాన్ని తగ్గించు కోవాలి. చెల్లింపులు అవే సొంతంగా చేయాలి. ప్రభుత్వంపై భారం పెంచకూడదని నిపుణులు సలహా ఇస్తున్నారు. అలాగే జీఎస్టీలో ఉన్న లొసుగులను కూడా కట్టడిచేస్తే పన్ను రాబడులు కొంతమేర పెరుగుతుంది.

# చేనేత రంగానికి రూ.371 కోట్లు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం చేనేత అభయ హస్తం పథకాన్ని అమలు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ శాసనసభలో ప్రవేశా ఎట్టారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ చేనేత రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అభయ హస్తం పథకం ద్వారా తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి), తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న భీమా), తెలంగాణ నేతన్నకు భరోసాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 2018 నుండి 2022 వరకు మరమగ్గ కార్మికులకు బకాయి పడ్డ 10 శాతం నూలు సబ్సిడీ కింద రూ.37.49 కోట్లు విడుదల చేశామని, చేనేత కార్మికుల కోసం రాజన్న సిరిసిల్ల, వేములవాడలో రూ.50 కోట్ల రూపాయల కార్పస్ ఫండ్‌తో నూలు డిపోను ఏర్పాటు చేశామన్నారు. ర్ష్టంలో స్వయం సహాయక సంఘాల్లో ఉన్న 64.7 లక్షల మంది సభ్యులకు



యేటా రెండు నాణ్యమైన చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. ఆ చీరలను తయారు చేసే బాధ్యత మన నేతన్నలకే అప్పగించాలని నిర్ణ యించాం. చేనేత రంగానికి ఈ బడ్జెట్‌లో రూ.371 కోట్లు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు.




# తెలంగాణలో స్థిరమైన ఆర్థిక వృద్ధి

## మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు

### గంట 40 నిమిషాలపాటు చదివిన మంత్రి

### రూ.3,04,965 కోట్లతో బడ్జెట్

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. శాసన మండలిలో ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపట్టారు. బుధవారం ఉదయం 11 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కాగానే బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. దీంతో ఆర్థిక శాఖ మంత్రి తరపున మండలిలో మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్‌ను చదివి వినిపించారు. సుమారు గంట 40 నిమిషాల పాటు బడ్జెట్‌ను చదివి వినిపించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం వ్యయం రూ. 3,04,965 కోట్లని.. అందులో రెవిన్యూ వ్యయం రూ. 2,26,982 కోట్లు కాగా మూలధన వ్యయం రూ. 36,504 కోట్లుగా ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. బడ్జెట్ ప్రతిపాదనను సభ ఆమోదం కోసం ప్రవేశ పెడుతున్నట్టు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

---

**పన్నుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు తగ్గుతున్న వాటా**

**జిఎస్‌డిపిలో వ్యవసాయరంగం నుంచి తక్కువ వాటా**

**42.7శాతం శ్రామికరంగానికి వ్యవసాయంతోనే ఉపాధి**



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి సాధిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర ఉత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం పదహారు లక్షల పన్నెండు వేల ఐదు వందల డెబ్బై తొమ్మిది కోట్లు ఉంది. గత సంవత్సరం కంటే 10.1శాతం వృద్ధిశాతం నమోదైంది. దేశ స్థూల ఉత్పత్తిలో 9.9శాతం వృద్ధి శాతం ఉంది. ప్రస్తుత ధరల ప్రకారం దేశ జిడిపి మూడుకోట్ల ముప్పై ఒక్క లక్షల మూడువేల రెండువందల పదిహేను కోట్లు ఉంది. తెలంగాణీయుల తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయంతో పోల్చితే 1,74,172కోట్లు అంటే 1.8రెట్లు అధికంగా ఉంది. తెలంగాణీయుల తలసరి ఆదాయం 3,79,751 వుంది. తలసరి ఆదాయంలో 9.6శాతం వృద్ధిరేటు ఉంది. దేశ తలసరి ఆదాయం 2,05,579 ఉంది. దేశం మొత్తం తలసరి ఆదాయం వృద్ధిరేటు 8.8 శాతం ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరం తెలంగాణ ఆర్థిక పుష్టికి సేవారంగంలో 66.3శాతం, పారిశ్రామిక రంగం 16.7శాతం, వ్యవసాయం దాని అనుబంధరగాలు 17.3శాతం స్థూల రాష్ట్ర విలువ అందించింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాలు జిఎస్‌డిపిలో తక్కువ వాటా కలిగినా రాష్ట్రంలోని మొత్తం శ్రామికరంగంలో 42.7శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నది. రాష్ట్ర పరిశ్రమలు 22.5శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. చైనాప్లస్‌వన్ వ్యూహం ద్వారా తెలంగాణను ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, విద్యుత్ వాహనాలు పునరుత్పాదక శక్తి రంగాలలో గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. రాష్ట్రంలో సేవా రంగం అత్యధికంగా 34.8శాతం మందిక ఉపాధి కల్పిస్తున్నది. ఐటి, సాఫ్ట్‌వేర్‌సేవలు, పిన్‌టెక్,లాజిస్టిక్స్ పర్యాటక రంగాలు ఉపాధికి దోహదపడుతున్నాయి. తెలంగాణలో శామ్రికశక్తి 68.7శాతం ఉండగా దేశీయ సగటు 64.3శాతం ఉంది. మహిళల ఉపాధి 52.7శాతం ఉండగా ఇది దేశీయ సగటులో 45.2శాతం ఉంది. వెనుకబడిన వర్గాలు అత్యధికంగా ఉపాధి పొందుతున్నారు. దేశంలోనే దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా బలంగా ఉన్నాయి. అందులో పదేళ్ళ క్రితం ఏర్పాటైన తెలంగాణ శీఘ్రగతిన అభివృద్ధిచెందుతోంది. కేంద్రం మాత్రం దక్షిణాధి రాష్ట్రలకు పన్నుల పంపిణీలో వాటా తగ్గిస్తుండటంతో ఆయా రాష్ట్రాల అభివృద్ధికి అడ్డంకిగా మారింది. ఆర్థిక సంఘం న్యాయమైన వాటాను జిఎస్‌డిపికి వెయిటేజ్ ఇవ్వడం ద్వారా పంపిణీ చేయాలని తెలంగాణ పట్టుబడుతోంది. తెలంగాణ ప్రభుత్వం సమాంతర పన్నుల పంపిణీ సూత్రంలో సంస్కరణలు తీసుకొని రావాలని సూచిస్తున్నది. తలసరి ఆదాయం దూరం అనే ప్రాతిపదిక తగ్గించి జిఎస్‌డికి 50శాతం వెయిటేజీ ఇవ్వాలని కోరుతోంది. తెలంగాణకు 14ఆర్థిక సంఘం ద్వారా 2.437 శాతం నిధులు పంపిణీ జరిగితే 15వ ఆర్థికసంఘం కాలంలో దాని విలువ 2.102కు తగ్గింది. అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు తక్కువ నిధులు ఇవ్వడంతో తెలంగాణకు నిధులు అతితక్కువగా వస్తున్నాయి. కేంద్రం జనాభా ప్రాతిపదికన కొన్నింటికి నిధులు కేటాయిస్తుంది. దీనితో తెలంగాణలో కుటుంబ నియంత్రణ పాటించి అభివృద్ధిచెండంతో అత్యంత వెనుకబడిన ఉత్తరాధి రాష్ట్రాలకు నిధులు ఎక్కువగాకేటాయిస్తున్నారు. దీనితో దేశ ఆర్థిక వృద్ధికి దోహద పడుతున్న తెలంగాణకు తలసరి ఆదాయం వృద్ధి కారణంగా, అత్యల్పజనాభాకారణంగా రెండు విధాలుగా ఆదాయం కోల్పోవాల్సి వస్తున్నది. దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలను ప్రోత్సహించేల ఆ పన్నుల పంపిణీ విధానం మరింత హేతుబద్ధతతో మార్చాలని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రాలకు 41శాతం వాటా ఇస్తున్నదాన్ని 50శాతంకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

---

## పరిశ్రమల శాఖకు రూ.3,527 కోట్లు

### వచ్చే ఐదేళ్లకు ఎంఎస్ఎంఇకు రూ.4,000 కోట్లు



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ శాఖకు రూ.3527కోట్లు కేటాయింపులు చేస్తున్నామని, అదేవిధంగా వచ్చే ఐదు సంవత్సరాలలో ఎంఎస్ఎంఇలకు రూ.4000 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ఉపముఖ్య మంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ శాసనసభలో ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను పరిష్కరించే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పాలసీ 2024ను తెలంగాణ ప్రభుత్వం తీసుకొని వచ్చింది. రాబోయే ఐదేళ్లలో ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం రూ.4000కోట్లు కేటాయింపలు చేస్తున్నట్లు ఈ మొత్తంతో 25,000కు పైచిలుకు కొత్త ఎంఎస్ఎంఈ పరిశ్రమలను స్థాపించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ పాలసీతో స్వయం సహాయక బృందాలు, ఎంఎస్ఎఈలుగా మారేందుకు అన్ని దశల్లో సహాయం అందిస్తామని తెలిపారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలపై మాట్లాడుతూ నూతన పారిశ్రామిక పార్కుల్లో 5 శాతం ప్లాట్లు మహిళా పారిశ్రామికవేత్తలకు, 15 శాతం ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కేటాయించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల పారిశ్రామికవేత్తలకు 50 లక్షల రూపాయల పరిమితికిలోబడి 50 శాతం వరకు భూమి ధరలో రాయితీని ఇస్తుంది. అదనంగా, ప్రైవేట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ తగ్గింపులు, విద్యుత్ వినియోగ చార్జీలు, భూమి ధర రాయితీలను అందిస్తుంది. ఆర్థిక సవాళ్లను పర్కిరించడానికి, పాలసీలో మూలధన పెట్టుబడి రాయితీ పథకాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

**మెగా మాస్టర్ ప్లాన్-2050**

మెగా మాస్టర్ ప్లాన్- 2050 నాటికి తెలంగాణ అంతటా పారిశ్రామిక వృద్ధి జరగాలనే లక్ష్యంతో మెగా మాస్టర్ ప్లాన్-2050 పాలసీని ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. హైదరాబాద్ ఒక్క చోటే పారిశ్రామిక ప్రగతి కేంద్రీకృతం కాకుండా, పారిశ్రామిక వికేంద్రీకరణ జరిపి తెలంగాణలోని అన్ని ప్రాంతాలు, హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలన్నది ఈ పాలసీ ప్రధాన లక్ష్యం అన్నారు. ర్ష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోను ఐటి, ఫార్మా, హెల్త్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, స్పోర్ట్స్, ఆటోమొబెల్, గార్మెంట్స్, మెటల్ వేర్, చేనేత, ఆభరణాల తయారీ మొదలైన క్లస్టర్లను ఏర్పాటు చేసి, పరిశ్రమలను అభివృద్ధి పరచడానికి కావలసిన అన్ని చర్యలు చేపడతున్నామని, అంతేకాకుండా, హైదరాబాద్, వరంగల్ పారిశ్రామిక కారిడార్‌ను ఎన్‌హెచ్ 163కి ఇరువైపుల ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఔషధాల తయారీ కంపెనీలకు, బయోటెక్, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించి గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం తోడ్పడుతుంది. యాంటీ బయాటిక్స్, సింథటిక్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, కాస్మోటిక్స్ సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

**పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ**

తెలంగాణ ర్ష్ట్రం ఇప్పటికే పెట్టుబడులకు గొప్ప ఆకర్షణ కేంద్రంగా మారిందన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆధ్వర్యంలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని పారిశ్రామికవేత్తలను కలిసి వారిని మన ర్ష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించడం జరిగిందన్నారు. టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, డిఫెన్స్, డాటా ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి కీలక రంగాలలో ఉన్న 16 ప్రపంచ అగ్రగామి కంపెనీలతో సుమారు రూ.1.78లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందాలను ర్ష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుందన్నారు. గత ఏడాదితో పోల్చితే, ఈ ఏడాది పెట్టుబడుల విలువ నాలుగు రెట్లు ఎక్కువ. అమెరికా, సౌత్ కొరియా, సింగపూర్ దేశాల పర్యటనలో ముఖ్యమంత్రి మరో 14,900 కోట్ల రూపాయలు పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు.

---



## ఐటి శాఖకు రూ.774 కోట్లు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో ఇన్ఫర్మేన్ టెక్నాలజి శాఖకు బడ్జెట్‌లో రూ.774 కోట్ల రూపాయలను ఆర్థిక శాఖ మంత్రి ప్రతిపాదించారు. ర్ష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. యుఎస్ఏ, యుకె నెదర్లాండ్స్, మలేయాతో పాటు దాదాపు 100 దేశాల కంపెనీ యజమానులు, ఏఐ నిపుణులు, స్టార్టప్‌లు, విద్యార్థులతో సహా 10,000 మంది ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారన్నారు. ఎన్‌విఐడిఐఏ, మైకోసాఫ్ట్, అమెజాన్ వెబ్ సర్వీస్, సిడిఏసి వంటి కీలకమైన ఏఐ కంపెనీలతోనూ, ఇతర స్టార్టప్‌లతోనూ ప్రభుత్వం 20 అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుందని తెలిపారు. తెలంగాణని ఏఐ టెక్నాలజీలో అగ్రభాగాన నిలిపేందుకు ఏఐ స్టాటజిక్ రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించినట్లు, ఏఐ ఆధారిత అంకురాలను ప్రోత్సహించడం, ప్రభుత్వ ఉద్యోగుల, యువత యొక్క ఏఐ నైపుణ్యతను పెంపొందించడం, పరిపాలనలో ఏఐ వినియోగించుకోవడం ఈ రోడ్ మ్యాప్ యొక్క ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో అంతర్భాగంగా 200 ఎకరాలలో ప్రత్యేకంగా ఏఐ సిటిని నిర్మిస్తామని తెలిపారు.

---

## ఇది ప్రజారంజక బడ్జెట్

### బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా రంజక బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్ అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పించిందన్నారు. తమ ప్రభుత్వంలో విద్యా, వైద్యం, పరిశ్రమల ప్రోత్సాహానికి, మహిళా ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పేట వేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలను పెంచడానికి ఇటీవల ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. బీసీ సంక్షేమం, ఆర్టీసీకి అధిక నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సన్న వడ్లకు బోనస్‌కి నిధులు కేటాయించి తమది రైతు ప్రభుత్వంగా మరోసారి నిరూపించుకుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా నిధులు కేటాయింపు జరిగిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించడానికి ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి భారీగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అధునాతన సాంకేతిక శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్యాలను పెంపొందించడం.. 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ లను ఏర్పాటు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధి కోసం రాష్ట్రంలో మొదటిసారిగా ఇందిరా గిరి జల వికాసం పేరుతో ప్రత్యేక పథకం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించడం వల్ల పారిశ్రామికంగం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొదటిసారి నూతన టూరిజం పాలసి అమలులోకి తేవడం వల్ల రాష్ట్రంలో మరింత పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. సినిమా రంగాల వారికి గద్దర్ అవార్డులు ప్రకటించడం గద్దర్ అన్ననీ గౌరవించుకోవడమేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 ప్రాంతాల్లో ఏకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌పై ప్రత్యేక ఫోకస్ చేసి మౌలిక సదుపాయాల అభివృద్ధి.. హోంగార్డులకు రోజు వేతనాలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మిత్ర యాప్ ద్వారా డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడం అభినందనీయమన్నారు.

---

## బిసి సంక్షేమానికి రూ. 11,405 కోట్లు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బిసి సంక్షేమానికి రూ. 11,405 కోట్లను కేటాయించింది. రాబోయే రోజుల్లో బిసిలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లును ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో స్వల్పంగా నిధులను పెంచింది. అయితే ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో 90 శాతం వరకు విద్యార్థులకిచ్చే ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకే ఖర్చు కానుంది. బిసి సంక్షేమానికి కేటాయించిన నిధులోలన గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ. 2205 కోట్లను కేటాయించింది. గత ఏడాది 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 9200 కోట్లను బిసి సంక్షేమానికి కేటాయించగా.. 2025-26 లో దానిని కాస్త రూ. 11,405 కోట్లకు పెంచింది. చేనేత కార్మికుల కోసం రాజన్న సిరిసిల్ల, వేములవాడల్లో రూ. 50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు డిపోను ఏర్పాటు చేయనున్నారు.

---

## పంచాయతీరాజ్‌కు రూ. 31,605 కోట్లు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కు కేటాయించిన మొత్తం రూ.31,605 కోట్లు ముఖ్యమైన కేటాయింపులు కాగా వీటిలో చేయూత పెన్షన్లు రూ.14,861 కోట్లు మిషన్ భగీరథ బకాయిల చెల్లింపుల కోసం రూ.6000 కోట్లు, స్టేట్ ఫైనాన్స్ కమీషన్ గ్రాంట్స్ రూ. 2062 కోట్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం రూ. 600 కోట్లు, మహిళా సంఘాలకు వడ్డీలకు రూ.1511 కోట్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణం, నిర్వహణ రూ.1220 కోట్లు, హామ్ విధానంలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి కేటా యించగా రూ. 275 కోట్లతో 51216 పిల్ల కాలువల, ఇతర కాలువల పూడిక తీతలకు కేటాయించారు.

---

## పరిపాలన వ్యయం రూ. 11,544కోట్లు.. మౌలిక వసతులకు రూ.11,829 కోట్లు

**హైదరాబాద్, మార్చి 19,ప్రభాతవార్త:** నీటిపారుదల శాఖకు బడ్జెట్‌లో రూ. 23,373 కోట్లు ప్రతిపాదించారు. అందులో పరిపాలన వ్యయాలు రూ.11544కోట్లు, స్కీమ్స్‌కు 11829 కోట్లు కేటాయింపులు చేశారు. ఏడులక్షల ఎకరాల ఆయకట్టు కొత్తగా సృష్టించాలనే లక్ష్యం చేదించడాని ప్రస్తుతం ప్రతిపాదించిన నిధులు అరకొరగానే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యం చేరుకోవడానికి కనీసం స్కీమ్స్‌కోసం 19వేల కోట్లు ప్రతిపాదిస్తే కాస్తాపనులు వేగంగా జరిగేవని నీటిపారుదల నిపుణులు భావిస్తున్నారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసేందకు ప్రాధాన్యత క్రమంలో ఎబి కేటగిరిగా విభజించారు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సేద్యంలోకి తీసుకొని రావాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం నెరవేడం కష్టంగానే ఉంది. మరోవైపు కృష్ణానదిలో నీరు దారిమళ్ళకుండా అవసరమైతే టెలిమెట్రిక్ వ్యవస్థ ఏర్పాటుకు అయ్యే ఖర్చును కూడా భరించేందుకు తెలంగాణ సిద్దంగా ఉంది. పోరాడి సాధించుకున్న తెలంగాణలో కృష్ణా,గోదావరి నీటికేటాయింపులు న్యాయమైన వాటా పొందడంతోపాటు వాటిని ప్రాజెక్టులు కట్టిసద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యం ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులు ఎంతమేరకు దోహదం చేస్తుందో వేచి చూడాల్సి ఉంటుంది. జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కెపి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం సత్వరం చేపడుతోంది. మూసీ ప్రాజెక్టు పరిధిలోని బునాదిగాని కాలువ ప్రాజెక్టు పునరుద్దరణకు 266.65కోట్లు పాలనపరమైన అనుమతి ఇచ్చారు. ఉదయసముద్రం నుంచి 6.7టిఎంసిల నీటిని బ్రాహ్మణ వెలమల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు లిఫ్టేచేయబడుతోంది ఈ ప్రాజెక్టు వ్లల 94 గ్రామాలలో లక్షల ఎరాకలకు సాగునీరు,107 గ్రామాలకు ఫ్లోరైడ్ నీటికి బదులు తాగు అందుతుంది.


---

## బడ్జెట్‌లో విద్యుత్‌కు ప్రాధాన్యత

**రూ.21,221 కోట్లు.. 2024-25 కంటే రెట్టింపు**

**పెరుగుతున్న సబ్సిడీల భారం**

**సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రోత్సాహం**




**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్‌కు సర్కార్ అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. వివిధ వర్గాలకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీల భారం పెరుగుతుండగా, మరోవైపు కరెంటు చార్జీలు పెంచకుండా, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేసేందుకు కొత్త ప్రాజెక్టులు, సంప్రదాయేతర ఇంధన వనులకు ప్రోత్సాహం కల్పిస్తూ అందుకు అనుగుణంగా 2025-26 వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఇందుకు గాను 2024-25 అంచనా బడ్జెట్ రూ.16,410 కోట్ల కంటే ఈ సారి దాదాపు రెట్టింపు కేటాయింపులు పెంచింది. ఈ నేపథ్యంలో వచ్చే బడ్జెట్‌లో విద్యుత్ శాఖకు రూ. 21,221 కోట్లను కేటాయించింది. అంతే కాకుండా గత ఏడాది నుండి అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ నిమిత్తం ఈ బడ్జెట్‌లో రూ.2,418 కోట్లను కేటాయింపు జరిపింది. దీంతో పాటు, కొన్ని వృత్తులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కూడా ఇస్తోంది. కొరత లేకుండా విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యంగా బడ్జెట్‌లో పేర్కొంది. ఇదే సమయంలో సంప్రదాయ ఇంధన వనరులను ఒక మార్గంగా ఉపయోగిస్తూనే, వాటి వాడకంపై దృష్టి పెట్టడం మరియు విద్యుత్తు ఉత్పత్తి సాధనంగా విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఇప్పటికే విద్యుత్ డిమాండ్ 16918 మెగావాట్లకు చేరుకుంది. భవిష్యత్‌లో ఇది మరింత పెరుగుతుందని అంచనా వేసింది. పునరుత్పాదక ఇంధన ఆవశ్యకతకు సంబంధించి, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ -2025ను ఇప్పటికే ప్రచురించింది. ఈ విధానం ప్రకారం, 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 2000 మెగావాట్లు మరియు 2035 నాటికి 40000 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రిడ్ అవసరాలను తీర్చడానికి, 250 మెగావాట్ల బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే రైతులకు అందించే ఉచిత విద్యుత్ కోసం ఈ బడ్జెట్‌లో సబ్సిడీగా రూ.11,500 కోట్లు కేటాయించింది. అదనంగా, గృహ జ్యోతి పథకం కింద రాష్ట్రంలోని 50 లక్షల కుటుంబాలు, 30,000 ప్రభుత్వ యాజమాన్యంలోని గ్రామాలకు 20051 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించబడుతోంది. ఈ పథకాల కోసం ఈ బడ్జెట్‌లో రూ.3,000 కోట్లు కేటాయించారు. అలాగే యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు 2025 నాటికి ఐదు యూనిట్లను ప్రారంభించడానికి మేము అవసరమైన చర్యలు తీసుకుంటోంది. అంతేకాకుండా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలను అందించడానికి, ప్రభుత్వం రాష్ట్రంలో ఉచిత అంబులెన్స్ సేవను ప్రారంభించింది. ఏదైనా కారణం చేత అంబులెన్స్ పనిచేయకపోతే మొదటిసారిగా 1912 అంకెల నంబర్‌ను నమోదు చేస్తారు. హైదరాబాద్‌లో 57 సబ్ డివిజన్లకు ఒక వాహనాన్ని కేటాయించారు. తరువాత, ఈ సౌకర్యం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించబడుతుంది. ఇక వచ్చే 2025-26 ఆర్థిక సంత్సరానికి తెలంగాణలో కరెంట్ చార్జీలను ప్రత్యక్షంగా పెంచకుండా ఉండాలని రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలకు ప్రభుత్వం స్పష్టం చేసింది.పంపిణీ సంస్థల ఆదాయ, ఖర్చుల మధ్య ఈ ఏడాది రూ.20 వేల కోట్లకు పైగా లోటు ఉండనుందని అంచనా వేస్తున్నాయి. ఇక రాష్ట్రంలో 28 లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసినందుకుగాను రూ.8,729 కోట్లను డిస్కములకు చెల్లిస్తోంది. గృహ జ్యోతి పథకానికి ప్రతినెల రూ.148.5 కోట్లు చొప్పున ఇటీవల కాలం వరకు విద్యుత్ శాఖకు రూ.1,485 కోట్లను చెల్లించింది. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖకు గతం కంటే రెట్టింపు కేటాయింపులు జరిపింది.

---

## పర్యాటకానికి రూ.775 కోట్లు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తోన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. పర్యాటక రంగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించి.. పెట్టుబడులను రాబట్టటమే లక్ష్యంగా కొత్త టూరిజం పాలసీని తీసుకొచ్చింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. పర్యాటక రంగానికి మరిన్ని మెరుగులు దిద్దిన సర్కారు.. డిసెంబర్‌లోనే కొత్త పాలసీని రెడీ చేసింది. ఇందులో భాగంగా పర్యాటక రంగానికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ .775 కోట్లను కేటాయించింది.పర్యాటక రంగం ద్వారా సుమారు రూ.15 వేల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించాలని రేవంత్ సర్కార్ లక్ష్యంగా పెట్టింది. అంతేకాకుండా.. దాదాపు 3 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని యోచిస్తోంది. పర్యాటకుల్ని ఆకర్షించడంలో దేశంలో తొలి 5 స్థానాల్లో తెలంగాణను నిలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. పర్యాటక రంగం నుంచి రాష్ట్ర ఆదాయంలో 10 శాతానికి మించిన ఇన్‌కం రాబట్టాలని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను ఖరారు చేసింది. వచ్చే పదేళ్ల పాటు ఇదే పాలసీని అమలు చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పర్యాటక ప్రాజెక్టులను ప్రారంభించే వారికి పలు రాయితీలతో పాటు, ప్రభుత్వ భూములు కూడా లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు.. పర్యాటక ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టే వారికి ఇచ్చే ప్రోత్సాహకాలు, రాయితీలు ఐదేళ్ల వరకు అమల్లో ఉంటాయని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలిపింది. రాయితీ పొందే కొత్త టూరిజం ప్రాజెక్టుల్లో అడ్వెంచర్ టూరిజం,



కారవాన్ పార్క్ ప్రాజెక్టులు, పర్యాటక కారవాన్లు, హౌస్ బోట్లు, తదితరమైన అంశాలున్నాయి. మరోవైపు.. రాష్ట్రంలో 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. ఇందులో తొమ్మిదింటినీ యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను కూడా రూపొందించింది. వికారాబాద్, సోమశిల, కాళేశ్వరం, నాగార్జున సాగర్, భద్రాచలం, వరంగల్, ట్రైబల్ సర్క్యూట్ల ఇందులో జోడేఘాట్, ఉట్నూరు, ఉషేగావ్, కేస్లాగూడ, వన్యప్రాణుల అభయారణ్యం, జలపాతాలు, ఎకో టూరిజం, చార్మినార్‌లో లాడ్‌బజార్, మక్కామసీదు, చూమోహల్లా ప్యాలెస్, సాలార్జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం ప్రత్యేక పర్యాటక ప్రాంతాలుగా ఇప్పటికే గుర్తింపు పొందాయి.

అయితే.. పర్యాటక పాలసీ కోసం తెలంగాణ టూరిజం ఓ పోర్టల్‌ను రూపొందించనుంది. ఈ పోర్టల్‌లో తెలంగాణ చరిత్రకు సంబంధించిన అంశాలతో పాటుగా, పర్యాటక రంగంలో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు డిజిటల్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

# పురపాలక శాఖకు రూ.17,677 కోట్లు



హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.17,677 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు, తర్వాతి స్థాయి నగరాలైన వరంగల్, నిజా మాబాద్, ఖమ్మంలను కూడా అభివృద్ధి పరుస్తున్నామని, వరంగల్‌ను విద్య, వైద్య, ఐటి కేంద్రంగాను, నిజామాబాద్, ఖమ్మంలను వ్యవసాయాధారిత పరిశ్రమలకు, తయారీ రంగానికి కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని అన్నారు. హైదరాబాద్ నగరం శరవేగంతో అభివృద్ధి చెందుతున్నందున, తదనుగుణంగా ప్రధాన మౌలిక సదుపాయాలతో పాటు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు హెచ్ సిటీ ప్రణాళిక అమలుచేస్తున్నాం. ఈ ప్రాజెక్టులో భాగంగా, (31) ఫ్లైఓవర్లు, (17) అండర్ పాసెస్‌లు, (10) రోడ్డు విస్తరణ పనులకు రూ.7032కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నట్లు, 150 కోట్ల రూపాయలతో సుందరీకరణ పనులను కూడా చేపట్టనున్నాం. జలమండలి ద్వారా 2024లో పలు విప్లవాత్మక ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలకు మొత్తం 20 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన4 మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టాం. మూసీ ప్రక్షాళనలో భాగంగా, గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ కింద గోదావరి జలాలతో ఉస్మాన్‌సాగర్, హిమయత్ సాగర్ జలాశయాలను నింపి, వాటిని పునరుజ్జీవింప చేయడానికి అవసరమైన పనులను చేపడుతున్నామన్నారు.

ఓఆర్ఆర్-2 నీటి సరఫరా ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంది. దీని ద్వారా హెచ్‌ఎండిఏ పరిధిలో విస్తరించిన పట్టణ ప్రాంతాలకు తాగునీరు అందించబడుతుంది. పట్టణాలలో వరద సమస్యలను ఎదుర్కొనడానికి ప్రభుత్వం సమగ్ర నీటిపారుదల వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. హైదరాబాద్‌లో వరద నీటిని నివారించేందుకు 5,942 కోట్ల రూపాయల వ్యయంతో సమగ్ర వరద నీరు పారుదల ప్రాజెక్ట్ ను మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి సంస్థలలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం రూ.4,500 కోట్ల రూపాయలతో ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ మొత్తాన్ని వచ్చే మూడేళ్లలో ఖర్చు చేసి, వాటికి కావలసిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు

**ఫ్యూచర్ సిటీ కోసం..**

రాష్ట్రానికే కాదు, దేశానికే తలమానికంగా ఉండే మొట్టమొదటి నెట్‌జీరో ఫ్యూచర్ సిటీని రూపొందించే దశలో ప్రభుత్వం ఉంది. ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలతో పోటీపడేలా, కాలుష్యరహితంగా, అత్యంత ఆధునికంగా, సకల సదుపాయాల కల్పనతో ఇది రూపొందుతుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారుల మధ్య 56 గ్రామాల్లో, 765 చ.కి.మీ విస్తీర్ణంలో ఈ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఈ మెగా అర్బన్ ప్రాజెక్టును పర్యవేక్షించడానికి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశాం. ఈ సిటీలో మల్టీమోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్, గ్రీన్ బిల్డింగ్స్ లాంటి ఆధునిక సౌకర్యాలు ఉంటాయి. ఏఐ సిటీ, ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ జోన్ లాంటివి ఫ్యూచర్ సిటీలో భాగంగా ఉంటాయని అన్నారు.

**స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్, ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) కోసం..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 19 ప్రాజెక్టులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయడానికి స్పీడ్ (స్మార్ట్, ప్రోయాక్టివ్, ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) పేరుతో వేగవంతమైన, సకాల కార్యాచరణకు శ్రీకారం చుట్టిందన్నారు. నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. వీటిలో, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం, నూతన ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణం, మాదకద్రవ్యాల నిరోధక వ్యూహాల అమలు, మొదలగు ప్రాజెక్టులు ఉన్నాయన్నారు.




## దేవాదాయ, ధర్మాదాయ శాఖకు రూ.190 కోట్లు

హైదరాబాద్, మార్చి 19ప్రభాతవార్త: దేవాదాయశాఖకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.190 కోట్లు కేటాయించింది. ఇప్పటికే యాదాద్రిని యాదగిరి గుట్టగా మార్చిన ప్రభుత్వం యాదగిరి గుట్ట దేవాలయ విమాన గోపురానికి 65 కిలోల బంగారంతో తాపడం పనులు పూర్తి చేసి సంప్రోక్షణ మహోత్సవం నిర్వహించింది. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా యాదగిరి గుట్ట బోర్డును ఏర్పాటు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా అమ్మాపురంలోని కురుమూర్తి దేవాలయం అభివృద్ధిపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించి రూ 110 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆధ్వర్యంలో గోదావరి నది హారతి కారక్రమాన్ని ప్రారంభించింది. దక్షణ కాశీగా గుర్తింపు పొందిన వేముల వాడ అభివృద్ధికి ఇప్పటికే రూ.100 కోట్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పనులను వేగవతం చేస్తామని పేర్కొంది.

## ఇందిరమ్మ ఇళ్లకు రూ. 22,500 కోట్లు

హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ..22,500 కేటాయించింది. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి గత సంవత్సరం మార్చి నెలలో ప్రారంభించింది. వీటిని సంబంధించిన పట్టాలను ఆడబిడ్డల పేరుతో ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. 22,500 కోటల రూపాయల అంచనా వేయంతో ప్రతి నియోజకవర్గానికి కనీసం 3,500 చొప్పున మొత్తం నాలుగు లక్షల యాభైవేల (4,50,000) ఇండ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. హైదరాబాద్ నగరంలో నలువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలకు అందుబాలో ఉండేలా గృహ సముదాయాలు నిర్మిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది.

## రవాణా రంగానికి రూ. 4,485 కోట్లు

హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రవాణా రంగానికి రూ. 4,485 కోట్లను కేటాయించింది. బుధవారం ప్రవేశ పెట్టిన రూ. 3.04 లక్షల కోట్ల బడ్జెట్ లో రవాణా రంగానికి రూ. 4485 కోట్లను కేటాయిస్తున్నట్టున ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖకు కేటాయించిన నిధులు కాకుండా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకానికి రూ.4305 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. అయితే రవాణా శాఖకు కేటాయించిన నిధుల్లోనే వీటిని కూడా జమ చేసి చెప్పారా? లేకపోతే ఆ నిధులకు అదనంగా మహాలక్ష్మీ పథకానికి నిధులను కేటాయించారా? అనేది స్పష్టత లేదు.

## విద్యాశాఖకు సరిపడా నిధులను కేటాయించలేదు

**మండిపడుతున్న ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు**

హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: విద్యా శాఖకు గత ఏడాది కంటే 0.20 శాతం కేటాయింపులు తగ్గాయని టిఎస్ యుటిఎస్ విమర్శించింది. బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు తీవ్ర నిరాశకు గురిచేశాయని సంఘం నాయకులు విమర్శించారు. సాంకేతిక విద్య ఉన్నత విద్యారంగాలను బలోపేతం చేస్తామంటూ మొత్తం విద్యారంగానికి కలిపి కేవలం 7.57 కేటాయించడం శోచనీయమన్నారు.

# బడ్జెట్‌లో పన్ను రాబడులపైనే ఎక్కువ ఫోకస్!

## రూ.1.45 లక్షలకోట్లు పన్ను రాబడులు

## కేంద్ర వాటాగా 30వేల కోట్లు అంచనా!



హైదరాబాద్, మార్చి 19: కొత్త ఆర్థికసంవత్సరానికి గాను రాష్ట్ర ఆర్థికమంత్రి, డిప్యూటి ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 3.05 లక్షలకోట్లతో కూడిన బడ్జెట్‌ను శాసనసభ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో రెవెన్యూ రాబడుల పరంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా 29,899.77 కోట్ల రూపాయలు అందుతుందని అంచనావేసారు. ఇక పన్నులరూపంలో రాబడులు 1,45,419.58 కోట్లుగా పద్దుచూపిస్తే పన్నేతర ఆదాయంగా 31,618.77 కోట్లవరకూ సమకూరగలదని అంచనావేసారు. ఇవికాకుండ ఆగ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌రూపంలో కొత్తసంవత్స రానికి 22,782.50 కోట్లు రాగలవని అంచనా వేసారు. ఇక ఓపెన్ మార్కెట్ రుణాలపరంగా 64,539 కోట్లు సమీకరించే లక్ష్యం ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలపరంగా నాలుగువేల కోట్లవరకూ అందుతాయని అంచనా. ఇతరత్రా సమకూరే రుణాలు 1000 కోట్లవరకూ ఉంటుందని బడ్జెట్‌లో పొందుపరిచారు. డిపాజిట్లు ఇతర లావాదేవీల రూపంలో 4వేల కోట్లు, రుణాలు అడ్వాన్సుల పరంగా 1106.92 కోట్లు అందుతుందని అంచనా వేసారు. వీటన్నింటి నుంచి మొత్తం రాబడుల రూపంలో 3,04, 365.55 కోట్లవరకూ రావచ్చని బడ్జెట్‌లో అంచనా వేసారు. ఇక వ్యయం రూపంలో పరిగణనలోనికి తీసుకుంటూ రెవెన్యూ వ్యయం 2,26,982.29 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ మొత్తంలో వడ్డీచెల్లింపులు 19,369.02 కోట్లు చెల్లింపులు ఉంటుంది. ఇక మూలధన వ్యయం 36,504.45 కోట్లు, రుణాలు, ఇతర అడ్వానులపై చెల్లింపులు 21,350.55 కోట్లుగా ఉంటుందని వెల్లడించింది. ఇక మూలధన పంపిణీపరంగా 20,027.71 కోట్లవరకూ ఉండవచ్చని అంచనావేసింది. రుణాల చెల్లింపులు పరంగా కూడా 15,848.20 కోట్లు వరకూ ఉంటుంది. ఇతరత్రా వివిధరూపాల్లో తీసుకున్న రుణాలుకూడా 3738 .66కోట్లవరకూ చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. మొత్తంగా వ్యయం చూస్తే 2025-26 ఆర్థిక సంవత్స రానికిగాను 3,04,965 కోట్లరూపాయలని బడ్జెట్‌లో ఆర్థికశాఖ వివరాలను వెల్లడించింది. ఆర్థికలోటు 54,009.74 కోట్లు కాగా ప్రాథమిక లోటు కొత్త ఆర్థికసంవత్సరంలో 34,640.72 కోట్లుగా ఉంటుందని బడ్జెట్ లో పొందుపరిచారు.

# హోం శాఖకు బడ్జెట్‌లో రూ.10,188 కోట్లు



హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో 2025...2026కు సంబంధించి హోం శాఖకు 10,188 కోట్ల రూపాయల కేటాయింపులు జరిపారు. ఇందులో జీతభత్యాల కోసం 9337 కోట్ల రూపాయలు కాగా అభివృద్ధి పనుల కోసం 851 కోట్ల రూపాయలు వున్నాయి. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మం త్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ కేటాయింపులపై ప్రకటన చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సవ్యంగా వుండేందుకు పోలీసు శాఖను పటిష్టం చేయడంతో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్ద పీట వేస్తున్నట్లు ఆయన తెలిపారు. పోలీసు శాఖలో ఆయా విభాగాలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పోలీసుల పిల్లల కోసం మంచిరేవులలో పోలీసు గురు కుల పాఠశాల యంగ్ ఇండియా స్కూల్‌ను నెలకొల్పుతున్నట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ గురుకుల పాఠశాల ఏర్పాటవుతుందని ఆయన తెలిపారు. ఈ పాఠశాలలో పోలీసు పిల్లలతో పాటు విధి నిర్వహణలో చని పోయిన పోలీసుల పిల్లలకు, అగ్నిమాప క, ఎక్సైజ్, ఎస్‌పిఎఫ్, జైళ్ల శాఖలో పనిచేసే వారి పిల్లలకు కూడా ప్రవేశం కల్పిస్తామని మంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర పోలీసులకు ఇతోధి .కంగా సహాయం చేస్తున్న హోంగార్డుల గౌరవ వేతనం 921 రూపాయల నుంచి వెయ్యి రూపాయలకు పెంచామని, విధి నిర్వహణలో చనిపోయిన హోంగార్డుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ రహితంగా మార్చేందుకు యాంటి నార్కోటిక్ బ్యూరో సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రత్యేకంగా విభాగాలు పనిచేస్తున్నాయ ని ఆయన అన్నారు. ఇందుకోసం మిత్ర యాప్ రూపొం దించామని ఆయన తెలిపారు. జంట నగరా లు, శివార్లలోని వెయ్యి పాఠశాలలకు ఈ యాప్ ద్వారా సేవలందిస్తున్నామని ఆయన తెలిపారు. గత ఏడాది 148 కోట్ల రూపాయల మాదకద్రవ్యాలను పట్టు కోవడంతోపాటు దీనికి సంబంధించిన నేరగా ళ్లను అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

# ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే బడ్జెట్

## మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త : యావత్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిన రాష్ట్ర రెండో బడ్జెట్‌సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో 2025 26 ఆర్థిక సంవత్సరానికి బుధవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ తెలంగాణ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి తగిన మేరకు కేటాయింపులు చేయడం హర్షణీయని దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ సమ్మిళిత వృద్ధిని ప్రతిబింబిస్తుందని భావిస్తున్నా అన్నారు.ఒక వైపు అభివృద్ధి... మరోవైపు సంక్షేమాన్ని సమతుల్యత చేస్తూ... రాష్ట్ర బడ్జెట్ దిశానిర్దేశం చేసేలా ఉందన్నారు.రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా ఉందని. ఉపాధి కల్పనకు ఊతం ఇస్తూ... మహిళా సంక్షేమం, యువత, దళితులు, గిరిజనుల సంక్షేమానికి దిక్సూచీలా ఉందని ఆమె పేర్కొన్నారు.

## విద్య, వైద్య, వ్యవసాయం రంగాలకు నిధులను పెంచాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా, వైద్య, వ్యవసాయం, గృహనిర్మాణ రంగాలతోపాటు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి నిధుల కేటాయింపు పెంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సిపిఐఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నిధులను పెంచక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ఉద్య మాలు తప్పవని హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో రూ.3,04,855 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మ్యానిఫెస్టో అమలుకు, ప్రస్తుత ప్రతిపాదనలకు ఎలాంటి పొంతన లేదన్నారు.

# ఆరు గ్యారెంటీలకు గోవిందా..

## పేద ప్రజల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదు.. ఢిల్లీకి మూటలు పంపేది

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్, మార్చి 19, ప్రభాత వార్త: తెలంగాణలో ఎన్నికల్లో ఇచ్చి న హామీలను కాంగ్రెస్ ప్రభు త్వం విస్మరించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణలోని ఆడబిడ్డలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అలాగే, పీఆర్సీకి సంబంధించి ఎలాంటి ప్రకటనలేదని కామెంట్స్ చేశారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారంటీలు గోవిందా' అని అర్థమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ మర్చిపోయింది. ఏడాది దాటినా ఉద్యోగాల ఊసేలేదు. దమ్ముంటే రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు రావాలి. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లను తామే ఇచ్చినట్టు కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. కొంచెమైనా సిగ్గుగా అనిపించడం లేదా?. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ చెప్పారు. నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డు ఊసేలేదు. అబద్దాలతో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను వెన్నుపోటు పొడిచింది. రైతు కూలీలకు ఏ ఒక్కరికీ రూ.12వేలు రాలేదు. ఆదాయం రూ.70వేల కోట్లు పడిపోయిందని సీఎం చెప్పారు.

**పసలేని.. హామీల ఎగవేత బడ్జెట్ : బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

రాష్ట్రాన్ని దివాళా తీసేలా బడ్జెట్ ఉందని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇది పసలేని బడ్జెట్... హామీల ఎగవేత బడ్జెట్ అని పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లా డుతూ నిరుద్యోగులకు మొండి చేయి చూపేలా బడ్జెట్ ఉన్నద న్నారు. ప్రతి మహిళకు నెలవారీగా రూ.2,500 చొప్పున ఇస్తానని మొండిచేయి చూపారన్నారు. మహాలక్ష్మి పథకానికి నిధులు వెచ్చించలేదన్నారు. రైతు భరోసా, కౌలు రైతులకిచ్చే ఆర్థిక సాయానికి నిధులు కటాయించలేదన్నారు. ఇది రైతాంగాన్ని మోసం చేసే బడ్జెట్ అన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులివ్వకపోడం బాధాకరమన్నారు. బిసి డిక్లరేషన్ ప్రకారం నిధులు కేటాయించలేదని మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ ప్రకారం బిసిలకు రూ.16 వేల కోట్లు కేటాయించాలని తెలిపారు.



**అన్ని వర్గాలకు మోసం : బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్**

అన్ని వర్గాలను మోసం చేసే బడ్జెట్ అని బిజెపి ఎంఎల్ఎ పాయల్ శంకర్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క రోగి కూడా ఏ ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.10 లక్షల సాయం తీసుకొనే పరిస్థితి లేదన్నారు.

**ప్రజలను నిరుత్సాపరిచిన బడ్జెట్ : ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను నిరుత్సాహపరిచిన బడ్జెట్ అని ఎంఎల్ఏ ధన్‌పాల్ సూర్య నారాయణ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నిరుద్యోగుల కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్లకు ఒక రూపాయి కూడా కేటాయించలేదన్నారు.

**ఉగాది పచ్చడిలా మిశ్రమంగా బడ్జెట్ : సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని**

బడ్జెట్ పై కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది తెలంగాణ బడ్జెట్ ఉగాది పచ్చడిలా మిశ్రమంగా ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ. ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా బడ్జెట్ లేదని విమర్శించారు.

**ప్రజల ఆకాంక్షల బడ్జెట్ : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించారని ఎంఎల్ఎ బీర్ల అయిలయ్య అన్నారు. ఇది పేదలు, మహిళలు, దళిత, యువత, రైతులకు సంతృప్తికరమైన బడ్జెట్‌అని ఆయన పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు మరింత పునర్నిర్మాణానికి బడ్జెట్ ఉన్నదన్నారు.

**అభివృద్ధికి వాస్తవిక బడ్జెట్ : విప్ ఆదిశ్రీనివాస్**



అన్ని వర్గాల ప్రజల విషయంలో సమతుల్యత పాటిస్తూ అభివృద్ధిపథంలో తీసుకెళ్లే వాస్తవిక బడ్జెట్ అని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ధనిక రాష్ట్రాన్ని పదేళ్లలో రూ.7 లక్షల కోట్లు అప్పులపాలు చేశారన్నారు. బిఆర్ఎస్ కరోనా కంటే ప్రమాదకరమైందని విమర్శించారు. వారి పాలనలో ఫోన్ ట్యాపింగ్‌లు, బర్రెలు, గొర్రెలు, చేపల పంపిణీ పథకాల్లో భారీ అవినీతి జరిగిందన్నారు. అభివృద్ధి చేసి ఓర్వలేక దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.అలాగే ఎంఎల్ఏ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ తెలంగాణ సమజానికి సామాజికన్యాయం చేసే బడ్జెట్ అని తెలిపారు.

## స్పై కెమెరా విక్రయాలపై కేంద్రానికి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేం : హైకోర్టు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి19: స్పై కెమెరాల అమ్మకాలపై దాఖలైన ప్రజాప్రయోజన పిటీషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఆన్‌లైన్, షాపుల్లో సులభంగా స్పై కెమెరాల లభిస్తున్నాయి. ఇటీవల మహిళల వసతి గృహాల్లోని బాత్‌రూమ్‌లు, గదుల్లో ఇవి బయటపడ్డాయి. స్పై కెమెరాల విక్రయాలపై నియంత్రణ ఉండాలని న్యాయవాది శ్రీరమ్య కోర్టును కోరారు. అవి దుర్వినియోగమైతే చర్యలు తీసుకునేలా చట్టాలున్నాయని కేంద్రం తరఫు న్యాయవాది ముఖర్జీ కోర్టు దృష్టికి తెచ్చారు.ప్రతి మొబైల్‌లోనూ కెమెరాలు న్నాయని వాటిని ఎలా నియంత్రించగలమని ఈ సందర్భంగా సీజే ప్రశ్నించారు. మొబైల్ కెమెరాలను గుర్తించే అవకాశం ఉందని, స్పై కెమెరాలను రహస్యంగా అమర్చుతున్నారని న్యాయవాది శ్రీరమ్య చెప్పారు. స్పై కెమెరాల విక్రయాలపై మార్గదర్శకాలు జారీ చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. స్పై కెమెరా నియంత్రణ విధించే వస్తువు కాదని కేంద్రం తరఫు న్యాయవాది చెప్పారు. వీటి విక్రయాలపై కేంద్రానికి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమన్న హైకోర్టు, పిటిషన్‌పై విచారణను ముగించింది.

## తెలంగాణలో గ్రామ్‌పే ప్రారంభం

### ఐటి మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరణ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి19::తెలంగాణలో డిజిటల్ ఆర్థిక సమగ్రతను మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గ్రామ్‌పేను అధికారికంగా ప్రారంభించారు. వియోనా ఫిన్‌టెక్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ డిజిటల్ చెల్లింపులు, గ్రామీణ వాణిజ్య పరిష్కారం, అర్ధ పట్టణ, గ్రామీణ భారతదేశంలోని లక్షలాది మందికి ఆర్థిక ప్రాప్యత కల్పించేందుకు అనువుగా రూపొందించబడింది.గ్రామీణ ప్రాంతాల్లో 65కు పైగా జనాభా నివసిస్తున్న నేపథ్యంలో, ఆర్థిక సేవలు, డిజిటల్ వాణిజ్యం ఇంకా సరైన స్థాయిలో అందుబాటులోకి రాలేదు. గ్రామ్‌పే ఈ సమస్య ను పరిష్కరించేందుకు రక్షితమైన, వేగవంతమైన, బ్యాంకింగ్ ప్రమాణాలకు అనుగుణమైన డిజిటల్ చెల్లింపులను అందిస్తోంది. చిన్న వ్యాపారులు, రైతులు, స్వయం ఉపాధి పొందే వ్యక్తులకు డిజిటల్ వాణిజ్యంలో పాల్గొనేలా చేయడం, నగదుపై ఆధారాన్ని తగ్గించడం, ఆర్థిక భద్రత పెంచడం ఈ ప్లాట్‌ఫామ్ లక్ష్యంగా పెట్టుకుంది. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరించేందుకు సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 'గ్రామ్‌పే భారతదేశ డిజిటల్,ఆర్థిక సమగ్రత లక్ష్యానికి దారితీసే విప్లవాత్మక ఆవిష్కరణ. డిజిటల్ చెల్లింపులు, గ్రామీణ వాణిజ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా,గ్రామీణ ప్రజలకు ఆర్థిక సేవలు చేరువ కావడమే కాకుండా, అవి వారికి హక్కుగా మారతాయి' అని అన్నారు.

# క్రీడలకు రూ.465 కోట్లు

## శాట్ చైర్మెన్ శివసేనారెడ్డి హర్షం

హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త : బడ్జెట్‌లో క్రీడా రంగానికి రూ.465 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే రూ. 100 కోట్లు అదనంగా కేటా యింపులు చేశారు. తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు హకీంపేట్‌లోని క్రీడా పాఠశాలలోని సుమారు 200 ఎకరాల సువిశాల క్యాంపస్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామని, ఫోర్త్ సిటీలో స్పోర్ట్స్ హబ్ సహా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో క్రీడా సదుపాయాలు కల్పిస్తామని బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి భట్టి విక్ర మార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీలో 12 క్రీడా అకాడమీలు నెలకొల్పనున్నారు. ఈ ఏడాది కొత్త స్టేడియాల నిర్మాణం కోసం రూ.81.81 కోట్లు, రాష్ట్ర క్రీడా సంఘాల గ్రాంట్ సహా ప్రతిభావంతులైన క్రీడాకారుల నగదు ప్రోత్సాహకాలకు రూ.16.6 కోట్లు, స్పోర్ట్స్ స్కూల్స్ అభివృద్ధికి రూ.51.68 కోట్లు సహా శాట్స్ నూతనంగా చేపట్టబోతున్న క్రీడాభివృద్ధి కార్యక్రమాలకు రూ.275 కోట్లు కేటాయించటం హర్షనీయనీయమన్నారు.

# అబద్ధాలు, అంకెలు, అప్పులు, దోపిడీలో బిఆర్ఎస్ సర్కార్‌ను మించిన కాంగ్రెస్

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: ఇచ్చిన హామీలను నెలబెట్టుకునే మోడీ సర్కార్‌తో గోబెల్స్‌ను మించి అబద్దాలు కోరు కాంగ్రెస్‌కు పోలికా? అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే డొల్ల అని తెలిపోయిందన్నారు. ముఖ్యంగా గత బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను పరిశీలిస్తే పొంతనే లేదని తేలిపోయిందని, అయినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు పెంచి తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేసేందుకు బడ్జెట్‌ను సాధనంగా ఉప యోగించుకోవడం సిగ్గుచేటు అన్నారు. 6 గ్యారంటీలను పూర్తిగా తుంగలో తొక్కేశారని మండిపడ్డారు. అప్పులు చేయడంలో, ఆస్తుల అమ్మడంలో, రాష్ట్రాన్ని దివాళా తీయడంలో, ప్రజలపై భారం మోపడంలో, అబద్దాలను ప్రచారం చేయడంలో, అవినీతి, దోపిడీలో కెసిఆర్ ప్రభుత్వాన్ని మించిపోయినట్లు కన్పిస్తోందన్నారు. వాస్తవిక ఖర్చు వివరాలతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది బడ్జెట్ కేటాయింపులు, వాస్తవిక ఖర్చు వివరాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నామని అన్నారు.

**అన్ని వర్గాల ప్రజలకు మోసం**

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు**

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇదే చివరి బడ్జెట్ అవుతుందేమోనని ప్రజలు భావిస్తున్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బడ్జెట్ రూపకల్పన చేయడమే తెలియదన్నట్లుగా ఉందని, తెలంగాణ రాష్ట్రాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల అప్పులపాలు చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల కాలంలో లక్షా 52 వేల కోట్ల అప్పు చేసిందని చెబుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసపూరితంగా ఉందని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ అన్నారు. పెన్షన్ పెంపు కోసం బడ్జెట్లో నిధులేందుకు కేటాయించలేదని బీజేపీ దివ్యంగుల సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన అన్యాయాన్నే 2025-26 బడ్జెట్లో చేసిందని విమర్శించారు.

# ఐపిఎల్ చరిత్రలో ఐదు అతిపెద్ద వివాదాలు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలోనే అతిపెద్ద లీగ్‌గా మారింది. అటువంటి ఐపిఎల్ చరిత్రలో ఐదు అతిపెద్ద వివాదాలు మాయని మచ్చలా మిగిలాయి. ఇప్పటివరకు జరిగిన ఐపిఎల్ చరిత్రలో ఐదు అతి పెద్ద వివాదాలు చోటు చేసుకున్నాయి. హర్భజన్ సింగ్, శ్రీశాంత్ చెంపదెబ్బ సంఘటన ఐపిఎల్‌ను ఉద్రిక్తతకు దారితీశాయి. ఐపిఎల్ 2013లో భాగంగా 12వ రోజున, మైదానంలో ఒక పెద్ద సంఘటన చోటు చేసుకుంది. ముంబై ఇండియన్స్ జట్టు పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఆ తర్వాత, హర్భజన్ సింగ్‌ను దురదృష్టవంతుడు అంటూ శ్రీశాంత్ పిలిచాడు. దీంతో భజ్జీ కోపంతో మైదానంమధ్యలో శ్రీశాంత్‌ను

## ఫిక్సింగ్‌తో సహా మాయని మచ్చలు

చెంపదెబ్బ కొట్టాడు. దాంతో శ్రీశాంత్ ఏడుస్తూ కనిపించడంతో ఇష్యూ తీవ్రమైంది. ఈ చర్య కారణంగా భజ్జీపై సీజన్ మొత్తం నిషేధం విధించారు. ఐపిఎల్ 2013లో ఫిక్సింగ్, బెట్టింగ్ కుంభకోణం కుదిపేసింది. స్పాట్ ఫిక్సింగ్ కేసులో రాజస్థాన్ రాయల్స్‌కు చెందిన ముగ్గురు ఆటగాళ్లు శ్రీశాంత్, అంకిత్ చవాన్, అజిత్ చండిలా పేర్లు బయటకు రావడంతో వారిపై బిసిసిఐ జీవితాంతం నిషేధం విధించింది. ఇది కాకుండా, బెట్టింగ్ కేసులో, చెన్నై యజమాని ఎన్ శ్రీనివాసన్ అల్లుడు గురునాథ్ మెయ్యప్పన్, రాజస్థాన్ యజమాని రాజ్ కుంద్రాను బిసిసిఐ దోషులుగా నిర్ధారించింది. దీంతో రాజస్థాన్, చెన్నై జట్లపై 2016, 2017లో నిషేధం విధించింది. అలాగే రవీంద్ర జడేజాపై ఏడాది నిషేధం కూడా పెద్ద వివాదమైంది. ఐపిఎల్‌లో తమ జట్టు తరపున ఆడటానికి ఆటగాళ్లకు ఫ్రాంచైజీలు భారీ మొత్తంలో డబ్బు ఎర వేస్తుంటాయి. భారత స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఈ ఉచ్చులో చిక్కుకున్నాడు. అతను రాజస్థాన్ రాయల్స్ జట్టులో భాగమైనప్పుడు, ఎవరికీ తెలియజేయకుండా ముంబై ఇండియన్స్‌లో చేరడానికి ఒప్పందంపై సంతకం చేశాడు. దీంతో జడేజా ఒక సంవత్సరం పాటు నిషేధానికి గురయ్యాడు. కాగా కోహ్లీ, గంభీర్ మధ్య వాగ్వాదం కూడా వివాదాన్ని సృష్టించింది. ఐపిఎల్‌లో టీం ఇండియా ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మధ్య కూడా గొడవ జరిగింది. ఐపిఎల్‌లో కెకెఆర్, ఆర్‌సిబి మధ్య జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ రాంగ్ షాట్ ఆడి ఔట్ అయ్యాడు. గంభీర్ అతనితో ఏదో అన్నాడు, ఆ తర్వాత ఇద్దరు ఆటగాళ్ల మధ్య చాలా వాడీవేడీ మాటల యుద్ధం కనిపించింది. మైదానంలో ఉన్న ఇతర ఆటగాళ్లు ఇద్దరినీ విడదీసే సమయానికి, విషయాలు చాలా దూరం వెళ్లాయి. ఇక ఐపిఎల్‌కు జన్మనిచ్చిన లలిత్ మోడీని 3 సీజన్ల తర్వాత లీగ్ నుంచి బయటకు పంపించారు. ఐపిఎల్ ఆర్థిక విషయాల్లో లలిత్ మోడీ అవకతవకలు చేశాడు. దీని కారణంగా అతన్ని లీగ్ నుంచి బహిష్కరించారు. రాజస్థాన్ రాయల్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్ల అనుమానాస్పద వేలం, సోనీతో ప్రసార ఒప్పందంలో అవకతవకలు వంటి 5 ప్రధాన కేసుల్లో లలిత్ మోడీ నిందితుడిగా పరిగణించారు.


## లెజెండ్స్ లీగ్ ఫైనల్లో.. ఛాంపియన్‌గా ఆసియా స్టార్స్

### 6 వికెట్ల తేడాతో ఇండియన్ రాయల్స్ ఓటమి




**న్యూఢిల్లీ:** ఆసియా లెజెండ్స్ లీగ్-2025లో ఆసియా స్టార్స్ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో ఇండియన్ రాయల్స్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి ట్రోఫీని సొంతం చేసుకుంది. ఉదయ్‌పూర్‌ని మిరాజ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ టోర్నీలో గ్రూప్ దశలో టాపర్‌గా నిలిచిన ఇండియన్ రాయల్స్ ఫైనల్లో ఆసియా స్టార్స్ చేతిలోచిత్తైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్స్ 19.5 ఓవర్లలో 148 పరుగులకే ఆలౌటైంది. ఆసియా బౌలర్లు ఈశ్వర్ పాండే (4-0-31-3), మునవీర (4-0-33-2), రిషి ధవన్ (3.5-0-27-2), పవన్ సుయాల్ (4-0-19-1) రాయల్స్‌ను దెబ్బతీశారు. రాయల్స్ ఇన్నింగ్స్‌లో సంజయ్ సింగ్ (57) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు. మిగతా బ్యాటర్లు ఒక్కరు కూడా కనీసం 20 పరుగులు చేయలేకపోయారు. నమన్ ఓఝా 5, రాహుల్ యాదవ్ 4, కెప్టెన్ ఫయాజ్ ఫజల్ 11, నగార్ 16, మనన్ శర్మ 14, సక్సేనా 15, బిపుల్ శర్మ 5, గోని 2, అనురీత్ సింగ్ 15 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఆసియా స్టార్స్ 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి రాయల్స్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించింది. బౌలింగ్‌లో పర్వాలేదనిపించిన రిషిధవన్ (57 బంతుల్లో 83; 11 ఫోర్లు, సిక్స్) బ్యాటింగ్‌లో రెచ్చిపోయి తన జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ధవన్కు మరో ధవన్ (రాఘవ్) సహకరించాడు. రాఘవ్ ధవన్ 29బంతుల్లో 37 పరుగులు చేసి ఆసియా స్టార్స్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఆసియా స్టార్స్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ మెహ్రాన్ ఖాన్ డకౌట్ కాగా, కశ్యప్ ప్రజాపతి 15, దిల్షన్ మునవీర 2, సరుల్ కన్వర్ 2 (నాటౌట్) పరుగులు చేశారు. ఇండియన్ రాయల్స్ బౌలర్లలో మన్‌ప్రీత్ గోని, అనురీత్ సింగ్, బిపుల్ శర్మ, మనన్ శర్మ తలో వికెట్ తీశారు. ఈ టోర్నీలో ఇండియన్ రాయల్స్ తరఫున టీమిండియా ప్లేయర్లు శిఖర్ ధవన్, మునాఫ్ పటేల్, మనోజ్ తివారి, సుబ్రమబ్రణ్యం బద్రీనాథ్ ఆడారు. కాగా ఈ టోర్నీలో ఆసియా ప్రాంతానికి చెందిన ఐదు జట్లు పాల్గొన్నాయి. (ఇండియన్ రాయల్స్, ఆసియా స్టార్స్, శ్రీలంక లయన్స్, ఆఫ్ఘనిస్తాన్ పఠాన్స్, బంగ్లాదేశ్ టైగర్స్) పాల్గొన్న ఈ టోర్నీలో ఆసియా స్టార్స్ విజేతగా అవతరించింది.

## డోప్ టెస్ట్‌లో భారత రన్నర్ అర్చనపై వేటు



**న్యూఢిల్లీ:** సామాజిక డోప్ పరీక్షలో విఫలమైన కారణంగా భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ అర్చన జాదవ్‌పై వేటు పడింది. అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఎఐయు) ఆమెపై నాలుగు సంవత్సరాల పాటు నిషేధాన్ని విధించింది. ఈ విషయంపై పదే పదే గుర్తు చేసినప్పటికీ ఆమె పోటీలో పాల్గొనలేదు, దీనితో ప్రపంచ అథ్లెటిక్స్ ఆమె చర్యలను నేరాన్ని అంగీకరించినట్లుగా భావించింది. గత ఏడాది డిసెంబర్‌లో పూణే హాఫ్ మారథాన్‌లో సేకరించిన జాదవ్ నమూనాలో నిషేధిత పదార్థం ఆక్సాండ్రోలోన్ ఉందని వరల్డ్ అథ్లెటిక్స్ అథ్లెట్స్ ఇంటిగ్రిటీ యూనిట్ తెలిపింది. ఈ సింథటిక్ అనాబాలిక్ స్టెరాయిడ్ వాడకంతో శరీరంలో ప్రోటీన్ ఉత్పత్తి మరియు కండరాల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుందని పేర్కొంది. జనవరి 7 నుండి నిషేధం అమల్లోకి వచ్చింది. జాదవ్ ఈ కాలం పాటు తాత్కాలిక సస్పెన్షన్‌లో ఉన్నారు. ఫిబ్రవరి 25న, ఆమె ఎఐయుకు పంపిన ఈమెయిల్‌లో ఉల్లంఘన ఆరోపణకు సమాధానంగా 'క్షమించండి. మీ నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నాను' అని పేర్కొంది. ఈ కమ్యూనికేషన్ గురించి తాము అర్థం చేసుకున్న దాని ప్రకారం, జాదవ్ విచారణ అవసరం లేదని మరియు శరీరం నుండి తీసుకున్న శాంపిల్ పరీక్షలతో నిర్ణయం తీసుకున్నట్లు ఎఐయు తెలిపింది. అయితే, జాదవ్‌కు తాను డోపింగ్ నిరోధక నియమ ఉల్లంఘనలకు పాల్పడినట్లు అంగీకరించడానికి మార్చి 3 వరకు సమయం ఉందని ఆమెకు సమాచారం అందినట్లు ఫిబ్రవరి 28న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా ఈ విషయాన్ని గుర్తు చేసిందని తెలిపింది. అయితే, జాదవ్ నుండి ఎఐయుకు ఎటువంటి స్పందన రాలేదు. డోపింగ్ నిరోధక నియమ ఉల్లంఘనలు ఉద్దేశపూర్వకంగా జరగలేదనేది జాదవ్ నిరూపించలేదని పేర్కొంది.

## స్విస్ వరల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీలో .. మెయిన్ డ్రా కు భారత్

**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో మెయిన్ డ్రా కు భారత్ ప్లేయర్లు దూసుకెళ్లారు. ఈ టోర్నీలో పురుషుల విభాగం నుండి భారత్ తరపున ముగ్గురు క్రీడాకారులు ఆయుశ్ శెట్టి, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్, సతీశ్ కుమార్ కరుణాకరన్, మమిళల విభాగంలో ఇషారాణి బారువా మెయిన్ డ్రా కు అర్హత సాధించారు. బాసెల్‌లో జరిగిన క్వాలిఫయింగ్ పోటీల్లో ఆయుశ్, శంకర్, సతీశ్ తాము ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి మెయిన్ డ్రా బెర్త్‌లను దక్కించుకున్నారు. ఆయుశ్ తొలి రౌండ్‌లో 21-12, 21-15తో ఇంగ్లండ్‌కు చెందిన చోలన్ కయాన్ పై, రెండో రౌండ్‌లో 21-6, 21-8తో ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ గావోఇస్‌పై గెలిచాడు. అలాగే శంకర్ తొలి రౌండ్‌లో 21-13, 21-4తో ఇంగ్లండ్‌కు చెందిన యువెహాంగ్ వాంగ్ పై, రెండో రౌండ్‌లో 21-7, 21-10తో భారత్‌కే చెందిన మన్నేపల్లి తరుణ్ పై నెగ్గాడు. ఇక సతీశ్ తొలి రౌండ్‌లో 21-13, 21-9తో పోర్చుగల్‌కు చెందిన బ్రూనో కర్వాలోపై, రెండో రౌండ్‌లో 19-21, 21-19, 21-16తో మలేషియాకు చెందిన జస్టిన్ హోపై విజయం సాధించాడు. కాగా మహిళల సింగిల్స్‌లో భారత్‌కే చెందిన ఇషారాణి బారువా మెయిన్ డ్రాకు చేరుకోగా, వలిశెట్టి శ్రియాన్సి విఫలమైంది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఇషారాణి 21-16, 21-11తో ఫ్రాన్స్‌కు చెందిన రోసీ పాన్‌కసారిపై గెలుపొందింది.

## మహిళల వన్డేలో..క్వార్టర్ ఫైనల్లో హార్యానా



### కర్ణాటకపై 6 వికెట్ల తేడాతో విజయం

**న్యూఢిల్లీ:** డాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ జాతీయ టోర్నీలో బంతితో మెరిసింది. మహిళల అండర్-23 వన్డే ట్రోఫీలో హ్యాట్రిక్ వికెట్లతో అదరగొట్టింది. దీంతో హార్యానా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గువాహటిలో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్ హార్యానా జట్టు 6 వికెట్ల తేడాతో కర్ణాటకపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 49.3 ఓవర్లలో 217 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇన్నింగ్స్ 44వ ఓవర్ వేసిన షఫాలీ వర్మ (3/20) ఐదో బంతికి సలోని (50 బంతుల్లో 30; 4 ఫోర్లు), ఆరో బంతికి సౌమ్య వర్మ (0) లను అవుట్ చేసింది. మళ్లీ 46వ ఓవర్ వేసిన ఆమె తొలి బంతికే నమిత డిసౌజా (1) ను బౌల్డ్ చేయడంతో హ్యాట్రిక్ పూర్తయ్యింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హార్యానా 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసి గెలిచింది. ఓపెనింగ్ చేసిన షఫాలీ (18) తక్కువ స్కోరుకే పరిమితం కాగా, సోనియా (79 బంతుల్లో 66; 8 ఫోర్లు), తనీషా (77 బంతుల్లో 77 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. ఇటీవలే కాగా ముగిసిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో షఫాలీ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున విశేషంగా రాణించింది. అయితే ఫైనల్లో ఢిల్లీ మళ్లీ ఓడి వరుసగా మూడోసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ముంబై ఇండియన్స్ రెండో డబ్ల్యూపిఎల్ టైటిల్‌ను సాధించింది. ఈ సీజన్ లీగ్ టాప్ స్కోరర్లలో ఆమె 304 పరుగులతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈమె కంటే ముందు వరుసలో నాట్ సివర్ (523), ఎలీస్ పెరి (372), హేలీ మాథ్యూస్ (307) ఉన్నారు. భారత బ్యాటర్లలో షఫాలీనే టాప్ స్కోరర్ కావడం విశేషం. గతేడాది టి20 ప్రపంచ కప్ అనంతరం జట్టులో స్థానం కోల్పోయిన ఆమె తిరిగి జాతీయ జట్టులోకి వచ్చేందుకు పట్టుదలగా రాణిస్తోంది.

# వాణిజ్యం

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మార్చి 19:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా, కనిష్టాల వద్ద దేశీయంగా కొనుగోళ్ల మద్దతు సూచీలను నడిపించింది. ముఖ్యంగా ఫైనాన్షియల్ స్టాక్స్, అధిక వెయిటేజీ ఉన్న స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఐటి, ఎఫ్ఎంసిజి షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇవి మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లూ లాభాల్లో ముగిసాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీలూ రెండు శాతం మేర పుంజుకున్నాయి. సెన్సెక్స్ 75,43.17 పాయింట్ల లాభాల్లో ప్రారంభమై, ఇంట్రాడేలో 75,568.38 పాయింట్ల వద్ద గరిష్టాన్నికి చేరి, చివరికి సెన్సెక్స్ 147.79 పాయింట్లు పెరిగి 75,449.05 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 73.30 పాయింట్లు పెరిగి 22,907.05 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.44గా ఉంది. టాటాస్టీల్, జొమాటో, పవర్‌గ్రిడ్ కార్పొరేష్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటి షేర్లు పుంజుకున్నాయి. టెక్ మహీంద్రా, టిసిఎస్, ఐటిసి, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 70 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3037 డాలర్ల వద్ద ట్రేడయింది.




## జియో ఫైనాన్షియల్‌తో అలయన్స్ ఎస్‌ఇ జెవి!




**న్యూఢిల్లీ, మార్చి 19:** జర్మనీకి చెందిన బీమా దిగ్గజం అలియాంజ్ ఎస్‌ఇ ముఖేష్ అంబానీ నేతృత్వంలోని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో కొత్తజాయింట్ వెంచర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బజాజ్ గ్రూప్‌తో తనకున్న 24యేళ్ల భాగస్వామ్యానికి ముగింపు పలికిన సంస్థ తాజాగా జియోతో జట్టు కోసం సన్నాహాలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక వేళ ఇదే జరిగితే జీవిత, సాధారణ బీమా మార్కెట్‌లో ఇది అలియాంజ్ రెండో జాయింట్ వెంచర్ కానుంది. బజాజ్ అలియాంజ్ జనరల్‌ఇన్సూరెన్స్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో తనకున్న 26 శాతం వాటాను 2.8 బిలియన్ డాలర్లకు విక్రయించేందుకు బజాజ్ గ్రూప్‌తో తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో రెండు దశాబ్దాలకుపైగా బజాజ్ గ్రూప్ భాగస్వామ్యానికి ముగింపు పలికింది. అయితే చాలా కాలం కిందటే జియో ఫైనాన్షియల్ యాజమాన్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, అలియాంజ్ మధ్య ఈ భాగస్వామ్యం కోసం నెలలతరబడిచర్చలు జరిగాయని తెలుస్తోంది. బజాజ్‌తో భాగస్వామ్యాన్ని విడిచి పెట్టాలని ఆలోచిస్తున్నట్లు అలియాంజ్ గతేడాది అక్టోబర్‌లో ప్రకటించింది. అప్పటి నుంచి ఈ చర్చలు మరింత వేగవంతం అయ్యాయని తెలిసింది.

## ఐపిఒకు వస్తున్న రెండు కంపెనీలు

**ముంబై, మార్చి 19:** కేపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబి తాజాగా పబ్లిక్‌ఇష్యూ చేపట్టేందుకు రెండు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ జాబితాలో వైట్‌గూడ్స్ దిగ్గజం ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియాతోపాటు మానవ వనరులు, టోల్‌ప్లాజా నిర్వాహఖ సర్వీసుల సంస్థ ఇన్నోవిజన్ లిమిటెడ్ చేరాయి. రెండు కంపెనీలు 2024 డిసెంబరులో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలుచేశాయి. దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జి అనుబంధ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్‌కు సన్నద్ధమవుతోంది. ఇందుకు ఇప్పటికే రోడ్‌షోలు ప్రారంభించగా, తాజాగా సెబి నుంచి అనుమతి పొందింది. ఐపిఒలో భాగంగా 15శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను మాతృ సంస్థ విక్రయానికి ఉంచనుంది. తద్వారా సుమారు రూ.15వేల కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపిఒ పూర్తయితే కార్ల తయారీ దిగ్గజం హ్యుండాయ్ మోటార్స్ ఇండియా తదుపరి దేశీయంగా లిస్టయిన రెండో దక్షిణ కొరియా దిగ్గజంగా ఎల్‌జి నిలవనుంది. హ్యుండాయ్ గతేడాది అక్టోబరులో లిస్టయింది. ఎల్‌జి ఇండియా ప్రధానంగా వాషింగ్ మెషీన్లు, లెడ్ టివిలు, ఎసిలు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్స్ తదితర పలు కన్జూమర్ ప్రొడక్టులను విక్రయించే విషయం విదితమే. దేశీయంగా నోయిడా, పుణెల్లో తయారీ యూనిట్లను కలిగి ఉంది. టోల్‌ప్లాజా మేనేజ్‌మెంట్ సర్వీసుల కంపెనీ ఇన్నోవిజన్ లిమిటెడ్ ఐపిఒలో భాగంగా రూ.255 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు మరో 17.72 లక్షల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ కేపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.




## అమెజాన్‌లో 14వేల ఉద్యోగాల కోత!

**వాషింగ్టన్, మార్చి 19:** ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా మేనేజింగ్ విభాగంలోని 14 వేల మందిని తొలగించబోతోందని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెజాన్ శ్రామికశక్తిలో ఈ సంఖ్య 13 శాతంతో సమానం. ఈ కొలువులు తొలగింపు వల్ల సంస్థకు ఏడాదికి రూ.210 కోట్ల నుంచి రూ.360 కోట్లు ఆదా అవుతుందని అంచనా. ఈ తొలగింపులు చేపడితే ఇ-కామర్స్ సంస్థలో మేనేజర్ల సంఖ్య 1.05 లక్షల నుంచి 91వేలకు తగ్గనుందని తెలిసింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఇటీవల కమ్యూనికేషన్, సస్టైయినబిలిటీ విభాగాల్లో ఉద్యోగాలను అమెజాన్ తొలగించింది. ఇప్పుడు మేనేజింగ్ విభాగంపై దృష్టి సారించింది. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచే అమెజాన్ ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందులోభాగంగా మేనేజర్లకు వచ్చే డైరెక్ట్ రిపోర్టుల సంఖ్యను పెంచింది. అలాగే, సీనియర్ లెవల్‌లో ఉద్యోగాల నియామకాన్ని కూడా పరిమితం చేసింది. పరిహారానికి సంబంధించిన విధివిధానాలను పునఃసమీక్షించుకోవడం వంటి చర్యలు చేపట్టింది. తాజాగా ఉద్యోగాల తొలగింపును చేపట్టేందుకు సిద్ధమవుతోంది. నిర్వహణ సామర్థ్యాలు, లాభదాయకతను పెంచుకోవడంపై గత కొన్నాళ్లుగా అమెజాన్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ ఏడాది జనవరి నుంచి వారానికి ఐదు రోజుల పాటు ఆఫీసుకు రావాలని ఉద్యోగులకు కంపెనీ సీఈఓ ఆండీ జాస్సీ పేర్కొన్నారు. అప్పుడే వేగంగా నేర్చుకోవడంతో పాటు తోటివారితో మెరుగైన సంబంధాలు కలిగి ఉండడానికి కారణమవుతుందన్నారు. కొవిడ్ సమయంలో అమెజాన్ ఉద్యోగుల సంఖ్యను భారీగా పెంచుకుంది. దీంతో 2019 నాటికి రూ.7.98 లక్షలుగా ఉన్న సంఖ్య 2021 నాటికి రూ.16 లక్షలకు పెరిగింది. ఆపై ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా 2022, 2023లో వివిధ సందర్భాల్లో 27 వేల మందిని తొలగించింది.




## హెచ్‌డిబి ఫైనాన్షియల్, హీరో ఫిన్‌కార్ప్ ఐపిఒల్లో జాప్యం!

**ముంబై, మార్చి 19:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హీరో మోటోకార్ప్ అనుబంధ బ్యాంకింగేతర ఆర్థికసంస్థలైన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, హీరో ఫిన్‌కార్ప్ పబ్లిక్ ఇష్యూల రాక ఆలస్యం కానుంది. ప్రీఐపీఓ షేర్ల విక్రయాలకు సంబంధించి నిబంధనల్ని ఉల్లంఘించే అవకాశం ఉందన్న అనుమానంతో ఇరు సంస్థలకు అనుమతుల్ని ఇచ్చేందుకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) జాప్యం చేస్తోందని వార్తలు వస్తున్నాయి. హెచ్‌డీబీ ఫైనాన్షియల్, హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓ ప్రణాళికను గతేడాదిలోనే ప్రకటించాయి. అప్పటినుంచి వీటి పబ్లిక్ ఇష్యూ రాక కోసం ఇన్వెస్టర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సెబి నుంచి అనుమతులు రావడమే ఆలస్యం. అయితే సెబి మాత్రం ఇరు సంస్థలకు అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తోంది. హీరో ఫిన్‌కార్ప్ గతేడాది ఆగస్టులోనే డీఆర్‌హెచ్‌పీ ఫైల్ చేయగా.. అప్పటి నుంచి (ఎనిమిది నెలలుగా) సెబి వద్ద ఈ దరఖాస్తు పెండింగ్‌లోనే ఉంది. ఇక హెచ్‌డిబి దరఖాస్తు కూడా నాలుగు నెలలుగా సెబి వద్ద పెండింగ్‌లో ఉంది. వాడని కంపెనీల చట్టం ప్రకారం.. అన్‌లిస్టెడ్ కంపెనీలు ఒక ఆర్థిక సంవత్సరంలో 200 కంటే ఎక్కువ మంది వాటాదారులను చేర్చుకోకూడదు. ఒకేసారి 50 మంది కంటే ఎక్కువ వ్యక్తులకు ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా వాటాను విక్రయించకూడదు. ఒకవేళ ఆరు నెలల వ్యవధిలో పబ్లిక్ షేర్ హోల్డర్లకు ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా షేర్లను జారీ చేస్తే వాటిని పబ్లిక్ ఇష్యూగా పరిగణిస్తారు. ఈ నిబంధనల్ని ప్రీ ఐపీఓ షేర్ల విక్రయం ద్వారా ఇరు సంస్థలు ఉల్లంఘించే అవకాశం ఉందన్న అనుమానంతో సెబి అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తోందని కథనాలు వస్తున్నాయి. ఈవిషయంపై హీరో ఫిన్‌కార్ప్, హెచ్‌డిబి ఫైనాన్షియల్ తోసిపుచ్చాయి. దీనిపై సెబి నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు.




## ఎంజి కామెట్ 'ఇవి 2025' ఆన్‌రోడ్

**ముంబై, మార్చి 19:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ జెఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా కామెట్ విద్యుత్ కారు 2025 ఎడిషన్‌ను లాంచ్ చేసింది. ఈ కాంపాక్ట్ ఎలక్ట్రిక్ కారు ధరను రూ.4.99 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ ఆప్షన్‌లో భాగంగా తీసుకొచ్చారు. అంటే బ్యాటరీకి కిలోమీటర్‌కు రూ.2.5 చొప్పున అద్దె రూపంలో కంపెనీకి చెల్లించాల్సి ఉంటుంది. ఎగ్జిక్యూటివ్, ఎక్సైట్, ఎక్సైట్ ఫాస్ట్ ఛార్జ్, ఎక్స్‌క్లూజివ్, ఎక్స్‌క్లూజివ్ ఫాస్ట్ ఛార్జింగ్ ఇలా ఐదు వేరియంట్లలో లభిస్తుంది. ఎక్సైట్, ఎక్సైట్ ఎఫ్‌సి వేరియంట్‌ల్లో కొత్తగా పార్కింగ్ కెమెరా, పవర్-ఫోల్డింగ్ ఒఆర్‌ఎంలతో ఇచ్చారు. ఇక ఎక్స్‌క్లూజివ్, ఎక్స్‌క్లూజివ్ ఫాస్ట్ ఛార్జింగ్ వేరియంట్‌లో కొత్తగా లెథర్ సీట్లు, 4-స్పీకర్ ఆడియో సిస్టమ్ ఇచ్చారు. అన్ని ఎఫ్‌సి వేరియంట్లు 17.4 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తోంది. ఇవి సింగిల్ ఛార్జ్‌తో 230 కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చు. డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్స్, ఎబిఎస్, రేర్ పార్కింగ్ సెన్సర్, స్పీడ్- సెన్సింగ్ ఆటో డోర్ లాక్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, రివర్స్ పార్కింగ్ కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, హోమ్ హెడ్‌ల్యాంప్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటి ఫీచర్లున్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *r esponsible for selection of News under the Pr B Act. r NI No.APTEL/2001/7563.Postal Licence r egd. No. H/KAr /89/12-14